MEDICOVER HOSPITALS

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

MEDICOVER HOSPITALS

బుధవారం | 25-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 179 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి మ. 12.11 తదుపరి నవమి; నక్షత్రం: ఆర్ద్ర రా. 10.23 తదుపరి పునర్వసు వర్జ్యం: ఉ. 6.28-8.06; దుర్ముహూర్తం: ఉ. 11.42-12.30; అమృతఘడియలు: మ. 12.10-1.48; రాహుకాలం: మ. 12.00-1.30; సూర్యోదయం: 6.07; సూర్యాస్తమయం: 6.05 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఆంధ్రజ్యోతి
బిజినెస్
వరంగల్ ● బుధవారం 25 సెప్టెంబరు 2024

ఎస్‌ఎంఈ ఐపీఓల్లో మాయ

మర్చంట్ బ్యాంకర్లే సూత్రధారులు... నిగ్గు తేల్చిన సెబీ దర్యాప్తు!

న్యూఢిల్లీ: ఎస్‌ఎంఈ పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ) భారీగా సబ్‌స్క్రిప్షన్ కావడం వెనక పెద్ద దందానే నడుస్తోంది. కొన్ని సంస్థలు, హై నెట్‌వర్త్ ఇన్వెస్టర్ల (హెచ్‌ఎన్‌ఐ) సాయంతో మర్చంట్ బ్యాంకర్లే ఈ దందా నడిపిస్తున్నట్టు సెబీ దర్యాప్తులో తేలినట్టు సమాచారం. ఈ సంస్థలు, హై నెట్‌వర్త్ ఇన్వెస్టర్లు పెద్దమొత్తంలో ఐపీఓ షేర్లకు దరఖాస్తు చేయడం, తీరా షేర్ల కేటాయింపు సమయానికి తమ బిడ్స్ వెనక్కి తీసుకుంటున్నట్టు పేరు వెల్లడించేందుకు ఇష్టపడని సెబీ అధికార వర్గాలు చెప్పాయి. ఈ ఓవర్ సబ్‌స్క్రిప్షన్ చూసి ఇష్యూ బాగుందనే భావనతో రిటైల్ మదుపరులూ భారీగా దరఖాస్తు చేసి మోసపోతున్నట్టు సెబీ దర్యాప్తులో తేలింది. ఈ దందాలో పాత్ర ఉన్న ఆరు మర్చంట్ బ్యాంకర్లని సెబీ ఇప్పటికే గుర్తించింది.

15 శాతం ఫీజు: సెబీ నిబంధనల ప్రకారం ఏ మర్చంట్ బ్యాంకింగ్ సంస్థా, కంపెనీలు ఐపీఓ ద్వారా సమీకరించే నిధుల్లో ఒకటి నుంచి మూడు శాతానికి మించి ఫీజుగా వసూలు చేయకూడదు. అయితే ఈ ఆరు మర్చంట్ బ్యాంకులు, ఈ ఓవర్ సబ్‌స్క్రిప్షన్ దందా నడిపినందుకు తమ క్లయింట్ల నుంచి ఐపీఓ నిధుల్లో 15 శాతం వరకు ఫీజుగా వసూలు చేస్తున్నట్టు తేలింది. దీంతో త్వరలోనే ఈ మర్చంట్ బ్యాంకర్లపై సెబీ క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఎస్‌ఎంఈల ఐపీఓల్లో ఏదో మాయ జరుగుతున్నట్టు చాలా కాలంగా వార్తలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సెబీ ఈ దర్యాప్తు జరిపి నిగ్గు తేల్చినట్టు భావిస్తున్నారు.



పుంజుకుంటున్న ప్రైవేట్ పెట్టుబడులు

రూ.4 లక్షల కోట్ల రుణాలకు ఆమోదం
ఈసారీ రెపో రేటు తగ్గకపోవచ్చు
ఎస్‌బీఐ చీఫ్ శ్రీనివాసులు శెట్టి



న్యూఢిల్లీ: దేశంలో ప్రైవేట్ పెట్టుబడులు మళ్లీ ఊపందుకుంటున్నాయి. దీంతో బ్యాంకు రుణాలకూ గిరాకీ పెరగనుందని దేశీయ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ చైర్మన్ శ్రీనివాసులు శెట్టి చెప్పారు. కొన్ని కంపెనీల వ్యాపార విస్తరణ కోసం రూ.4 లక్షల కోట్ల రుణాలు ఇచ్చేందుకు ఇప్పటికే తమ బ్యాంక్ ఆమోదం తెలిపినట్టు తెలిపారు. అయితే ఆ కంపెనీలకు సంబంధించి మరిన్ని విషయాలు పరిశీలించాక ఈ రుణాలు విడుదల చేస్తామన్నారు. నిన్న మొన్నటి వరకు అంతర్గత వనరులతో వ్యాపార విస్తరణ చేపట్టిన ప్రైవేట్ కంపెనీలు ఇప్పుడు బ్యాంకు రుణాల కోసం చూస్తున్నట్టు ఎస్‌బీఐ చీఫ్ చెప్పారు. రహదారులు, పునరుత్పాదక ఇంధన వనరులు, కొన్ని రిఫైనరీ సంస్థల నుంచి రుణాల కోసం దరఖాస్తులు అందుతున్నట్టు తెలిపారు.

అక్టోబరు నుంచి మరింత డిమాండ్

నిజానికి ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశంలో పెట్టుబడుల జోరు తగ్గింది. లోక్‌సభ ఎన్నికలు ఇందుకు ప్రధాన కారణం. జూలై నుంచి కొద్దిగా పుంజుకున్నాయి. అక్టోబరు నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పెట్టుబడులు రెండూ మరింత జోరందుకుంటాయని శెట్టి చెప్పారు. తమ అనుబంధ సంస్థలు వేటిలోనూ వాటా తగ్గించుకునే ఆలోచన లేదన్నారు. ఒకవేళ ఈ సంస్థల అభివృద్ధికి మరిన్ని నిధులు అవసరమైతే ఆ నిధులు సమకూర్చే విషయాన్నీ బ్యాంకు పరిశీలిస్తుందన్నారు. ప్రస్తుతానికైతే తమ అనుబంధ సంస్థలు వేటికీ తమ నుంచి నిధుల అవసరం లేదన్నారు. వచ్చే నెల 7-9 తేదీల మధ్య జరిగే ద్రవ్య విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశంలోనూ భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) కీలక రెపో రేటు పెంచకపోవచ్చన్నారు. ఆహార ద్రవ్యోల్బణం ఇంకా ఎక్కువగా ఉండడమే ఇందుకు ప్రధాన కారణమన్నారు.

బంగారం భగ ధగ!

అంతర్జాతీయ మార్కెట్లో పసిడి ర్యాలీ

న్యూయార్క్: ఫెడ్ రేట్ల తగ్గింపుతో పాటు పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో బులియన్ ధరలు క్రమంగా కొండెక్కుతున్నాయి. అంతర్జాతీయ స్పాట్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర మరో 18 డాలర్ల మేర పెరిగి 2,646 డాలర్లకు చేరుకుంది. ఫ్యూచర్స్ కాంట్రాక్టు ధర సైతం అర శాతానికి పైగా పెరిగి 2,666 డాలర్లకు ఎగబాకింది. కాగా, దేశీయంగా బంగారం ధర ఇప్పటికే రూ.77,000కు చేరువైంది. ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.76,950కి చేరుకుంది. కిలో వెండి రూ.90,000 ధర పలికింది. ఈ ఏడాదిలో ఇప్పటివరకు బంగారం ధర 28 శాతం వరకు పెరిగింది. అమెరికన్ సెంట్రల్ బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ ప్రామాణిక వడ్డీ రేట్లను 0.50 శాతం తగ్గించడంతో పాటు ఇజ్రాయెల్- లెబనాన్ మధ్య యుద్ధం తీవ్రతరం అవుతుండటం బులియన్ డిమాండ్‌ను ఎగదోస్తున్నాయని వారన్నారు.

విస్తరణ బాటలో రామ్‌రాజ్ కాటన్

వచ్చే రెండేళ్లలో కొత్తగా 200 స్టోర్లు



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): భారతీయ సాంప్రదాయ, సంస్కృతిని ప్రతిబింబించే విధంగా వస్త్రాలను తయారు చేసి విక్రయిస్తున్న రామ్‌రాజ్ కాటన్ తన కార్యకలాపాలను మరింతగా విస్తరించేందుకు రెడీ అవుతోంది. ప్రస్తుతం కంపెనీ దక్షిణ భారత్‌లో 300కు పైగా షోరూమ్స్‌ను నిర్వహిస్తోంది. కాగా విస్తరణలో భాగంగా వచ్చే రెండేళ్ల కాలంలో షోరూమ్స్‌ను 500కు చేర్చాలని చూస్తున్నట్లు రామ్‌రాజ్ కాటన్ చైర్మన్ కేఆర్ నాగరాజన్ వెల్లడించారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో ప్రస్తుతం రామ్‌రాజ్ 82 షోరూమ్స్‌ను నిర్వహిస్తుండగా వచ్చే ఏడాది మార్చి నాటికి కొత్తగా 28 స్టోర్స్‌ను ప్రారంభించాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. రామ్‌రాజ్ కాటన్ నాలుగు వేలకు పైగా వెరైటీలతో ప్రపంచంలోనే అతిపెద్ద ధోవతి ఉత్పత్తిదారుగా ఉందని ఆయన పేర్కొన్నారు. కార్యకలాపాల విస్తరణలో భాగంగా షర్టింగ్, నిట్‌వేర్ విభాగంతో పాటు చీరల విభాగంలోకి కూడా కంపెనీ ప్రవేశించిందన్నారు. ప్రస్తుతం రామ్‌రాజ్ కాటన్ తమిళనాడులో 10, బెంగళూరులో ఒక ప్లాంట్‌ను నిర్వహిస్తోందని నాగరాజన్ తెలిపారు. డిమాండ్‌కు తగ్గట్టుగా ఉత్పత్తి సామర్థ్యాలను పెంచేందుకు రూ.1,000 కోట్లు పెట్టుబడిగా పెట్టాలని నిర్ణయించామని, అయితే ఇందులో రూ.300 కోట్లు ఇప్పటికే ఖర్చు చేయగా, వచ్చే మూడేళ్ల కాలంలో మిగిలిన రూ.700 కోట్ల మొత్తాలను పెట్టుబడులుగా పెట్టనున్నట్లు నాగరాజన్ తెలిపారు.

సెన్సెక్స్ @ 85,000

ఇంట్రాడేలో 26,000కు నిఫ్టీ

సరికొత్త మైలురాయికి సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లో మళ్లీ రికార్డుల మోత మోగింది. ప్రామాణిక ఈక్విటీ సూచీలు మంగళవారం ట్రేడింగ్‌లో సరికొత్త గరిష్ఠాలకు ఎగబాకాయి. సెన్సెక్స్ తొలిసారిగా 85,000, నిఫ్టీ 26,000 మైలురాయిని తాకాయి. కానీ, ఇన్వెస్టర్లు ఎఫ్‌ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడటంతో సూచీలు మిశ్రమంగా ముగిశాయి. సెన్సెక్స్ ఒక దశలో 234.62 పాయింట్లు పెరిగి 85,163.23 వద్ద ఆల్‌టైం ఇంట్రాడే రికార్డును నమోదు చేసింది. చివరికి సూచీ 14.57 పాయింట్ల నష్టంతో 84,914.04 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఒక దశలో 72.5 పాయింట్లు ఎగబాకి 26,011.55 వద్ద సరికొత్త ఆల్‌టైం గరిష్ఠాన్ని నమోదు చేసినప్పటికీ, చివర్లో 1.35 పాయింట్ల లాభంతో 25,940.40 వద్ద క్లోజైంది. మార్కెట్ భవిష్యత్ గమనంపై స్పష్టత లోపించడంతో ఇన్వెస్టర్లు రికార్డు గరిష్ఠాల వద్ద లాభాలను స్వీకరిస్తున్నారని ఈక్విటీ నిపుణులు పేర్కొన్నారు. సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో సగం లాభపడ్డాయి. టాటా స్టీల్ షేరు 4.29 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. పవర్‌గ్రిడ్ 2.65 శాతం రాణించగా.. టెక్ మహీంద్రా, హెచ్‌సీఎల్ టెక్ ఒక శాతానికి పైగా పెరిగాయి. హెచ్‌యూఎల్ షేరు మాత్రం అత్యధికంగా 2.56 శాతం క్షీణించింది.

మెటల్ షేర్లు జిగేల్

చైనా తన ఆర్థిక వ్యవస్థకు, స్థిరాస్తి మార్కెట్‌కు ఊతమిచ్చేలా ప్రామాణిక వడ్డీ రేట్లను తగ్గించడంతోపాటు అదనపు ఉద్దీపనలను ప్రకటించడం అంతర్జాతీయ మార్కెట్లకు సానుకూలంగా పరిణమించింది. దేశీయంగా లోహ రంగ షేర్లకు గిరాకీ పెరిగింది. నేషనల్ అల్యూమినియం షేరు ఏకంగా 6.16 శాతం ఎగబాకగా.. టాటా స్టీల్ 4 శాతానికి పైగా పుంజుకుంది. హిందాల్కో, ఎన్‌ఎండీసీ, వేదాంత, సెయిల్ షేర్లు మూడు శాతానికి పైగా రాణించాయి. బీఎస్ఈలో మెటల్ ఇండెక్స్ 2.78 శాతం పెరిగింది.

3 సెషన్లలో 1,000 పాయింట్లు

సెన్సెక్స్ కేవలం 3 ట్రేడింగ్ సెషన్లలో 1,000 పాయింట్లు పెరిగి 84,000 నుంచి 85,000 మైలురాయికి చేరుకుంది. 80,000 మార్క్‌ను దాటాక సూచీకిదే అత్యంత వేగవంతమైన వెయ్యి పాయింట్ల వృద్ధి. కాగా, సూచీ 83,000 నుంచి 84,000 స్థాయికి నాలుగు ట్రేడింగ్ సెషన్లలో చేరుకుంది.

నిఫ్టీకి 38 సెషన్లు

ఈ ఆగస్టు 1న తొలిసారిగా ఇంట్రాడే ట్రేడింగ్‌లో 25,000 మైలురాయికి చేరిన నిఫ్టీ.. ఆ తర్వాత కొంత దిద్దుబాటుకు లోనైంది. తిరిగి 25,000 ఎగువకు చేరి, ఆ తర్వాత మరో 1,000 పాయింట్లు పెరిగి 26,000 మార్క్‌ను చేరేందుకు సూచీకి 38 ట్రేడింగ్ సెషన్లు పట్టింది.

ఒక శాతం వడ్డీ రేటుతో బంగారం రుణాలు

ఐఐఎఫ్‌ఎల్ ఫైనాన్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): బంగారం రుణాల కోసం చూసే వారి కోసం ఐఐఎఫ్ఎల్ ఫైనాన్స్ బంపర్ ఆఫర్ ప్రకటించింది. బుధవారం నుంచి ఈ నెలాఖరు వరకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో నెలకు ఒక శాతం వడ్డీ రేటుకే పసిడి రుణాలు అందజేస్తామని ప్రకటించింది. ఈ రుణాలు తీసుకోవడంపై ఆసక్తి ఉన్న వ్యక్తులు తమ బ్రాంచీ కార్యాలయాలు లేదా తమ వెబ్‌సైట్ ద్వారా మరిన్ని వివరాలు తెలుసుకోవచ్చని తెలిపింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	76,360 ▲	70,000 ▲	98,000 ▲
ముంబై	74,764 ▲	68,484 ▲	88,402 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	525	విజయవాడ	555
వరంగల్	527	గోదావరి	550
చిత్తూరు	543	విశాఖపట్నం	555
		డజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	125	విజయవాడ	121
వరంగల్	125	గుంటూరు	126
కరీంనగర్	125	ఒంగోలు	126
మహబూబ్‌నగర్	125	చిత్తూరు	122
కర్నూలు	125	నెల్లూరు	122
విశాఖపట్నం	107	అనంతపురం	122
గోదావరి	121		

ఉత్పత్తి, అమ్మకాలూ పెంచుకున్నాం: ఎన్‌ఎండీసీ

న్యూఢిల్లీ: గత ఆర్థిక సంవత్సరాని (2023-24)కి సంబంధించి తమ కంపెనీ మంచి పనితీరు కనబరిచినట్టు ఎన్‌ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ చెప్పారు. కంపెనీ 66వ ఏజీఎంను ఉద్దేశించి ప్రసంగిస్తూ ఆయన ఈ విషయం తెలిపారు. గత ఆర్థిక సంవత్సరం ఎన్‌ఎండీసీ 4.5 కోట్ల టన్నుల ఇనుప ఖనిజం ఉత్పత్తి చేసి, 4.44 కోట్ల టన్నుల ఖనిజాన్ని విక్రయించినట్టు తెలిపారు. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఇనుప ఖనిజం ఉత్పత్తి 10 శాతం, అమ్మకాలు 16 శాతం పెంచుకున్నట్టు తెలిపారు. దీంతో రూ.21,294 కోట్ల ఆదాయంపై రూ.5,632 కోట్ల నికర లాభం ఆర్జించినట్టు ముఖర్జీ తెలిపారు.

హైదరాబాద్‌లో ఇంటెల్ ఏఐ, గేమింగ్ జోన్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అంతర్జాతీయ టెక్ దిగ్గజం ఇంటెల్ హైదరాబాద్‌లో తొలి ఏఐ, గేమింగ్ జోన్‌ను ప్రారంభించింది. విశాల్ పెరిఫెరల్స్ భాగస్వామ్యంతో ఈ జోన్‌ను ప్రారంభించినట్లు ఇంటెల్ డైరెక్టర్, హెడ్ సిస్టమ్స్ రాహుల్ మల్హోత్రా, సీనియర్ మేనేజర్ అరుణ్ రాఘవన్ తెలిపారు. విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఈ జోన్‌ను డిజైన్ చేసినట్లు విశాల్ పెరిఫెరల్స్ డైరెక్టర్ విశాల్ హిసారియా పేర్కొన్నారు. ఇంటెల్‌కు చెందిన కటింగ్ ఎడ్జ్ టెక్నాలజీలను వినియోగించటంతో పాటు ఆసక్తి కలిగిన విద్యార్థులకు ప్రోగ్రామింగ్, ఏఐ డెవలప్‌మెంట్, గేమింగ్‌లో తమ నైపుణ్యాలను పెంపొందించుకునేందుకు తోడ్పాటునందించనున్నట్లు విశాల్ తెలిపారు. ఈ ఇంటెల్ ఏఐ, గేమింగ్ జోన్‌ను విద్యార్థులు పూర్తిగా ఉచితంగా ఉపయోగించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కాగా హైదరాబాద్‌లో రెండో గేమింగ్ జోన్‌ను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.

స్పోర్ట్స్

విజేత జీవన్ జోడీ



న్యూఢిల్లీ: భారత టెన్నిస్ జోడీ జీవన్ నెడుంజెరియన్, విజయ్‌సుందర్ ప్రశాంత్ చైనాలో జరిగిన హాంగ్జౌ ఓపెన్‌లో డబుల్స్ విజేతగా నిలిచింది. మంగళవారం ఇక్కడ జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో జీవన్-విజయ్ ద్వయం 4-6, 7-6(5), 10-7తో జర్మనీ జంట కాన్‌స్టాంటిన్-హెండ్రిక్‌ను ఓడించి ఏటీపీ టైటిల్‌ను అందుకుంది. కాగా, చైనాలోనే జరిగిన చెంగ్డూ ఓపెన్‌లో మరో భారత ఆటగాడు యుకీ భాంబ్రీ-అల్బానో (ఫ్రాన్స్) జోడీ డబుల్స్‌లో రన్నరప్‌గా నిలిచింది.

ఇరానీ కప్‌నకు జురెల్, సర్ఫరాజ్

టెస్టు జట్టు నుంచి విడుదల?

న్యూఢిల్లీ: వికెట్ కీపర్ ధ్రువ్ జురెల్, మిడిలార్డర్ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్‌తోపాటు పేసర్ యశ్ దయాళ్‌ను భారత టెస్ట్ టీమ్ నుంచి విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. దేశవాళీ టోర్నీ ఇరానీ కప్ కోసం రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్సీలో మంగళవారం ప్రకటించిన రెస్టాఫ్ ఇండియా జట్టులో జురెల్, యశ్‌కు చోటు కల్పించగా.. ముంబై టీమ్‌కు సర్ఫరాజ్‌ను ఎంపిక చేశారు. అయితే, ఈ నెల 27 నుంచి కాన్పూర్‌లో బంగ్లాదేశ్‌తో జరిగే రెండో టెస్ట్ తుది జట్టులో చోటు దక్కకపోతేనే ఈ ముగ్గురినీ విడుదల చేస్తామని బీసీసీఐ తెలిపింది. వచ్చే నెల ఒకటి నుంచి ఐదు వరకు లఖ్‌నవూలో జరిగే ఇరానీ కప్‌లో రంజీ చాంప్ ముంబైతో రెస్టాఫ్ జట్టు తలపడనుంది. కొంత కాలంగా రెడ్ బాల్ క్రికెట్‌కు దూరమైన ఇషాన్ కిషన్‌తోపాటు ఇటీవలే ముగిసిన దులీప్ ట్రోఫీలో అదరగొట్టిన రికీ భుయ్, శాశ్వత్ రావత్, ప్రసిద్ధ్ కృష్ణ, సాయి సుదర్శన్‌లకు కూడా రెస్టాఫ్ టీమ్‌లో చోటు దక్కింది. కాగా, రహానె సారథ్యంలోని ముంబై జట్టులో శ్రేయాస్ అయ్యర్, పృథ్వీషా ఆడనున్నారు.

జాతీయ చెస్ చాంపియన్ అర్జున్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ జూనియర్ చెస్ చాంపియన్‌షిప్‌లో హైదరాబాద్ క్రీడాకారులు ఆదిరెడ్డి అర్జున్ బాలుర విభాగంలో చాంపియన్‌గా నిలవగా, బాలికల కేటగిరీలో వి.సరయు రన్నరప్ టైటిల్ సాధించింది. హరియాణాలో జరిగిన ఈ పోటీల్లో అర్జున్ 11 రౌండ్లలో 9.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా, సరయు (9) ద్వితీయ స్థానంతో సరిపెట్టుకుంది.

బుమ్రాకు విశ్రాంతి!

మూడో స్పిన్నర్ ఖాయం

కుల్దీప్-అక్షర్ మధ్య పోటీ

27 నుంచి బంగ్లాతో రెండో టెస్టు



న్యూఢిల్లీ: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) 2023-25 అంచెలో భాగంగా టీమిండియా ఆడే పది టెస్టుల్లో మొదటిదాన్ని ఘన విజయంతో ముగించింది. బంగ్లాదేశ్‌తో జరిగిన ఈ మ్యాచ్‌లో ఏకంగా 280 పరుగుల తేడాతో నెగ్గి డబ్ల్యూటీసీ టేబుల్‌లో తమ అగ్రస్థానాన్ని మరింత పదిలపర్చుకుంది. ఇక శుక్రవారం నుంచి కాన్పూర్‌లో చివరిదైన రెండో టెస్టు జరుగుతుంది. వాస్తవానికి ఈ పది టెస్టుల్లో రోహిత్ సేన సగం మ్యాచ్‌లను గెలిచినా ఫైనల్లో చోటు ఖాయమే. బంగ్లాతో రెండో టెస్టు తర్వాత స్వదేశంలో కివీస్‌తో మూడు టెస్టులు ఉంటాయి. ఆ తర్వాత ఐదు టెస్టుల సిరీస్ కోసం భారత జట్టు ఆస్ట్రేలియా టూర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. అయితే అక్కడ ఆత్మవిశ్వాసంతో సిరీస్‌ను ఆరంభించేందుకు, సొంత గడ్డపై మిగిలిన మూడు టెస్టులను గెలిచి ఒత్తిడి తగ్గించుకోవాలనుకుంటోంది.



ఇక నల్ల మట్టి పిచ్‌పై..

ఎర్ర మట్టితో తయారుచేసిన చెన్నై పిచ్‌పై బంతి బాగా బౌన్స్ కావడంతో పేసర్లు ఎక్కువగా లాభపడ్డారు. నాలుగో రోజు మాత్రమే స్పిన్‌కు అనుకూలించింది. అయితే కాన్పూర్‌లో మాత్రం నల్ల మట్టి పిచ్ సిద్ధంగా ఉండనుంది. ఇక్కడ బంతి తక్కువగా బౌన్స్ అవడంతో పాటు స్పిన్‌కు అనుకూలిస్తూనే ఫ్లాట్‌గా ఉండనుంది. దీంతో బ్యాటర్లు, స్పిన్నర్లకు ఇద్దరికీ లాభమే. అలాగే దీనికి తగ్గట్టుగా ఇరు జట్లలోనూ మార్పులు చోటు చేసుకోనున్నాయి.

ఆ ఇద్దరిలో ఎవరో?

కాన్పూర్ పిచ్‌ను అనుసరించి ముగ్గురు స్పిన్నర్లతో వెళ్లాలనుకుంటే జట్టుకు ఓ పేసర్ దూరం కావాల్సిందే. ఒకవేళ బుమ్రాకు రెస్ట్ ఇస్తే ఇబ్బంది లేదు. కానీ తను ఆడితే మరో పేసర్ ఆకాశ్ దీప్‌పై వేటు పడే చాన్సుంది. ఇక మూడో స్పిన్నర్ కోసం తుది జట్టులో కుల్దీప్, అక్షర్‌ల మధ్య పోటీ ఏర్పడనుంది. ఇంగ్లండ్‌తో జరిగిన సిరీస్‌లో కుల్దీప్ 19 వికెట్లు తీయడంతో కోచ్ గంభీర్ అతడి వైపే మొగ్గు చూపవచ్చు. మరోవైపు జట్టులో ఇప్పటికే అశ్విన్, జడేజా రూపంలో ఇద్దరు స్పిన్ ఆల్‌రౌండర్లు ఉన్నారు కాబట్టి అక్షర్ బ్యాటింగ్ సామర్థ్యం పెద్దగా అవసరపడదు.

పని భారం పడకుండా..

భారత పేస్ దళానికి బుమ్రా ప్రధాన ఆయుధంగా చెబుతుంటారు. మున్ముందు జట్టు మరిన్ని టెస్టులు ఆడాల్సి ఉండడంతో అతడిపై ఎక్కువ భారం పడకుండా చూడాలనేది టీమ్ ఆలోచన. పిచ్ కూడా పెద్దగా పేస్‌కు అనుకూలించదు కాబట్టి కాన్పూర్ టెస్టులో బుమ్రాకు విశ్రాంతి నివ్వాలనుకుంటున్నట్టు సమాచారం. కానీ చెన్నై టెస్టులో బుమ్రా మొత్తంగా 21 ఓవర్లే వేశాడు. అందుకే రెస్ట్ ఇస్తారా? లేక మరింత మ్యాచ్ సమయం కోసం కొనసాగనిస్తారా? అనేది వేచిచూడాల్సిందే.

పంత్.. ఓ అద్భుతం: అక్రమ్





కరాచీ: ఘోర ప్రమాదం నుంచి కోలుకుని తిరిగి అంతర్జాతీయ క్రికెట్ ఆడుతున్న భారత వికెట్ కీపర్ రిషభ్ పంత్ ఓ అద్భుతమని పాకిస్థాన్ మాజీ కెప్టెన్ వసీమ్ అక్రమ్ కొనియాడాడు. 'రోడ్డు ప్రమాదం తర్వాత ఎవరికైనా కోలుకునేందుకు చాలా సమయం పడుతుంది. ఇక ఆటగాడికైతే మరింత కష్టంగా ఉంటుంది. కానీ పంత్ అలా కాదు. నిజంగా తను మిరాకిల్ కిడ్. అతడిని యువతరం ఆదర్శంగా తీసుకోవాల్సిందే. ఐపీఎల్, టీ20 ప్రపంచకప్‌లోనూ ప్రభావం చూపి ఇప్పుడు టెస్టుల్లోనూ ఆకట్టుకుంటున్నాడు. ఆసీస్‌తో టెస్టు సిరీస్‌లోనూ తను కీలకం కానున్నాడు' అని అక్రమ్ ప్రశంసించాడు.

రెండో టెస్టుపై కాన్పూర్‌లో నిరసన

కాన్పూర్: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులకు నిరసనగా ఆ దేశ క్రికెట్ జట్టుతో టెస్టు సిరీస్‌ను రద్దు చేయాలని పలు సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా కాన్పూర్‌లో ఈనెల 27నుంచి జరిగే రెండో టెస్టును అడ్డుకునేందుకు సోమవారం అఖిలేష్ భారతీయ హిందూ మహాసభ కార్యకర్తలు స్టేడియానికి వెళ్లే రోడ్డుపై హోమాన్ని నిర్వహించారు. అయితే అదే రోజు 20 మంది కార్యకర్తలపై పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే బంగ్లాతో అక్టోబరు 6న జరిగే టీ20 మ్యాచ్‌ను అడ్డుకునేందుకు గ్వాలియర్ బంద్‌ను నిర్వహించనున్నట్టు హిందూ మహాసభ ప్రకటించింది.

దీప్తికి రూ. కోటి అందజేసిన సీఎం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి): పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన తెలంగాణ యువ అథ్లెట్ దీప్తి జివాంజీకి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోటి రూపాయల ఆర్థిక సహాయం అందించారు. జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో దీప్తికి ఆర్థిక సహాయంతోపాటు కోచ్ రమేష్‌కు రూ. 10 లక్షల చెక్కును సీఎం అందించారు. దీప్తికి గ్రూప్-2 ఉద్యోగం, ఆర్థిక సహాయం, వరంగల్‌లో 500 గజాల స్థలం ఇచ్చేందుకు చర్యలు తీసుకోవాలని ఈ నెల 7న అధికారుల్ని సీఎం ఆదేశించిన సంగతి తెలిసిందే. చెప్పినట్టుగా రెండు వారాల్లో ఆర్థిక సహాయం అందించినందుకు సీఎంకు దీప్తి కృతజ్ఞతలు తెలిపింది.

ఒక్క ఫుట్‌బాల్ స్టేడియంతో ఏటా రూ. 81 వేల కోట్లా!


ప్రస్తుత మాంచెస్టర్ స్టేడియం

లండన్: ఒక్క ఫుట్‌బాల్ స్టేడియాన్ని నిర్మిస్తే.. బ్రిటన్ ఆర్థిక వ్యవస్థకు ఏడాదికి రూ. 81,733 కోట్ల తోడ్పాటు లభిస్తుందంటూ ఆక్స్‌ఫర్డ్ ఎకనామిక్స్ సంస్థ చేసిన అధ్యయనం ఎంతో ఆసక్తికరంగా మారింది. తాజాగా మాంచెస్టర్ యునైటెడ్ ఫుట్‌బాల్ క్లబ్‌నకు చెందిన ఓల్డ్ ట్రాఫర్డ్ మైదానం, చుట్టుపక్కల ఆధునికీకరణ వ్యయ భారాలకు సంబంధించిన నివేదికను క్లబ్ బయటపెట్టింది. దాదాపు రూ. 22,392 కోట్లతో లక్ష సీట్ల సామర్థ్యం కలిగిన కొత్త స్టేడియాన్ని నిర్మించాలా? లేదా 74 వేల సీట్ల కెపాసిటీ కలిగిన ఓల్డ్ ట్రాఫర్డ్ మైదానాన్ని ఆధునీకరించాలా? అనేదానిపై మాంచెస్టర్ క్లబ్ సమాలోచన చేస్తోంది. అయితే, ఈ స్టేడియం కారణంగా 92 వేల కొత్త ఉద్యోగాలు, 17 వేల నూతన గృహాలు నిర్మితం కావడంతోపాటు ఈ ప్రాంతాన్ని సందర్శించే పర్యాటకుల సంఖ్య 20 లక్షల మేర పెరుగుతుందన్నది సర్వే సంస్థ అంచనా.

అందరూ మహిళలే

టీ20 వరల్డ్‌కప్ అంపైర్ల ప్యానెల్


జీఎస్ లక్ష్మి


బృంద రాఠీ

దుబాయ్: టీ20 ఉమెన్ వరల్డ్‌కప్ కోసం పూర్తిగా మహిళలతో కూడిన ప్యానెల్‌ను ఐసీసీ మంగళవారం ప్రకటించింది. మొత్తం 13 మంది మ్యాచ్ అఫీషియల్స్‌లో 10 మంది అంపైర్లు, ముగ్గురు మ్యాచ్ రెఫరీలు ఉన్నారు. భారత్‌నుంచి తెలుగు మహిళ జీఎస్ లక్ష్మి మ్యాచ్ రెఫరీగా, బ్రింద రాఠీ అంపైర్‌గా వ్యవహరించనున్నారు. వచ్చే నెల 3 నుంచి యూఏఈ వేదికగా పొట్టికప్ జరగనుంది. కాగా, గత నాలుగు మెగా టోర్నీలకు పనిచేసిన క్లైరీ పొలోసక్‌కు ప్యానెల్‌లో అత్యధిక అనుభవం ఉంది. జింబాబ్వేకు చెందిన సారా డాంబనేవనాకు తొలిసారి టీ20 వరల్డ్‌కప్‌లో అంపైరింగ్ చేసే చాన్స్ దక్కనుంది.

'బాక్సింగ్ డే' టిక్కెట్లకు ఫుల్ గిరాకీ

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియాతో ఈ ఏడాది చివర్లో జరిగే బాక్సింగ్ డే టెస్టు కోసం అభిమానులు ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు. ఐదు టెస్టుల సిరీస్‌లో భాగంగా డిసెంబరు 26న మెల్‌బోర్న్ క్రికెట్ మైదానంలో ఈ నాలుగో టెస్టు ఆరంభం కానుంది. లక్షకు పైగా సీటింగ్ సామర్థ్యం కలిగిన ఈ స్టేడియంలో మ్యాచ్ టిక్కెట్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో సాగుతున్నట్టు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) పేర్కొంది. 2018/19తో పోలిస్తే ఈసారి తొలి రోజు అమ్మకాలే మూడింతలు పెరిగాయట. అలాగే రెండు నుంచి నాలుగు రోజుల మధ్య గమనిస్తే ఐదున్నర రెట్లు ఎక్కువగా ఇరు జట్ల ఫ్యాన్స్ టిక్కెట్లను కొనుగోలు చేశారని సీఏ ఎగ్జిక్యూటివ్ జీఎం జోయెల్ మారిసన్ తెలిపాడు.

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI





రాజ్యసభ సభ్యత్వానికి
ఆర్.కృష్ణయ్య రాజీనామా
9

చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆమోదం

రాజ్యసభలో 8కి పడిపోయిన వైసీపీ బలం

జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా కృష్ణయ్య?

బుధవారం | 25-9-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 179 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, బహుళపక్షం; తిథి: అష్టమి మ. 12.11 తదుపరి నవమి; నక్షత్రం: ఆర్ద్ర ర. 10.23 తదుపరి పునర్వసు వర్జ్యం: ఉ. 6.28-8.06, దుర్ముహూర్తం: ఉ. 11.42-12.30, అమృతఘడియలు: మ. 12.10-1.48, రాహుకాలం: మ. 12.00-1.30, సూర్యోదయం: 6.07, సూర్యాస్తమయం: 6.05 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎన్నారై కోటా.. ఓ మోసం




డబ్బులు దండుకునే ఎత్తుగడ: సుప్రీంకోర్టు

వైద్యకళాశాలల్లో ప్రవేశాలపై పంజాబ్ ప్రభుత్వం జారీ చేసిన నోటిఫికేషన్ కొట్టివేత

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: విద్యా సంస్థల్లో ముఖ్యంగా వైద్య కళాశాలల్లో అమలు చేస్తున్న ఎన్నారై కోటా విధానం పట్ల మంగళవారం సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. ఇది పూర్తిగా మోసమని, దీనికి తక్షణమే ముగింపు పలకాల్సి ఉందని పేర్కొంది. ప్రతిభావంతులను కాదని డబ్బు

మిగతా 2వ పేజీలో...

కర్ణాటక సీఎంకు షాక్



ముడా స్కాంలో సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు రాష్ట్ర హైకోర్టు ఓకే 2

గవర్నర్ అనుమతిని సవాల్ చేస్తూ ముఖ్యమంత్రి వేసిన పిటిషన్ కొట్టివేత

సిద్దూ రాజీనామాకు బీజేపీ డిమాండ్

నేడు కాంగ్రెస్ శాసనసభాపక్ష సమావేశం

హైకోర్టు తీర్పుపై సుప్రీంలో సవాల్?

రేవంత్‌రెడ్డి.. కోర్టుకు రండి!

వచ్చే నెల 16న కచ్చితంగా రావాలి.. ఇతర నిందితులు కూడా

ఓటుకు నోటు కేసులో నాంపల్లి సెషన్స్ కోర్టు



హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు ఈడీ కేసులో నిందితులందరూ తదుపరి విచారణకు తప్పనిసరిగా హాజరుకావాలని నాంపల్లి మెట్రోపాలిటన్ సెషన్స్ కోర్టు ఆదేశించింది. మంగళవారం ఈ కేసు విచారణకు జెరూసలేం మత్తయ్య మినహా మిగిలిన వారెవరూ

మిగతా 11వ పేజీలో...

మూసీ నిర్వాసితులకు
డబుల్ బెడ్‌రూం ఇళ్లు

ఉత్తర్వులు జారీ.. చెరువులు, నాలాల నిర్వాసితుల గుర్తింపు

మూసీ రివర్ బెడ్‌లోని 1600 ఇళ్ల తొలగింపు షురూ

ఆ తర్వాత బఫర్ జోన్‌లోని నిర్మాణాలు కూడా..

నిర్వాసిత కుటుంబాలు 16 వేలు ఉంటాయని అంచనా

అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇల్లు కేటాయింపు

బుధవారం నుంచి ఇంటింటికీ అధికారుల బృందం

ఔటర్ లోపల చెరువులు, కుంటల ఎఫ్‌టీఎల్ నిర్ధారణ

శంషాబాద్ నుంచి ఫ్యూచర్ సిటీకి మెట్రోపై రూట్ మ్యాప్

దసరా వరకు మెట్రో విస్తరణపై డీపీఆర్ రూపకల్పన

మూసీ రివర్ ఫ్రంట్, మెట్రో విస్తరణపై సీఎం సమీక్ష



మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, హైదరాబాద్ మెట్రోపై అధికారులతో సీఎం రేవంత్ సమీక్ష

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్ట్ అభివృద్ధిలో భాగంగా అక్కడ ఆక్రమణలు తొలగించాలని నిర్ణయించిన క్రమంలో నిర్వాసిత కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు మూసీ పరీవాహక ప్రాంతంలో పదివేల కుటుంబాలున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సంఖ్య మరింతగా ఉంటుందని.. సుమారు 16 వేల కుటుంబాలుండొచ్చని అంచనా వేస్తున్నారు. వీళ్లందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లను కేటాయించాలన్న సీఎం ఆదేశాల మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల కలెక్టర్లు, అధికారుల బృందం బుధవారం నుంచి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తారు. తొలి విడతలో రివర్ బెడ్‌లోని 1600 ఇళ్లను తొలగించే ప్రక్రియ వెంటనే మొదలవుతుందని చెప్పారు. తర్వాత బఫర్ జోన్‌లోని నిర్మాణాలను తొలగిస్తామన్నారు. కాగా మూసీ పరీవాహక ప్రాంతంలో నివసించే పేదల ఇళ్లతో పాటు చెరువులు, నాలాల వద్ద ఉంటున్న పేద కుటుంబాల వివరాలను కూడా సేకరించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అర్హులైన పేదలందరికీ భరోసా కల్పించే ప్రయత్నం చేయాలన్నారు. ఒక్క పేద కుటుంబం కూడా

మిగతా 11వ పేజీలో...

దసరాకు మంత్రివర్గ విస్తరణ?

ఏఐసీసీ నుంచి ఎలాంటి ఆలస్యం లేదన్న ఖర్గే

నలుగురి పేర్లు ఇప్పటికే ఖరారు 11

మరో ఇద్దరి పేర్లపై కుదరని ఏకాభిప్రాయం

సీఎం రేవంత్ వెళ్లి చర్చించాక తుది జాబితా



అక్టోబరులో
4.25 లక్షల మందికి
రుణమాఫీ!

దసరాలోపు నాలుగో విడత పూర్తి?

రూ.4250 కోట్లు అవసరమని అంచనా.. స్థానికంగా లేని కుటుంబాల డేటా అప్‌లోడ్ పెండింగ్

నెలాఖరుకల్లా ఫ్యామిలీ గ్రూపింగ్ పూర్తి చేయనున్న రాష్ట్ర ప్రభుత్వం



హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దసరాలోపు నాలుగో విడత రుణమాఫీ పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. అందుకు అవసరమైన కసరత్తును ముమ్మరం చేస్తున్నట్లు సమాచారం. రేషన్ కార్డులు లేకపోవడం, కుటుంబ నిర్ధారణ కాకపోవడం, ఆధార్‌లో తప్పులు దొర్లడంతో పెండింగ్‌లో ఉన్న రైతుల సమాచారాన్ని సరిచేసి నాలుగో విడతలో రుణమాఫీ చేయనున్నారు. ప్రస్తుతం కుటుంబ నిర్ధారణ ప్రక్రియ వేగవంతంగా జరుగుతుండగా.. ఈ నెలాఖరువరకు డేటా అప్‌లోడ్ పూర్తి చేయనున్నట్లు తెలిసింది. దసరా పండుగలోపు 4.25 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ఈ మేరకు నిధుల సర్దుబాటుపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలుస్తోంది. పంద్రాగస్టు నాటికి రాష్ట్ర ప్రభుత్వం సుమారు 22 లక్షల మంది రైతులకు రూ.17,934 కోట్ల రుణమాఫీ చేసిన విషయం తెలిసిందే. అయితే రేషన్ కార్డులు లేని రైతులకు, కుటుంబ నిర్ధారణ కానివారికి, ఆధార్, బ్యాంకు ఖాతా పుస్తకాల్లో తప్పులు దొర్లిన రైతులకు.. రుణమాఫీ చేయకుండా పెండింగ్ పెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా కుటుంబ నిర్ధారణ కాని రైతులు 4.28 లక్షల మంది ఉండగా, ఆధార్, ఇతర సాంకేతిక సమస్యలున్న రైతులు 1.26 లక్షల మంది ఉన్నారు. మొత్తం కలిపి 5.54 లక్షల మంది రైతుల ఖాతాలు పెండింగ్‌లో పెట్టారు. 'పంట రుణ మాఫీ (సీఎల్‌డబ్ల్యు)యాప్'ను ప్రత్యేకంగా రూపొందించి వివరాలు అప్‌లోడ్ చేయాలని మండల వ్యవసాయ అధికారులకు (ఏవోలకు) బాధ్యతలు అప్పగించారు. ఆగస్టు 29 నుంచి సెప్టెంబరు 4 వరకు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఆ తర్వాత నుంచి ఏవోలు క్షేత్రస్థాయికి వెళ్లి రైతులు, కుటుంబ సభ్యుల వివరాలు, ఆధార్ కార్డులు సేకరించి, సెల్ఫీలు దిగి, రైతు నుంచి డిక్లరేషన్ తీసుకొని, యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఫ్యామిలీ గ్రూపింగ్ ప్రక్రియ దాదాపుగా కొలిక్కి వచ్చింది. ఆదిలాబాద్ సహా కొన్ని జిల్లాల్లో 90 శాతం పూర్తయింది. మరికొన్ని జిల్లాల్లో 70 శాతం నుంచి 80 శాతం పూర్తయింది. మంగళవారం నాటికి అందిన సమాచారం మేరకు.. 4.28 లక్షల మంది రైతుల్లో 3.10 లక్షల మంది రైతులకు సంబంధించి ఫ్యామిలీ గ్రూపింగ్ పూర్తయింది. ఆధార్ మిస్ మ్యాచింగ్ అయిన 1.26 లక్షల మంది రైతుల్లో ఇప్పటివరకు లక్ష మంది రైతుల

మిగతా 12వ పేజీలో...

శ్రీశైలం జలాశయాన్ని ఖాళీ చేసేస్తున్నారు!

ఇన్‌ఫ్లో అంతంతమాత్రమే

పోటాపోటీగా తెలంగాణ, ఏపీ జల విద్యుత్ ఉత్పత్తి 9

3 వారాల్లో 52.61 టీఎంసీల తరుగుదల



రేవంత్ కుటుంబం దోపిడీ

కాంగ్రెస్ పార్టీకి ఓటు వెయ్యలేదనే కక్షతో పేదల ఇళ్ల కూల్చివేత

కేసీఆర్ రావాలని ప్రజలు కోరుతున్నారు

అలికెపూడికి కండువా కప్పిన సన్నాసెవరు?

ఏపీలో బాబు.. వారంలోనే పింఛన్ల పెంపు

ఇక్కడ పది నెలలైనా రేవంత్‌కు చేతకాలే

వైద్య ప్రవేశాలపై మొద్దునిద్ర వీడేదెప్పుడు?

రాష్ట్ర సర్కారుపై కేటీఆర్ ధ్వజం

9

ఇరిగేషన్ శాఖలోకి 677 మంది ఏఈఈలు

31 మంది ఐఐటీ, 83 మంది ఎన్ఐటీ పట్టభద్రులు

రేపు నియామక పత్రాలివ్వనున్న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్

1800మంది లష్కర్ల నియామకంపైనా ప్రకటన చేయనున్న ముఖ్యమంత్రి

11

సర్కారుకు చెప్పకుండానే
రూ.159 కోట్లు

నిర్మాణ సంస్థకు బ్యాంకు గ్యారెంటీల విడుదల

మహదేవపూర్ ఈఈ-1 తిరుపతిరావు ఇచ్చేశారు

సదరు కంపెనీ నుంచి అండర్ టేకింగ్ తీసుకున్నారో లేదో కూడా ఈఎన్సీకి సమాచారం లేదు

వరద ప్రవాహ వేగాన్ని అంచనా వేయలేకపోయాం

సెకనుకు 4.25 మీటర్లు వస్తుందనుకుంటే 12-14 మీటర్లు

జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ఎదుట ఇంజనీర్ల వెల్లడి

నేడు ఇరిగేషన్ కార్పొరేషన్ అధికారుల క్రాస్ ఎగ్జామినేషన్



జస్టిస్ పీసీ ఘోష్

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా ప్రభుత్వానికి చెప్పకుండానే రూ.159 కోట్ల బ్యాంకు గ్యారెంటీల సొమ్మును నిర్మాణ ఏజెన్సీకి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఇచ్చేశారు. ఇచ్చే ముందు నిర్మాణ సంస్థ నుంచి అండర్‌టేకింగ్ తీసుకున్నారా!? లేదా!? అన్న సమాచారమూ ఈఎన్సీ కార్యాలయానికి లేదు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ జరుపుతున్న విచారణలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. క్రాస్ ఎగ్జామినేషన్లో భాగంగా మంగళవారం ఐదుగురిని ప్రశ్నించింది. వీరిలో ప్రస్తుత, మాజీ అధికారులు ఉన్నారు. "మేడిగడ్డ బ్యారేజీకి

మిగతా 3వ పేజీలో...



మహబూబాబాద్ జిల్లా అప్పరాజుపల్లి రాజరాజేశ్వరి రైస్‌మిల్లులో తనిఖీలు

మిల్లర్ ఆస్తుల జప్తు

కస్టమ్ మిల్లింగ్ బియ్యం తిరిగివ్వకపోవడమే కారణం

రూ. 5.67 కోట్ల సీఎంఆర్ ధాన్యం పక్కదారి.. జనగామ జిల్లాలో ఘటన

క్రిమినల్ కేసు, రెవెన్యూ రికవరీ యాక్ట్‌కు కలెక్టర్ ఆదేశం

మహబూబాబాద్ జిల్లాలో ఓ మిల్లుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

రూ.9.56 కోట్ల విలువైన ధాన్యం పక్కదారి పట్టిందని గుర్తింపు

దేవరుప్పుల, గూడూరు, సెప్టెంబరు 24: కస్టమ్ మిల్లింగ్ కోసం తీసుకున్న ధాన్యానికి తగినట్లు బియ్యం తిరిగి ఇవ్వని ఓ మిల్లర్‌పై రెవెన్యూ రికవరీ చట్టం కింద చర్యలు తీసుకోవడమే కాదు.. ఆయన, ఆయన కుటుంబ ఆస్తులనూ జప్తు చేశారు. వాటిపై ఎటువంటి లావాదేవీలను అనుమతించవద్దని జిల్లా సబ్ రిజిస్ట్రార్‌లకు పౌర సరఫరాల శాఖ జిల్లా

మిగతా 9వ పేజీలో...

సీఎంఆర్ చేయలేం
9

సర్కార్‌కు నల్లగొండ రైస్ మిల్లర్ల లేఖ

మెడికల్ కౌన్సిల్ మార్గదర్శకాల ప్రకారమే
ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు
3

హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం



వైద్య ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల

రేపటి నుంచి వెబ్ ఆప్షన్లు 11

633 ఫార్మాసిస్టు గ్రేడ్ 2 పోస్టులకు నోటిఫికేషన్ జారీ
3

5 నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు

నేడు రాష్ట్రంలో భారీ వర్షాలు



పిడుగులు పడి నలుగురి మృతి

పలు జిల్లాల్లో దంచికొట్టిన వాన

బంగాళాఖాతంలో అల్పపీడనం

ఈ నెల 27 వరకు ఎల్లో అలర్ట్

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బుధవారం భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. మిగిలిన జిల్లాల్లోనూ అక్కడక్కడా గంటకు 40-50 కి.మీ. వేగంతో ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈనెల 26, 27 తేదీల్లో కూడా పలు జిల్లాల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా ఈ నెల 27 వరకు అన్ని జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది. ఉత్తరాంధ్ర, దక్షిణ ఒడిశా తీరం వద్ద పశ్చిమ మధ్య బంగాళాఖాతం, దాని పరిసర వాయువ్య బంగాళాఖాతంలో సోమవారం

మిగతా 3వ పేజీలో...

15 లక్షల రేషన్‌కార్డుల రద్దు?

కార్డుదారులు ఈ-కేవైసీకి హాజరుకానందునే..

వారందరినీ అనర్హులుగా గుర్తించిన ప్రభుత్వం! 12

వచ్చేనెల నుంచి కొత్త కార్డులకు దరఖాస్తుల స్వీకరణ

సిటిజన్ 360 ద్వారా అర్హుల గుర్తింపు

ఆధార్‌తో అనుసంధానమై ఉన్న సాఫ్ట్‌వేర్

వీటి ఆధారంగానే కొత్త రేషన్‌కార్డుల జారీ



ట్రాములకు టాటా

సేవలను నిలిపివేయాలని నిర్ణయించిన బెంగాల్ సర్కారు




కోల్‌కతా, సెప్టెంబరు 24: కోల్‌కతా వారసత్వ ప్రతీకగా పేరొందిన 'ట్రాము' సర్వీసులను నిలిపివేయాలని బెంగాల్ ప్రభుత్వం నిర్ణయించింది. మిగతా వాహనాలతో పోలిస్తే ట్రాములు నెమ్మదిగా నడవడంతో రోడ్లపై రద్దీ పెరుగుతోందని, ప్రజలు వేగవంతమైన రవాణా సదుపాయాలు కోరుకుంటున్న ఈ సమయంలో వాటిని ఇంకా కొనసాగించడం సరికాదని, అందుకే ఆ సర్వీసులను నిలిపివేయాలని నిర్ణయించామని బెంగాల్ రవాణా మంత్రి స్నేహాశీస్ వెల్లడించారు. అయితే, మైదాన్-ఎస్ప్లనేడ్ మార్గంలో మాత్రం ట్రాము సేవలు కొనసాగుతాయమన్నారు. ప్రస్తుతం దేశంలో కేవలం ఒక్క కోల్‌కతాలోనే ట్రాములు నడుస్తున్నాయి. బ్రిటిష్ హయాంలో 1873లో ఇక్కడ మొదట గుర్రాలతో నడిచే ట్రాములు ప్రారంభమయ్యాయి. తర్వాత ఇంజన్లు వచ్చాయి. అయితే, ట్రాము సర్వీసులను నిలిపివేయాలన్న నిర్ణయానికి వ్యతిరేకంగా ఆందోళనలు నిర్వహించడానికి ట్రాము ప్రేమికులు సిద్ధం అవుతున్నారు. మరోవైపు, ట్రాముల నిర్వహణపై కలకత్తా హైకోర్టులో పిల్ పెండింగ్‌లో ఉంది. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంలో వీటిని నడిపే అవకాశాలను పరిశీలించాలని హైకోర్టు ఇటీవల రాష్ట్రప్రభుత్వానికి సూచించింది.

వరుస రైలు ప్రమాదాల వేళ 'రైల్ రక్షా దళ్'

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: దేశంలో రైలు ప్రమాదాలు పెరుగుతున్న నేపథ్యంలో భారతీయ రైల్వే తొలిసారి రైల్ రక్షా దళ్‌ను ఏర్పాటు చేసింది. ప్రమాద సమయాల్లో సత్వరం ఘటనా స్థలికి చేరుకుని సహాయం అందించే సామర్థ్యం ఈ రైల్ రక్షా దళ్‌కు ఉంటుందని రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ తెలిపారు. ప్రస్తుతానికి దీన్ని పైలెట్ ప్రాజెక్టుగా వాయువ్య రైల్వే జోన్‌లో ప్రవేశ పెట్టామని, త్వరలో దేశవ్యాప్తంగా ప్రవేశపెడతామని చెప్పారు. కవచ్ పనితీరును పరిశీలించేందుకు మంగళవారం జైపూర్ వెళ్లిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ, ఇప్పటి వరకు ప్రమాద సమయాల్లో ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది సేవలను వాడుకుంటున్నామని ఇకపై రైల్ రక్షా దళ్ సేవలు అందుబాటులోకి రానున్నాయని తెలిపారు. అలాగే ఇటీవల రైళ్లను పట్టాలు తప్పించే కుట్రతో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు కావాలనే ట్రాక్‌లపై హానికర వస్తువులు పెడుతున్నారని, రైలు పట్టాలను తొలగించడం.. రాళ్ల రువ్వడం వంటి విద్రోహ చర్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ చర్యలను కేంద్ర ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని తెలిపారు. ఈ ప్రమాదాలను నిలువరించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలు, డీజీపీలు, హోంశాఖ కార్యదర్శులతో చర్చలు జరుపుతున్నామని, ఇందులో ఎన్ఐఏకు కూడా భాగస్వామ్యం కల్పిస్తామని చెప్పారు.

లోకం తీరు



చైనా, భారత్ మధ్య నలిగిపోం

- శ్రీలంక అధ్యక్షుడు దిశనాయకే వ్యాఖ్య
- ప్రధానిగా హరిణి అమరసూర్య ప్రమాణం



కొలంబో, సెప్టెంబరు 24: చైనా, భారత్ మధ్య నలిగిపోదలుచుకోలేదని శ్రీలంక నూతన అధ్యక్షుడు అనుర కుమార దిశనాయకే అన్నారు. భౌగోళిక రాజకీయ వైరాల్లోకి శ్రీలంకను లాగకుండా తటస్థ విదేశాంగ విధానం అవలంబిస్తామని ఓ మ్యాగజీన్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో చెప్పారు. తమ నేషనల్ పీపుల్స్ పవర్ (ఎన్‌పీపీ) కూటమి ప్రభుత్వం ఏ అధికార కేంద్రంతోనూ చేతులు కలపదన్నారు. చైనా, భారత్‌లు రెండూ శ్రీలంకకు విలువైన స్నేహితులేనని, ఇరు దేశాలతోనూ సత్సంబంధాలు కొనసాగిస్తామన్నారు. కాగా, శ్రీలంక నూతన ప్రధానిగా హరిణి అమరసూర్య నియమితులయ్యారు. మంగళవారం ఆమెతో దిసనాయకే ప్రమాణ స్వీకారం చేయించారు. హక్కుల కార్యకర్తగా, యూనివర్సిటీ అధ్యాపకురాలిగా గుర్తింపు పొందిన హరిణి (58).. శ్రీలంక చరిత్రలో మూడో మహిళా ప్రధాని. సిరిమావో బండారు నాయకే (1994-2000) తర్వాత ప్రధాని పదవి చేపట్టిన మహిళా నేత హరిణే. మరో ఇద్దరు ఎన్‌పీపీ నేతలు మంత్రులుగా నియమితులయ్యారు. దీంతో దిశనాయకేతో పాటు మొత్తం నలుగురితో క్యాబినెట్ కొలువుదీరింది. కాగా, అధ్యక్షుడు దిశనాయకే శ్రీలంక పార్లమెంట్‌ని మంగళవారం రద్దు చేశారు. నవంబరు 14న ఎన్నికలు జరుగుతాయని గెజిట్ జారీ చేశారు.

ట్రంప్, కమలను కలవకుండానే తిరిగొచ్చిన మోదీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: మూడు రోజుల పర్యటన నిమిత్తం అమెరికాకు వెళ్లిన మోదీ సోమవారం రాత్రి తిరిగి ఢిల్లీకి చేరుకున్నారు. అమెరికా పర్యటనలో భాగంగా ఆయన అధ్యక్షుడు బైడెన్‌తో కలిసి క్వాడ్ దేశాల సమావేశంలో పాల్గొన్నారు. ఐరాస సర్వసభ్య సమావేశంలో ప్రసంగించారు. అయితే ప్రస్తుతం అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న రిపబ్లికన్ల అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు ట్రంప్‌ను గానీ డెమొక్రాట్ల అభ్యర్థి కమలా హ్యారిస్‌ను గానీ కలవకుండానే వెనుదిరగడం చర్చనీయాంశంగా మారింది. భారత ప్రధాని మోదీ తనను కలవనున్నారని ఆయన పర్యటనకు ముందు స్వయంగా ట్రంప్ కూడా చెప్పారు. కాగా, ప్రధాని బిజీ షెడ్యూల్ వల్లే వారిని కలవడం వీలుకాలేదని చెప్తున్నప్పటికీ, ప్రస్తుతం అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ అక్కడి రాజకీయాల్లో జోక్యం చేసుకోవద్దనే ఉద్దేశంతోనే ఆయన వ్యూహాత్మకంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది.

తమిళనాడులో నర్సింగ్ విద్యార్థినిపై గ్యాంగ్ రేప్

చెన్నై, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులోని దిండుగల్‌లో ఓ నర్సింగ్ విద్యార్థినిపై సామూహిక అత్యాచారం జరిగింది. అఘాయిత్యానికి పాల్పడిన దుండగులు సోమవారం సాయంత్రం ఆమెను దిండుగల్ రైల్వే స్టేషన్ వద్ద అపస్మారక స్థితిలో వదిలివెళ్లారు. చుట్టుపక్కల వారు ఇచ్చిన సమాచారం మేరకు అక్కడకు చేరుకున్న పోలీసులు.. బాధితురాలు తేనికి చెందిన విద్యార్థినిగా గుర్తించారు. దిండుగల్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స అందిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆరేళ్ల బాలికపై ప్రిన్సిపాల్ అత్యాచార యత్నం

- ప్రతిఘటించడంతో గొంతు నులిమి హత్య

అహ్మదాబాద్, సెప్టెంబరు 24: ఆ చిన్నారి వయసు ఆరేళ్లు. ఒకటో తరగతి చదువుతోంది. తాను చదువుతున్న పాఠశాల ప్రిన్సిపాల్ తెలిసిన వ్యక్తి కావడంతో ఆయన కారులోనే ప్రతి రోజూ బడికి వెళ్లేది. 55 ఏళ్ల వయసు ఉన్న ఆ ప్రిన్సిపాల్ గురువారం చిన్నారిని బడికి తీసుకువెళ్తూ కారులోనే ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. బాలిక ప్రతిఘటించి కేకలు వేయడంతో గొంతు నులిమి చంపేశాడు. గుజరాత్‌లోని దహోద్ జిల్లా తురానీ గ్రామంలో ఈ ఘటన చోటుచేసుకుంది. బాలికను చంపిన నిందితుడు శవాన్ని కారులోనే ఉంచి డోర్ లాక్ చేశాడు. సాయంత్రం 5.30 గంటలకు శవాన్ని ప్రహరీ పక్కన ఉన్న చెట్ల పొదల్లో పడేశాడు. ఆ పాప ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు అయనను ప్రశ్నించగా.. ఆమెను ఇంటి వద్ద దించి వేసి వేరే పనిమీద వెళ్లిపోయానని చెప్పాడు. మరునటి రోజు కూడా చిన్నారి కనిపించకపోవడంతో తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ప్రిన్సిపాల్‌ను విచారించగా అసలు విషయం చెప్పాడు.



ఇజ్రాయెల్ దాడిలో ధ్వంసమైన భవనాలు

లెబనాన్‌పై గాజా తరహా దాడులు!

- ఇజ్రాయెల్ దాడుల్లో 15 మంది దాకా హిజ్బుల్లా టాప్ కమాండర్ల మృతి.. 558కి పెరిగిన మొత్తం మరణాలు

టెల్‌అవీవ్/బీరుట్, సెప్టెంబరు 24: మూడు వేలకు పైగా పేజర్ బాంబుల బీభత్సం.. ఆ మర్నాడే వందల సంఖ్యలో వాకీటాకీల పేలుళ్లు.. ఈ దారుణాలు జరిగి వారం గడవక ముందే.. వందల క్షిపణులతో ముప్పేట దాడులు..! వెరసి లెబనాన్‌లో ప్రజాజీవనం అస్తవ్యస్తంగా మారిపోయింది. లెబనాన్ విషయంలోనూ ఇజ్రాయెల్ గాజా తరహా పద్ధతులనే అనుసరిస్తోంది. తొలుత హమాస్ ఉగ్రవాదులకు పౌరులు ఆశ్రయం ఇస్తున్నారని, పౌరుల ఇళ్ల కింద నుంచి హమాస్ సొరంగాలున్నాయని అప్పట్లో ఆరోపించిన ఇజ్రాయెల్.. ఇప్పుడు లెబనాన్‌లో పౌరుల ఇళ్లలో హిజ్బుల్లా క్షిపణులు, రాకెట్ లాంచర్లు ఉన్నట్లు వెల్లడించింది. స్వయంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ.. "మా యుద్ధం హిజ్బుల్లాపైనే. దయచేసి సాధారణ పౌరులంతా సముద్ర తీరానికి వెళ్లగలరు" అని సోమవారం కోరారు. ఆ తర్వాత కాసేపటికి ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్సెస్(ఐడీఎఫ్) అధికారులు పౌరుల ఇళ్లలో క్రూయిజ్ క్షిపణులు, వార్‌హెడ్ల నిల్వల వీడియోలను విడుదల చేశారు. లెబనాన్‌పై ఆదివారం నుంచి క్షిపణి, వైమానిక దాడులు ముమ్మరమయ్యాయి. ఈ దాడుల్లో మరణాల సంఖ్య 558కి చేరుకున్నట్లు లెబనాన్ ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. దహియా ప్రాంతంలో హిజ్బుల్లా క్షిపణి విభాగం చీఫ్ ఇబ్రహీం కబిసీ టార్గెట్‌గా జరిపిన దాడుల్లో పది దాకా అపార్ట్‌మెంట్లు కుప్పకూలగా.. ఇబ్రహీంతోపాటు.. హిజ్బుల్లా అనుబంధ సంస్థ లెబనాన్ నెట్‌వర్క్ చీఫ్ అల్-మయాదీన్, మరో 13 మంది కమాండర్లు చనిపోయినట్లు అధికారులు ప్రకటించారు. రెండ్రోజుల దాడుల్లో దాదాపు 1,700 చదరపు కిలోమీటర్ల మేర ప్రభావం కనిపించిందని ఉపగ్రహ చిత్రాలు స్పష్టం చేస్తున్నాయి. గాజాలోనూ తొలినాళ్లలో ఈ తరహాలోనే దాడులు చేసిన ఇజ్రాయెల్.. ఆ తర్వాత భూతల దాడులను ప్రారంభించిన విషయం తెలిసిందే..! కాగా, బీరుట్ సహా.. దక్షిణ లెబనాన్‌కు చెందిన పలు పట్టణాల ప్రజలు రాత్రికిరాత్రే సముద్ర తీరప్రాంతాలు సిడోన్, బాల్‌బెక్‌కు చేరుకున్నారు. వాహనాల ఇంధనం, బేకరీల్లో ఆహార ఉత్పత్తులు నిండుకున్నాయి. ఒకట్రెండ్రోజుల్లో ఆకలికేకలు మొదలవుతాయని ఐక్య రాజ్య సమితి(ఐరాస) ఆందోళన వ్యక్తం చేస్తోంది.

కర్ణాటక సీఎంకు హైకోర్టు షాక్

ముడా స్కాంలో సిద్దరామయ్య ప్రాసిక్యూషన్‌కు సమర్థన

- గవర్నర్ అనుమతిని సవాల్ చేస్తూ సీఎం వేసిన పిటిషన్ కొట్టివేత
- సిద్దూ రాజీనామాకు బీజేపీ డిమాండ్
- నేడు కాంగ్రెస్ శాసనసభాపక్ష భేటీ



తన అధికారిక నివాసం కావేరి వద్ద విలేకరులతో మాట్లాడుతున్న సిద్దరామయ్య

బెంగళూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కర్ణాటక సీఎం సిద్దరామయ్యకు హైకోర్టు షాక్ ఇచ్చింది. మైసూర్ పట్టణాభివృద్ధి సంస్థ(ముడా) ఇంటి స్థలాల కేటాయింపు కుంభకోణంలో సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు గవర్నర్ అనుమతి ఇవ్వడాన్ని రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం సమర్థించింది. గవర్నర్ ఇచ్చిన అనుమతిని సవాల్ చేస్తూ సిద్దరామయ్య వేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. సిద్దరామయ్య భార్య పార్వతి అక్రమమార్గంలో ముడా నుంచి 14 ఇంటి స్థలాలు పొందారని, ఆమె నుంచి ముడా సేకరించిన భూమి కంటే వీటి విలువ ఎన్నో రెట్లు అధికమని సామాజిక కార్యకర్త టీజే అబ్రహం, ప్రదీప్‌కుమార్, స్నేహమయి కృష్ణ గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన గవర్నర్.. సీఎంను ప్రాసిక్యూట్ చేసేందుకు అనుమతి ఇచ్చారు. గవర్నర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సీఎం సిద్దరామయ్య హైకోర్టులో వేసిన పిటిషన్‌పై జస్టిస్ ఎం.నాగప్రసన్న నేతృత్వంలోని ఏకసభ్య ధర్మాసనం నెలరోజులపాటు విచారించి మంగళవారం తీర్పు ఇచ్చింది. సిద్దరామయ్య పిటిషన్‌ను కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. సీఎం ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతించడం సమంజసమైనదని తీర్పులో స్పష్టం చేసింది. సీఎం కుటుంబసభ్యులు లబ్ధి పొందిన విషయం కావడంతో విచారణ జరగాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. సీఎం సిద్దరామయ్యకు వ్యతిరేకంగా హైకోర్టులో తీర్పు రావడంతో కర్ణాటక రాజకీయాలలో కలకలం ఏర్పడింది. బెంగళూరు నగర పర్యటనలో ఉన్న సిద్దరామయ్య హుటాహుటిన అధికారిక నివాసం కావేరికి చేరుకున్నారు. ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్, మంత్రులు ఎంబీ పాటిల్, శివరాజ్ తంగడిగ, కృష్ణబైరేగౌడ, బైరతి సురేశ్ తదితరులు కూడా హుటాహుటి కావేరికి చేరుకున్నారు. ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు కూడా కావేరికి చేరుకుంటున్నారు. ఓ సదస్సులో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్లిన శాసనసభ స్పీకర్ యూటీ ఖాదర్ కూడా బెంగళూరుకు బయల్దేరినట్లు సమాచారం. హైకోర్టు తీర్పు మేరకు సీఎం ప్రాసిక్యూషన్‌ను ఎదుర్కోవాల్సిన పరిస్థితి రావడంతో కాంగ్రెస్ అధిష్ఠానం స్పందించింది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అండగా ఉంటామని సూర్జేవాలా భరోసా ఇచ్చారు. న్యాయపోరాటానికి సిద్ధం కావాలని సూచించారు. తద్వారా రాజీనామా చేయాల్సిన అవసరం లేదని అధిష్ఠానం పరోక్షంగా సందేశమిచ్చింది.

నేడు హైకోర్టు లేదా సుప్రీంలో పిటిషన్..

సిద్దరామయ్య పిటిషన్‌ను హైకోర్టు ఏకసభ్య ధర్మాసనం తిరస్కరించడంతో ఆయన హైకోర్టు ఉన్నత ధర్మాసనం లేదా సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉంది. ఏకసభ్య ధర్మాసనం తీర్పు అనంతరం సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ, మరో సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్‌తో ఫోన్‌లో చర్చించారు. ఈ తీర్పును సవాలు చేస్తూ సాధ్యమైనంత త్వరగా పిటిషన్ దాఖలు చేయాలని భావిస్తున్నట్లు సమాచారం. సిద్దరామయ్య తరఫున బుధవారం పిటిషన్ వేసే అవకాశం ఉందని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. కాగా, హైకోర్టు తీర్పు నేపథ్యంలో సీఎం అధికారిక నివాసం 'కావేరి' వద్ద భారీగా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఎం రాజీనామా కోరుతూ మైసూరులో బీజేపీ కార్యకర్తలు ఆందోళనలు నిర్వహించారు.

తప్పు చేయలేదు: సిద్దూ

ముడా ఇంటి స్థలాల విషయంలో తాను ఎటువంటి తప్పూ చేయలేదని సిద్దరామయ్య చెప్పారు. న్యాయవ్యవస్థపైనా, రాజ్యాంగంపైనా తనకు నమ్మకం ఉందని, న్యాయ పోరాటం చేస్తానని చెప్పారు. అంతిమ విజయం సత్యానిదేనన్నారు. సీఎం పదవికి రాజీనామా చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వానికి చెడ్డపేరు తీసుకురావాలనే దురాలోచనతో కుట్ర పన్నారని, గవర్నర్ రాజకీయ నిర్ణయం తీసుకున్నారని ఆరోపించారు. బీజేపీవి ప్రతీకార రాజకీయాలని ఆరోపించారు. తాజా రాజకీయ పరిస్థితులపై బుధవారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు.



హరియాణా యువత ఎందుకు 'డంకీ'లవుతున్నారు?

- బీజేపీకి రాహుల్‌గాంధీ ప్రశ్న

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24: దేశంలో యువతకు ఉపాధి లేకుండా చేసి వారికి బీజేపీ తీరని అన్యాయం చేస్తోందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. ఫలితంగా హరియాణా వంటి రాష్ట్రాల్లో యువత విదేశాల బాటపట్టి తీవ్రమైన కష్టాలు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఇటీవల ఆయన అమెరికా వెళ్లినప్పుడు హరియాణా నుంచి అమెరికా వలస వెళ్లినవారితో మాట్లాడిన వీడియోను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తూ ఈ వ్యాఖ్యలు చేశారు. హరియాణాలో ఉపాధి దొరకనందునే తాము అమెరికా వలస వచ్చి కష్టాలు పడుతున్నట్లు వారు రాహుల్‌గాంధీకి చెప్పారు. "హరియాణా యువత ఎందుకు డంకీలుగా మారుతున్నారు..? అని రాహుల్‌గాంధీ 'ఎక్స్'లో పెట్టిన తన పోస్టులో ప్రశ్నించారు. అక్రమ వలసదారులపై షారుక్‌ఖాన్ నటించిన డంకీ సినిమాతో ఈ పదం జనం నానుడిలోకి వచ్చింది. "బీజేపీ తెచ్చిన నిరుద్యోగ సమస్యతో లక్షలాది మంది తమవారికి దూరంగా విదేశాల్లో కష్టాలు పడుతున్నారు" అని ఆరోపించారు. తాను తిరిగి స్వదేశానికి వచ్చాక హరియాణాలో వారి కుటుంబాలను కలిసినప్పుడు వారి కళ్లలో ఎంతో వేదన కనిపించిందన్నారు. పదేళ్లలో దేశ యువతకు బీజేపీ తీవ్రమైన అన్యాయం చేసిందన్నారు. హరియాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ఆ రాష్ట్రంలోని యువత విదేశాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి లేకుండా చేస్తామని, ఇది తమ నిర్ణయమని స్పష్టం చేశారు.

ప్రధాని, రాష్ట్రపతి హిందువులు కాదు!

- అందుకే గోహత్యను నిషేధించటం లేదు
- హిందువుల పవిత్రతను దెబ్బ తీయడానికే తిరుపతి లడ్డూ కల్తీ: అవిముక్తేశ్వరానంద్



లక్నో, సెప్టెంబరు 24: నిర్మాణమే పూర్తి కాని అయోధ్య రామాలయంలో విగ్రహ ప్రాణప్రతిష్ఠ పూజలు ఏమిటని ప్రశ్నించి అప్పట్లో మోదీ ప్రభుత్వాన్ని ఇరుకునపెట్టిన జ్యోతిర్‌మఠ్ శంకరాచార్య అవిముక్తేశ్వరానంద్ సరస్వతి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశంలో గోహత్యను నిలిపివేయని ప్రధాని, రాష్ట్రపతి అసలు హిందువులే కాదన్నారు. ఇప్పటి వరకూ ఆ అత్యున్నత పదవులను అధిష్ఠించిన వారెవరూ హిందువులు కాదని, కాబట్టే, దేశంలో గోహత్య ఇప్పటికీ కొనసాగుతోందని విమర్శించారు. యూపీలో మహంత్ యోగి సీఎంగా ఉన్నప్పటికీ.. గొడ్డు మాంసం(బీఫ్) ఎగుమతులు ఆ రాష్ట్రం నుంచే అత్యధికంగా ఉన్నాయన్నారు. తిరుపతి లడ్డూ వివాదంపై శంకరాచార్య స్పందిస్తూ.. గొడ్డు కొవ్వు కలిగి ఉన్న ప్రసాదాన్ని కోట్లాదిమంది భక్తులకు పంచటం విచారకరమన్నారు. హిందువుల పవిత్రతను దెబ్బతీసే కుట్ర అని వ్యాఖ్యానించారు. దీనిపై వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేయాలన్నారు.

ఎన్నారై కోటా.. ఓ మోసం

(మొదటి పేజీ తరువాయి)



ఇచ్చేవారికి దొడ్డి దారిన ప్రవేశాలు కల్పించడానికి ఇది అవకాశం ఇస్తోందని మౌఖికంగా వ్యాఖ్యానించింది. చట్టవ్యతిరేకమైన ఈ పద్ధతిని సమర్థించలేమని తెలిపింది. వైద్య కళాశాలల ప్రవేశాల్లో ఎన్నారై కోటాపై పంజాబ్ ప్రభుత్వం ఇచ్చిన నోటిఫికేషన్‌ను కొట్టివేస్తూ పంజాబ్-హరియాణా హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థించింది. ఎన్ఆర్ఐ అభ్యర్థికి ఇచ్చిన నిర్వచనాన్ని విస్తరిస్తూ పంజాబ్ ప్రభుత్వం ఆగస్టు 20న నోటిఫికేషన్ ఇచ్చింది. దీని ప్రకారం ఎన్ఆర్ఐల దూరపు బంధువులు కూడా సీట్లు పొందడానికి అర్హులేనని తెలిపింది. తాత, అమ్మమ్మ, నాన్నమ్మ, పెద్దనాన్న, చిన్నాన్న, కజిన్స్ తదితరుల 'సంరక్షణ'లో ఉన్నారన్న కారణం చూపి సీట్లు పొందే అవకాశం ఉంది. అయితే దుర్వినియోగానికి దారి తీస్తుందని పేర్కొంటూ హైకోర్టు దానిని కొట్టివేసింది. ఇది ఎన్నారై కోటా స్ఫూర్తికి విరుద్ధంగా ఉందని తెలిపింది. విదేశాల్లో ఉన్న ఎన్ఆర్ఐలు భారతదేశంలో తమ పిల్లలను చదివించడానికి ఈ కోటాను ప్రవేశ పెట్టారని గుర్తు చేసింది. నిజమైన ఎన్నారై విద్యార్థులే దీని ప్రయోజనం పొందాల్సి ఉందని స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వంతో పాటు, మరో ఇద్దరు పిటిషనర్లు సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఈ మూడు పిటిషన్లపై సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రల ధర్మాసనం విచారణ జరిపింది. పంజాబ్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ ఎన్నారై అభ్యర్థి విషయంలో హిమాచల్ ప్రదేశ్, యూపీ ఇతర రాష్ట్రాలు కూడా ఎప్పటి నుంచో 'విస్తృత నిర్వచనాన్నే' ఉపయోగిస్తున్నాయని తెలిపారు. దీనిపై జస్టిస్ చంద్రచూడ్ స్పందిస్తూ "ఈ వాదనను తిరస్కరిస్తున్నాం. ఈ మోసానికి ముగింపు పెట్టాల్సిన అవసరం ఉంది. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులు సంపూర్ణంగా సరైనవే. ఈ ఎన్నారై కోటా వ్యవహారం మోసం తప్ప ఇంకేమీ కాదు. పంజాబ్ ప్రభుత్వ చర్యలను చూడండి. ఆగస్టు 9న ప్రవేశాల నోటిఫికేషన్ జారీ చేసింది. 19న దాని గడువు ముగిసింది. 20న నోటిఫికేషన్ ఇచ్చి 'సంరక్షకుల' నిర్వచనాన్ని విస్తరించింది. దాని దుష్పరిణామాలను పరిశీలించండి. మూడు రెట్లు అధికంగా వచ్చిన అభ్యర్థులకు సీట్లు రావు. దొడ్డిదారిలో మాత్రం కొందరు ప్రవేశిస్తారు" అని వ్యాఖ్యానించారు. "ఎన్నారైల బంధువులను కూడా పరిగణనలోకి తీసుకోవాలని అంటారా? ఇది సొమ్ము పిండుకునే చర్య కాకపోతే ఇదేమిటిది? విద్యా వ్యవస్థను ఏమి చేయాలనుకుంటున్నారు? ఏ కేసును పరిశీలిస్తున్నారో న్యాయమూర్తులకు తెలుసు. అందరికీ తెలిసిన విషయాన్నే హైకోర్టు పరిశీలించింది" అని అన్నారు. నిజమైన ఎన్నారైలకే సీట్లు ఇవ్వాలని, ఈ సందర్భంలోనూ మెరిట్‌ను విస్మరించకూడదంటూ గతంలో సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పును గుర్తు చేశారు. జస్టిస్ పార్దీవాలా మాట్లాడుతూ "ఈ కోటా కింద దరఖాస్తు చేసిన వారంతా భారతీయులే. పెద్దనాన్న, పెద్దమ్మ, చిన్నాన్న, చిన్నమ్మల వంటి చుట్టరికాల పేర్లు చెప్పి దరఖాస్తు చేస్తున్నార"ని అన్నారు. 'విస్తృత నిర్వచనాన్ని' 'డబ్బు పిండే ఎత్తుగడ'గా ధర్మాసనం వ్యాఖ్యానించింది. అంతకుముందు ఓ పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది అభిమన్యు భండారి వాదనలు వినిపిస్తూ 700 మార్కులకుగాను 637 మార్కులు వచ్చిన అభ్యర్థికి సీటు రాలేదని, కానీ 202 మార్కులు వచ్చిన వారికి ఎన్నారై కోటాలో ప్రవేశం లభించిందని చెప్పారు. పంజాబ్‌లో ప్రతి ఒక్కరికీ ఎన్నారై బంధువులు ఉంటారని, వారి పేరుతో సీట్లు పొందే ప్రమాదం ఉందని తెలిపారు. దీనికి ముగింపు పలకాల్సి ఉందని కోరారు. పంజాబ్‌లోని మెడికల్, డెంటల్ కాలేజీల్లో ఎన్ఆర్ఐ కోటా కింద 185 సీట్లు ఉండడం గమనార్హం.

కశ్మీరంలో ఎన్నికల సమరం

భారీ భద్రత నడుమ నేడు రెండో విడత పోలింగ్.. 26 నియోజకవర్గాల నుంచి 239 మంది పోటీ



శ్రీనగర్‌లో ఓ పోలింగ్ బూత్ వద్ద భద్రతా సిబ్బంది

పదేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జమ్ముకశ్మీర్ అసెంబ్లీకి జరుగుతున్న ఎన్నికల్లో.. రెండో దశ పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది! ఈ దశలో మొత్తం 26 నియోజకవర్గాల నుంచి 239 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు! 25.78 లక్షల మంది ఓటర్లు బుధవారం వారి భవితవ్యాన్ని నిర్ణయించనున్నారు. ఆరు జిల్లాల్లో విస్తరించిన ఈ నియోజకవర్గాల్లో ఎన్నికల నిమిత్తం భారీ ఎత్తున మోహరించిన భద్రతాసిబ్బంది ఉనికితో.. ఒకరకమైన ఉద్విగ్న వాతావరణం నెలకొని ఉంది! ఆర్టికల్ 370 రద్దు, జమ్ముకశ్మీర్‌ను రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించిన తర్వాత జరుగుతున్న తొలి ఎన్నికలు కావడంతో దేశమంతా ఈ ఎన్నికలను ఆసక్తిగా చూస్తోంది. సాధారణంగా ఎన్నికలనగానే.. సంక్షేమ పథకాలు, ఉద్యోగాల కల్పనవంటివి ప్రధాన పార్టీల కీలక హామీలుగా ఉంటాయి! కానీ, కల్లోల కశ్మీరంలో ఎన్నికల హామీలు అందుకు భిన్నం. కశ్మీర్‌కు స్వతంత్ర ప్రతిపత్తినిచ్చే ఆర్టికల్ 370, 35ఏ పునరుద్ధరణ, రాష్ట్ర హోదా తిరిగి కల్పించేందుకు కృషి వంటివి నేషనల్ కాన్ఫరెన్స్, పీడీపీ వంటి ప్రాంతీయ పార్టీల ప్రధాన హామీలుగా ఉన్నాయి. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగాల కల్పన, రాజకీయ ఖైదీల విడుదల, ఇండియా-పాకిస్థాన్ మధ్య చర్చలకు ప్రోత్సహించడం, జమ్ముకశ్మీర్‌లో భూయాజమాన్య హక్కులను స్థానికులకు పరిమితం చేయడం, పబ్లిక్ సేఫ్టీ యాక్ట్ రద్దు వంటి హామీలు కూడా ఆయా పార్టీల మ్యానిఫెస్టోల్లో ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ ఆర్టికల్ 370 గురించి ఏం మాట్లాడట్లేదుగానీ.. జమ్ముకశ్మీర్ రాష్ట్ర హోదా పునరుద్ధరణకు కృషి చేస్తామని హామీ ఇస్తోంది. ఇక.. మొన్నటి లోక్‌సభ ఎన్నికల్లో ఒమర్ అబ్దుల్లాను కంగుతినిపించిన ఇంజనీర్ రషీద్‌కు చెందిన అవామీ ఇత్తెహాద్ పార్టీ ప్రధాన హామీ.. జైళ్లలో ఉన్న కశ్మీరీ రాజకీయ ఖైదీలను విడిపించడమే. వీరందరికీ భిన్నంగా.. నిషేధిత జమాతే ఇస్లామీ బలపరుస్తున్న పదిమంది స్వతంత్ర అభ్యర్థుల ప్రధాన హామీలు మాత్రం వీటికి భిన్నంగా ఉండడం విశేషం. ఆ పది మందీ.. మహిళా సాధికారత, ఉద్యోగాలనే ప్రధాన అంశాలుగా చేసుకుని ఇంటింటికీ తిరుగుతూ ప్రచారం చేస్తున్నారు. జమ్ము ప్రాంతంలో బీజేపీకి పట్టున్నా.. ఎక్కువ సీట్లుండే కశ్మీర్‌లో ఆ పరిస్థితి లేదు.

పెరిగిన ఓటింగ్..

ఇటీవలి సార్వత్రిక ఎన్నికల్లో జమ్ముకశ్మీర్‌లోని 5 లోక్‌సభ స్థానాల్లో కలిపి 58.46 శాతం ఓట్లు నమోదైన సంగతి తెలిసిందే. ఇది గడిచిన 35 ఏళ్లలో అక్కడ నమోదైన అత్యధిక పోలింగ్! 2019తో పోలిస్తే 2024లో కశ్మీర్ లోయలో ఏకంగా 30% మేర ఓటింగ్ పెరిగింది. ప్రస్తుత ఎన్నికల్లో సైతం మొదటి విడత పోలింగ్‌లో 61 శాతం ఓటింగ్ నమోదైంది. గతంలో ఉగ్రవాదుల కారణంగా ప్రభుత్వ ఉద్యోగులు సైతం భయపడే పరిస్థితి ఉండేదని.. సామాన్యప్రజలు బయటకు వచ్చి ఓటేయలేకపోయేవారని.. దీనివల్ల ఎన్నికల్లో పోటీ వాతావరణం కొరవడి ఎన్సీ, పీడీపీ వంటి పార్టీలదే పైచేయిగా ఉండేదని రాజకీయ నిపుణులు గుర్తుచేస్తున్నారు. అయితే, కొన్నాళ్లుగా జమ్ముకశ్మీర్‌లో పరిస్థితి మారిందని.. 2020లో జరిగిన డీడీసీ ఎన్నికల్లో ప్రజలు స్వచ్ఛందంగా బయటకు వచ్చి ఓటేశారని వారు పేర్కొన్నారు. జమ్ముకశ్మీర్‌లోని ప్రధాన పార్టీలన్నీ బీజేపీకి వ్యతిరేకంగా ఒక్కటవ్వడమే ఇందుకు కారణం. "నా జీవితంలో మొదటిసారి 2020లో జరిగిన డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఎలక్షన్స్‌లో ఓటేశాను. లోయలోని అన్ని పార్టీలూ తొలిసారి బీజేపీకి వ్యతిరేకంగా ఏకమయ్యాయి" అని పేరు వెల్లడించడానికి ఇష్టపడని స్థానికుడు ఒకరు తెలపడం గమనార్హం. ఆ ఎన్నికల్లో ఆ కూటమికి 110 సీట్లొచ్చాయని.. కానీ, ఇప్పుడవే పార్టీలు విడిపోయి పోటీ చేస్తున్నాయని.. ఈ అనైక్యత అంతిమంగా బీజేపీకే ఉపయోగపడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ మినహా ఎవరు అధికారంలోకి వచ్చినా పాలన సజావుగా సాగదని.. ఇప్పుడు ఢిల్లీలో ఆప్ సర్కారును ఇబ్బంది పెట్టినట్టుగానే, జమ్ముకశ్మీర్‌లో కూడా అక్టోబరు 8న ఫలితాల తర్వాత ఏర్పడబోయే ప్రభుత్వాన్ని మోదీ సర్కారు ఇబ్బంది పెడుతుందన్న ఆందోళన చాలా మందిలో ఉంది.

సర్వేలు ఏం చెబుతున్నాయ్?

జమ్ముకశ్మీర్ ఎన్నికలపై లోక్‌పోల్, ద సెఫాలజిస్ట్ సంస్థలు రెండు ప్రీపోల్ సర్వేలు నిర్వహించాయి. వాటిలో లోక్‌పోల్ సంస్థ.. ఇండీ కూటమికి (కాంగ్రెస్, ఎన్సీ తదితరులు) 51-56 సీట్లు వచ్చే అవకాశం ఉందని ప్రకటించింది. ఆ సంస్థ బీజేపీకి వస్తాయని అంచనా వేసిన సీట్లు.. 23 నుంచి 26. అలాగే పీడీపీకి 4-8, ఇతరులకు 3-7 సీట్లు వస్తాయని అంచనా వేసింది. 22,500 మందిని ప్రశ్నించి లోక్‌పోల్ సంస్థ ఈ సర్వే వివరాలను వెల్లడించింది. ఇక.. ద సెఫాలజిస్ట్ ప్రకారం కూడా ఈ ఎన్నికల్లో ఇండీ కూటమే గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయబోతోంది! నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీకి 38, కాంగ్రెస్‌కు 13, బీజేపీకి 21, పీడీపీకి 8, ఇతరులకు 10 దాకా వస్తాయని ఆ సంస్థ పోల్‌లో వెల్లడైంది. ఏపీ అసెంబ్లీకి 2019, 2024 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ, వైసీపీ గెలుపు అవకాశాలపై దాదాపు కచ్చితమైన అంచనాలు వెలువరించిన కేకే సర్వే కూడా జమ్ముకశ్మీర్‌లో బీజేపీకి ఎదురుదెబ్బ తగలొచ్చని తెలిపింది.

- సెంట్రల్ డెస్క్

విద్యుత్తు నియంత్రణ మండలి నియామకాల్లో పారదర్శకత ఏదీ?


అభ్యర్థుల ఆరోపణలు

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి(టీజీ ఈఆర్‌సీ) నియామకాల్లో పారదర్శకత లోపించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈఆర్‌సీలో నియామకాల కోసం గత మార్చిలో నోటిఫికేషన్ వెలువడింది. ప్రస్తుతం ఇంటర్వ్యూలకు కాల్ లెటర్‌లు పంపించడం, ఇంటర్వ్యూలకు అనుసరించిన విధానంపై విమర్శలు ఉన్నాయి. 11 డిప్యూటీ డైరెక్టర్ పోస్టులకు అర్హులు చాలా మంది దరఖాస్తు చేసుకోగా ఇంటర్వ్యూలకు ఒకరోజు ముందే మెయిల్‌లు పంపించి, ఉద్దేశపూర్వకంగా ఇంటర్వ్యూలకు హాజరుకాకుండా అడ్డుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. ఆయా పోస్టులకు ఎంపికైన వారి వివరాలు కూడా వెబ్‌సైట్‌లో పొందుపరచ లేదని తెలుస్తోంది. ఈ వ్యవహారంపై ప్రభుత్వానికి ఫిర్యాదులు వెళ్లాయి.

అప్పనంగా 159 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

సంబంధించి నిర్మాణ సంస్థకు బ్యాంకు గ్యారంటీల సొమ్మును ఎవరు విడుదల చేశారు? దానికి ముందు అండర్ టేకింగ్ ఏమైనా తీసుకున్నారా!?" అని ఈఎన్‌సీ (జనరల్) కార్యాలయంలోని డిప్యూటీ చీఫ్ ఇంజనీర్ అజ్మల్ ఖాన్‌ను కమిషన్ ప్రశ్నించింది. దీనికి ఆయన జవాబిస్తూ.. "2020 అక్టోబరు 13వ తేదీన రాష్ట్రస్థాయి స్టాండింగ్ కమిటీ (ఎస్ఎల్ఎస్‌సీ) సమావేశం జరిగింది. బ్యాంకు గ్యారంటీల విడుదలకు సంబంధించి అందులో చర్చించాం. రూ.159 కోట్ల బ్యాంకు గ్యారంటీని మహదేవ్‌పూర్ ఈఈ-1 సీహెచ్ తిరుపతిరావు విడుదల చేశారు. ప్రభుత్వానికి ఎటువంటి సమాచారం ఇవ్వలేదు" అని వివరించారు. బ్యాంకు గ్యారంటీలు ఇచ్చే ముందు నిర్మాణ సంస్థ నుంచి అండర్ టేకింగ్ తీసుకున్నారా? అని కమిషన్ ప్రశ్నించగా.. దీనిపై ఈఎన్‌సీ (జనరల్) కార్యాలయానికి ఎటువంటి సమాచారం లేదని తెలిపారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణంతో ముడిపడిన సమాచారం కావాలని విజిలెన్స్ శాఖ లేఖ రాసిందా? అని ప్రశ్నించగా.. రాసిందని జవాబిచ్చారు. తాను చేరేనాటికే బ్యారేజీల నిర్మాణం పూర్తయిందని రామగుండం మాజీ ఎస్ఈ కరుణాకర్ చెప్పారు. ఎస్ఈగా 2022 ఫిబ్రవరి 25న చేరానని, అదే ఏడాది జూలైలో మూడు బ్యారేజీలకు భారీగా వరదలు వచ్చాయని, సీసీ బ్లాకులు చెల్లాచెదురయ్యాయని, దీనిపై నిర్మాణ సంస్థలకు లేఖలు రాశానని వివరించారు. బ్యారేజీల ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) గడువు ఎప్పటి వరకూ ఉందని కమిషన్ ప్రశ్నించగా.. బ్యారేజీలు పూర్తయిన తర్వాత రెండేళ్లపాటు డిఫెక్ట్ లయబులిటీ కాలం; ఆ తర్వాత మూడేళ్లపాటు ఓఅండ్ఎం ఉంటుందని వివరించారు. సుందిళ్ల బ్యారేజీ అంచనాలను ఎవరు సిద్ధం చేశారని చెన్నూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్-2 బి.విష్ణు ప్రసాద్‌ను కమిషన్ ప్రశ్నించగా.. నిర్మాణ అంచనా వ్యయాన్ని వ్యాప్కోస్ తయారు చేసిందని బదులిచ్చారు. సుందిళ్ల నిర్మాణం చేపట్టే ముందు జియో టెక్నికల్, జియో ఫిజికల్ పరీక్షలు ఏమైనా చేశారా...? అని ప్రశ్నించగా... ఎన్ఐటీ వరంగల్‌తో చేయించామని సమాధానమిచ్చారు. డిజైన్లు/డ్రాయింగ్‌లను సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్ (సీడీవో) చీఫ్ ఇంజనీర్ తయారు చేశారని విష్ణుప్రసాద్ తెలిపారు. బ్యారేజీ డ్యామేజీకి కారణాలు ఏమిటని కమిషన్ ప్రశ్నించగా.. "వరద ప్రవాహ వేగాన్ని సరిగ్గా అంచనా వేయలేకపోయాం. ప్రతి సెకనుకు 4.25 మీటర్ల వరద వస్తుందని అంచనా వేయగా.. 12-14 మీటర్ల వరద వచ్చింది. అందుకే బ్యారేజీ దెబ్బతింది" అని వివరించారు. బ్యారేజీల్లో సీపేజీలను గుర్తించి 2019 డిసెంబరు 16న సెంట్రల్ వాటర్, పవర్ రిసెర్చ్ స్టేషన్ (సీడబ్ల్యూపీఆర్ఎస్)కు లేఖ రాయగా.. 2020 డిసెంబరు 22న ఆ సంస్థ ప్రతినిధులు సుందిళ్లకు వచ్చి అధ్యయనానికయ్యే అంచనాలను అందించారని తెలిపారు.



నేడు కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్‌పై విచారణ

కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్ నుంచి చెల్లింపులపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ బుధవారం విచారించనుంది. ఎంత మేర రుణాలు తీసుకున్నారు? ఎవరెవరికి చెల్లింపులు చేశారు? తదితర అంశాలపై కార్పొరేషన్ ఎండీ, గజ్వేల్ ఈఎన్‌సీ బి.హరిరామ్‌ను ప్రశ్నించనుంది. ఆయనతోపాటు డైరెక్టర్ ఆఫ్ వర్క్స్ అకౌంట్స్ ఫణిభూషణ్‌శర్మ, చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్ పద్మావతితో పాటు కాళేశ్వరం ఇరిగేషన్ కార్పొరేషన్‌లోని చీఫ్ అకౌంట్స్ ఆఫీసర్లను క్రాస్ ఎగ్జామినేషన్ చేయనుంది.

ఎంసీఐ మార్గదర్శకాల ప్రకారమే

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు

» హైకోర్టుకు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) మార్గదర్శకాల ప్రకారం మెడికల్ గ్రాడ్యుయేట్, పీజీ కోర్సుల్లో ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌లు కల్పిస్తామని రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టుకు తెలిపింది. ఈ విద్యా సంవత్సరం నుంచే వీటిని అమలు చేస్తామని పేర్కొంది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై ఆదేశాలు ఇచ్చేలా ఆదేశించాలని కోరుతూ కామారెడ్డి బీజేపీ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టింది. అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ ఈ రిజర్వేషన్ల ఈ విషయంలో ఎంసీఐ మార్గదర్శకాల ప్రకారమే వ్యవహరిస్తామని వెల్లడించారు. కాగా, న్యాయవిద్య పట్టభద్రులు న్యాయవాదులుగా నమోదు (ఎన్‌రోల్‌మెంట్) చేసుకునే ప్రక్రియను వేగవంతం చేయాలని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ), తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్‌లకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. బీసీఐ సర్క్యులర్‌ను ఆధారం చేసుకొని రాష్ట్ర బార్‌కౌన్సిల్ ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను నిలిపేసిందని, ఈ అధికారం ఆ సంస్థకు లేదని పేర్కొంటూ న్యాయశాస్త్ర పట్టభద్రులు జీ సాయితేజ తదితరులు దాఖలు చేసిన పిటిషన్‌పై ధర్మాసనం పై విధంగా ఆదేశించింది.

633 ఫార్మాసిస్టు గ్రేడ్ 2 పోస్టుల నోటిఫికేషన్

5వ తేదీ నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు.. తుది గడువు 21.. నవంబరు 30న రాత పరీక్ష

- తుది గడువు 21.. నవంబరు 30న రాత పరీక్ష
- రాష్ట్రవ్యాప్తంగా 13 పరీక్ష కేంద్రాలు
- కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ వారికి వెయిటేజ్
- నోటిఫికేషన్ జారీ చేసిన మెడికల్ బోర్డు
- 15 రోజుల్లో 3 నోటిఫికేషన్లు..

3967 పోస్టుల భర్తీ

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్య శాఖ నుంచి 15 రోజుల వ్యవధిలో మూడో నోటిఫికేషన్ జారీ అయింది. ఈ మేరకు వైద్యశాఖలో ఖాళీగా ఉన్న 633 ఫార్మాసిస్టు గ్రేడ్ 2 పోస్టులను భర్తీ చేయనున్నారు. మంగళవారం బోర్డు కార్యదర్శి గోపికాంత్‌రెడ్డి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నెల 11న 1284 ల్యాబ్ టెక్నిషియన్ పోస్టులతో ఒకటి, గత వారం 2050 స్టాఫ్‌నర్సుల పోస్టులతో మరో నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మూడు నోటిఫికేషన్ల ద్వారా 3,967 పోస్టుల భర్తీ కానున్నాయి. అర్హులైన అభ్యర్థులు అక్టోబరు 5 నుంచి 21వ తేదీ (సాయంత్రం ఐదింటి దాకా) వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని బోర్డు కార్యదర్శి కోరారు. దరఖాస్తుల్లో ఏమైనా పొరపాట్లు ఉంటే అక్టోబరు 23-24 తేదీల మధ్య ఎడిట్ చేసుకునేందుకు అవకాశమిచ్చారు. నవంబరు 30న రాత పరీక్ష కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ)లో, ఇంగ్లిషులోనే ఉంటుందని ఆ నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిజేసే వారికి వెయిటేజ్ కల్పించారు. ఇందుకు సర్కారీ దవాఖానాల్లో పనిజేస్తున్నట్టు ఎక్స్‌పీరియెన్స్ సర్టిఫికేట్‌ను జత చేయాల్సివుంటుంది. అలాగే అభ్యర్థులు తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు రిజిష్ట్రేషన్ చేసుకోవడం తప్పనిసరి అని నోటిఫికేషన్‌లో స్పష్టం చేశారు. అభ్యర్థులు ఈ ఏడాది జూలై 1 నాటికి 46 ఏళ్లకు మించి ఉండకూడదు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్ల వయోపరిమితి సడలింపు ఇచ్చారు. దివ్యాంగులకు పదేళ్లు ఇచ్చారు. ఎన్‌సీసీ, ఎక్స్ సర్వీస్‌మ్యాన్‌లకు మూడేళ్లు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు(ఆర్టీసీ, మునిసిపల్ ఉద్యోగులు అనర్హులు) ఐదేళ్ల వయోపరిమితిని సడలింపునిచ్చారు. పోస్టుల్లో 95 శాతం స్థానికులకేనని స్పష్టం చేసింది.



80 మార్కులకు రాత పరీక్ష, పాయింట్ల ఆధారంగా

పోస్టులను వంద పాయింట్ల ప్రాతిపదికన భర్తీ చేస్తారు. రాత పరీక్షకు 80 మార్కులు, మిగిలినవి వెయిటేజ్ కింద కలుపుతారు. అభ్యర్థులు ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిజేస్తే వెయిటేజ్ కింద 20 పాయింట్లు కేటాయిస్తారు. ఇందులో గిరిజన ప్రాంతాల్లో కనీసం 6 మాసాలకు పైగా వైద్యసేవలందిస్తే 2.5 పాయింట్లు కేటాయిస్తారు. గిరిజనేతర ప్రాంతాల్లోనైతే ప్రతి 6నెలలకు 2 పాయింట్లు ఇస్తారు. దరఖాస్తు సమయంలో ఎక్స్‌పీరియన్స్ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్‌చేయాలని బోర్డు పేర్కొంది. వివరాలకు www.mhsrb.telangana.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించింది.

ఆ పోస్టులివే..

మొత్తం 633 పోస్టులుండగా అందులో 446 ప్రజారోగ్య సంచాలకుల విభాగంలో, మరో 185 తెలంగాణ వైద్యవిధాన పరిషత్తు ఆస్పత్రుల్లో, మరో రెండు పోస్టులు హైదరాబాద్ ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రిలో ఉన్నాయి. జోన్ వన్‌లో 79, జోన్ రెండులో 53, మూడులో 86, నాలుగులో 98, ఐదులో 73, ఆరులో 154, ఏడో జోన్‌లో 88 పోస్టులున్నాయని మెడికల్ బోర్డు తెలిపింది. కాగా హైదరాబాద్ జోన్ అయిన ఆరులో అత్యధికంగా 154 పోస్టులుండగా ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల జోన్ అయిన రెండులో కేవలం 53 పోస్టులే ఉన్నాయి.

పరీక్షా కేంద్రాలు

ఎల్టీ పోస్టులకు రాష్ట్రంలో 13 చోట్ల పరీక్ష కేంద్రాలుంటాయని మెడికల్ బోర్డ్ పేర్కొంది. హైదరాబాద్, నల్లగొండ, కోదాడ, ఖమ్మం, కొత్తగూడెం, సత్తుపల్లి, కరీంనగర్, మహబూబ్‌నగర్, సంగారెడ్డి, ఆదిలాబాద్, నిజామాబాద్, వరంగల్, నర్సంపేట పట్టణాలను పరీక్షా కేంద్రాల కింద ఎంపిక చేశారు.

విద్యార్హతలు..

డీ ఫార్మసీ, బీ ఫార్మసీ, ఫార్మ్ డీ చేసిన అభ్యర్థులే అర్హులని మెడికల్ బోర్డు వెల్లడించింది. అభ్యర్థులంతా దరఖాస్తు చేసే సమయానికి తప్పనిసరిగా తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలను తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ రిజిష్ట్రేషన్ చేసుకొని ఉండాలని పేర్కొంది.

స్థానికులకు 95 రిజర్వేషన్ ఫార్మాసిస్టు పోస్టులను జోన్లవారీగా భర్తీ చేయనున్నారు. ఆయా జోన్లలోని అభ్యర్థులకే 95 శాతం పోస్టులను కేటాయిస్తారు. మిగతావి ఓపెన్ కేటగిరీ కింద భర్తీ చేస్తారు. జోన్1లో ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు... జోన్2లో ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల.. జోన్3లో కరీంనగర్, సిరిసిల్ల, సిద్దిపేట, మెదక్, కామారెడ్డి.. జోన్4లో కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, హనుమకొండ, వరంగల్.. జోన్5వీలో సూర్యాపేట, నల్లగొండ, భువనగిరి, జనగాం.. జోన్6లో మేడ్చల్ మల్కాజిగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్.. జోన్7లో పాలమూరు, నారాయణపేట, గద్వాల, వనపర్తి, నాగర్ కర్నూల్ జిల్లాలు ఉన్నాయి.

నేడు పాడి రైతులకు

60 కోట్లు విడుదల

విజయ డెయిరీ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పాడి రైతులకు బకాయిలున్న పాల బిల్లుల్లో రూ. 60 కోట్లు బుధవారం విడుదల చేయనున్నట్లు విజయ డెయిరీ ఛైర్మన్ గుత్తా అమిత్‌రెడ్డి తెలిపారు. ఈ చెల్లింపులతో ఆగస్టు 15 నాటికి రైతులకున్న బకాయిలు పూర్తవుతాయని తెలిపారు. ఇక నెల రోజుల బిల్లులు మాత్రమే పెండింగ్‌లో ఉంటాయని వెల్లడించారు. పాడి రైతులకు బిల్లులు చెల్లించటానికి రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రూ. 50 కోట్ల నిధులు విడుదలచేసినట్లు తెలిపారు. డెయిరీలో ఉన్న రూ. 10 కోట్లు కలిపి.. మొత్తం రూ. 60 కోట్ల పాల బిల్లులు చెల్లిస్తున్నట్లు వివరించారు.

నేడు రాష్ట్రంలో భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

అల్పపీడనం ఏర్పడినట్లు వెల్లడించింది. కాగా, రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం వర్షాలు దంచికొట్టాయి. వరంగల్ జిల్లా ఖిల్లా వరంగల్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా 9.7 సెం.మీ. వర్షపాతం నమోదైంది. అలాగే, రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లో 8.95, ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడులో 8.53, నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో 8.35, నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరులో 7.8, రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తాటివనంలో 7.78, మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేటలో 7.2 నిర్మల్ జిల్లా భైంసాలో 7.4 సెం.మీ. వర్షపాతం రికార్డయింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మంగళవారం భారీ వర్షాలు కురిశాయి. వరద నీరు ముంచెత్తడంతో మేడ్చల్ జిల్లా మేడ్చల్ పట్టణంలోని జాతీయ రహదారిపై, ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో మంఖాల్, హర్షగూడ గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. సోమవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కేశంపేట మండలం సంగెంలో పెంకుటిల్లు కూలిపోయింది. కొందుర్గు మండలంలోని ఎంకిర్యాల- తంగళ్లపల్లి మధ్య మట్టి రోడ్డు మళ్లీ తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. నవాబుపేట్-కొందర్గు మధ్య ఎంకిర్యాల వాగు తెగిపోవడంతో ఆగిర్యాల, ఎంకిర్యాల, కాస్లాబాద్, కాస్లాబాద్‌తండా గ్రామాలకు సంబంధాలు తెగిపోయాయి. నల్లగొండ జిల్లా శాలిగౌరారం మండలంలో పంట పొలాలు నీట మునిగాయి.



కట్టం నాగశ్రీ, అనూష, కృష్ణకుమార్, లక్ష్మీబాయి (ఫైల్)

పిడుగులు పడి నలుగురి మృతి

భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం బూరుగుగుంపులో పిడుగుపడి కట్టం నాగశ్రీ (20), సున్నం అనూష (18) మృతి చెందారు. గాయపడిన మిగతా ఐదుగురు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అలాగే, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం పోతిరెడ్డిపేటకు చెందిన రైతు కృష్ణకుమార్ (30) పిడుగుపడి చనిపోయాడు. మరో ఘటనలో నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం యంచలో లక్ష్మిబాయి(67) సోమవారం అర్ధరాత్రి పిడుగుపాటు శబ్దానికి భయపడి.. గుండెపోటుతో మృతి చెందింది.

తండ్రిని చంపిన తల్లిని పట్టించిన కొడుకు!

- భర్తను గొడ్డలితో కొట్టి చంపేసి.. గాయపడి మృతిచెందాడని నమ్మించిన భార్య
- 37 రోజులకు వెలుగులోకి

సూర్యాపేటరూరల్, సెప్టెంబరు 24: మద్యం మత్తులో ఉన్న భర్తను గొడ్డలితో కొట్టి చంపిన భార్య ప్రమాదవశాత్తు కింద పడటంతో తలకు గాయమై చనిపోయినట్లు అందర్నీ నమ్మించింది. ఈ హత్యను కళ్లారా చూసిన కుమారుడిని బతిమాలి.. బెదిరించి ఎవ్వరికీ చెప్పకుండా మేనేజ్ చేసింది. అయితే 37 రోజుల తర్వాత ఈ హత్యోదంతం బయటపడింది. సీఐ సురేందర్‌రెడ్డి వెల్లడించిన వివరాల ప్రకారం.. సూర్యాపేట మండలం హనుమతండాకు చెందిన ధరావత్ సైదా(45), కౌసల్య దంపతులు కూలిపనులు చేసుకుంటూ బతుకుతున్నారు. వీరికి సాయికుమార్, వినోద్ కుమారులు. సాయి సూర్యాపేటలో ఉంటూ క్యాటరింగ్ చేస్తున్నాడు. వినోద్ ఊర్లోనే తల్లిదండ్రులతో ఉంటూ కూలి పనికి వెళుతున్నాడు. కౌసల్యకు అదే తండాకు చెందిన ఓ వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం భర్తకు తెలియడంతో ఇద్దరి మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. భర్తను అడ్డు తొలగించుకోవాలనుకున్న కౌసల్య ఆగస్టు 17న మద్యం మత్తులో ఇంటికొచ్చిన అతడితో ఉద్దేశపూర్వకంగా గొడవపడింది. ఇంట్లో ఉన్న గొడ్డలితో తలపై బలంగా కొట్టడంతో సైదా అక్కడికక్కడే మృతి చెందాడు. మద్యం తాగి బల్లపై పడటంతో తలకు దెబ్బ తగిలి భర్త మృతి చెందాడని అందర్నీ నమ్మించింది. బంధువులు, గ్రామస్థుల సమక్షంలో దహన సంస్కారాలు పూర్తి చేసింది. అయితే సైదాను కౌసల్య గొడ్డలితో హత్య చేసే సమయంలో ఇంట్లోనే నిద్రిస్తున్న చిన్నకుమారుడు వినోద్ చూశాడు. వినోద్‌ను కౌసల్య బతిమలాడి ఎవరికీ చెప్పొద్దని వేడుకుంది. హత్య గురించి బయటికి తెలిస్తే తాను జైలుకు వెళతానని, అప్పుడు తనతోపాటు అన్న సాయి కూడా బతకడం కష్టమవుతుందనడంతో వినోద్ ఎవరికీ చెప్పలేదు. ఈ నెల 22న కౌసల్యకు వినోద్‌తో ఘర్షణ జరిగింది. ఈ క్రమంలో వినోద్ తండ్రి హత్య గురించి సోదరుడు సాయికుమార్‌కు చెప్పాడు. సాయికుమార్ సూర్యాపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు నిందితురాలిని అదుపులోకి తీసుకొని విచారించారు. హత్య చేసినట్లు నేరం అంగీకరించటంతో హత్యకు ఉపయోగించిన గొడ్డలిని సీజ్ చేసి నిందితురాలిని రిమాండ్‌కు తరలించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

చెస్‌లో సువర్ణాధ్యాయం

భారత చెస్ అంటే దిగ్గజం విశ్వనాథన్ ఆనంద్ గుర్తుకొస్తాడు. ప్రపంచ చదరంగ చిత్రంపై విషీ అంతలా తనదైన ముద్ర వేశాడు. ఇప్పుడు ఆయన బాటలో సాగుతూ మన యువకిశోరాలు అదరగొడుతున్నారు. క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లో విన్నర్, ప్రపంచకప్‌లో రన్నరప్, ప్రపంచ బ్లిట్జ్ చెస్‌లో పతకం.. ఇలా ప్రతి అంతర్జాతీయ ఈవెంట్‌లోనూ తమదైన ఆటతీరుతో సమర్థత చాటుతున్నారు. తాజాగా.. చెస్ ఒలింపిక్స్‌గా పిలుచుకునే ఒలింపియాడ్‌లోనూ స్వర్ణచరిత్ర సృష్టించి చదరంగంలో మరింత 'ఎత్తు'కు దూసుకెళ్లారు.

అరవై నాలుగుగళ్ల ఆటలో సంచలనాల మోత మోగిస్తున్న భారత క్రీడాకారులు.. హంగేరీ రాజధాని బుడాపెస్ట్‌లో జరిగిన చెస్ ఒలింపియాడ్‌లో చాంపియన్లుగా నిలిచి అరుదైన ఘనత సాధించారు. 193 జట్లు పోటీపడ్డ పురుషుల విభాగం, 181 జట్లు తలపడ్డ మహిళల కేటగిరిలోనూ సత్తా చాటి భారత చెస్ చరిత్రలో తొలిసారి రెండు స్వర్ణాలు కొల్లగొట్టారు. ఇప్పటిదాకా కాంస్య పతకాలకే పరిమితమైన మన జట్లు ఈమారు ఏకంగా టైటిల్‌తో మురిపించారు. వందేళ్ల చెస్ ఒలింపియాడ్ చరిత్రలో ఏకకాలంలో ఒకే దేశానికి చెందిన రెండుజట్లు విజేతలుగా నిలవడం ఇది మూడోసారే. గతంలో చైనా, రష్యా ఒకే అంచెలో రెండు పసిడి పతకాలు గెలిచి రికార్డు సృష్టించాయి.

పెంటేల హరికృష్ణ, అర్జున్ ఇరిగేసి, గుకేష్, ప్రజ్ఞానంద, విదిత్ గుజరాతీలతో కూడిన భారత పురుషుల జట్టు చెస్ ఒలింపియాడ్‌లో పూర్తి ఆధిపత్యంతో ఆడిన తీరు అమోఘం. పదునైన వ్యూహాలు, విభిన్నమైన ఎత్తులతో ప్రత్యర్థులను చిత్తుచేస్తూ ఆరంభం నుంచి అగ్రస్థానంలోనే కొనసాగిన జట్టు, చివరిదాకా అంతే జోరును చూపుతూ అద్భుత ఫలితాన్ని రాబట్టిన తీరు ప్రశంసనీయం. ఒక్క రౌండ్‌లోనూ ఓటమన్నదే లేకుండా అజేయంగా ఆడిన మన ఆటగాళ్లు.. డిఫెండింగ్ చాంపియన్ ఉజ్బెకిస్థాన్, టాప్‌సీడ్ అమెరికాలాంటి అగ్రశ్రేణి జట్లను దాటుకొని విజయకేతనం ఎగురవేశారు. ద్రోణవల్లి హారిక, తానియా సచ్‌దేవ్, వైశాలి, దివ్యా దేశ్‌ముఖ్, వంతికా అగర్వాల్‌లతో కూడిన మహిళల జట్టూ టోర్నీలో చూపిన తెగువ అంతాఇంతా కాదు. ఏమాత్రం అంచనాలు లేకుండా బరిలోకి దిగిన మన అమ్మాయిల బృందం.. చైనా, రష్యాలాంటి బలమైన జట్లను ఢీకొని విజయ దుందుభి మోగించింది.

భారత జట్ల చారిత్రక ప్రదర్శనలో తెలుగు క్రీడాకారుల ప్రదర్శన ఎనలేనిది. పురుషుల జట్టులో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ అర్జున్ ప్రధాన భూమిక పోషించాడు. బోర్డుపై తనదైన వ్యూహాలతో ప్రత్యర్థులను చిత్తుచేస్తూ జట్టు చాంపియన్‌గా నిలవడానికి బాటలు వేశాడు. తానాడిన మొత్తం పదకొండు గేముల్లో తొమ్మిది విజయాలు సాధించాడంటేనే అర్జున్ నైపుణ్యం ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. మరో తెలుగు ఆటగాడు హరికృష్ణ తన అనుభవంతో సహచర ఆటగాళ్లకు మార్గదర్శనం చేస్తూ జట్టును గెలుపు దిశగా నడిపించాడు. ఇక హారిక కీలక సమయాల్లో ప్రత్యర్థులను ఓడించి మహిళల జట్టు పసిడి పతకం నెగ్గడంలో కీలక భాగమైంది. తొమ్మిది గేమ్‌ల్లో మూడింటిలో విజయాలు సాధించి, మూడు గేమ్‌లను డ్రా చేసుకున్న హారిక.. నిర్ణాయక ఆఖరి రౌండ్ గేమ్‌లో పైచేయి సాధించి భారత విజయాన్ని ఖరారు చేసిన తీరు అద్భుతం.

చెస్‌లో ప్రతిష్ఠాత్మకంగా భావించే గ్రాండ్‌మాస్టర్ హోదాను పొందిన తొలి భారతీయుడిగా నిలిచిన విశ్వనాథన్ ఆనంద్.. 1988లోనే ఆ ఘనత సాధించి దేశంలో ఈ క్రీడకు ఊపిరి పోశాడు. అనంతరం ఐదుసార్లు ప్రపంచ చాంపియన్‌గా నిలిచి చదరంగంలో భారత్ సత్తాను ఘనంగా చాటాడు. ఆనంద్ స్ఫూర్తితో ఇటీవలికాలంలో అనేక మంది భారత క్రీడాకారులు ప్రపంచ వేదికపై తమదైన ముద్ర వేస్తున్నారు. 1988 నుంచి 2017 నాటికి మన దేశంలో గ్రాండ్‌మాస్టర్ల సంఖ్య 50 ఉంటే.. ఈ ఏడేళ్లలో మరో 35 మంది కొత్త గ్రాండ్‌మాస్టర్లుగా అవతరించారు. ముఖ్యంగా గుకేశ్, ప్రజ్ఞానంద, అర్జున్‌లాంటి యువ ఆటగాళ్లు ఒత్తిడిని సమర్థంగా తట్టుకుంటూ అంతర్జాతీయస్థాయిలో మెరుగైన ప్రదర్శన కనబరుస్తున్నారు. కొన్నేళ్లుగా చెస్‌ను శాసిస్తున్న ప్రపంచ నెంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్‌తో పాటు అత్యుత్తమ ఆటగాళ్లను ఓడిస్తూ ప్రభంజనాలు సృష్టిస్తున్నారు. ప్రజ్ఞానంద నిరుడు ప్రపంచకప్‌లో రన్నరప్‌గా నిలిస్తే, ఈ ఏడాది క్యాండిడేట్స్ టోర్నీలో గుకేశ్ టైటిల్ గెలవడమే అందుకు నిదర్శనం. ఇప్పుడు సాధించిన ఒలింపియాడ్ విజయంతో భారత చదరంగంలో మన యువతరంగాలు సువర్ణాధ్యాయాన్ని లిఖించారని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు.

ఆ భాషా సంస్కరణ బీఆర్ఎస్‌తో మొదలుపెట్టండి!

రాజకీయాల్లో వాగ్యుద్ధాలు ఒక సహజ ప్రక్రియ అని రాస్తూనే, దిగజారిపోవడం గురించి మాట్లాడారు హరీష్‌రావు (సెప్టెంబర్ 24, ఆంధ్రజ్యోతి). దిగజారుడు భాష ఉపయోగించినట్టుగా అంగీకరిస్తూనే తెలంగాణ ఉద్యమ ముసుగును వేసుకున్నారు. ఆ ముసుగులోనూ ఆత్మవంచన, అబద్ధాలు, అధికారం పోయిందనే ఉక్రోషంతో పాటు, జనాభిమానం కలిగిన నాయకుడు రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం మీద కడుపుమంట కూడా సహజంగానే కనిపిస్తోంది.

ఒక కేంద్రమంత్రిని పట్టుకొని "రండ" అని ఒక ముఖ్యమంత్రి హోదాలో కేసీఆర్ మాట్లాడినప్పుడు హరీష్‌కు ఉత్తమమైన లక్షణం గానే అనిపించింది కాబోలు. మహిళలను పట్టుకొని బజారుకీడుస్తామని కేసీఆర్ అంటే హరీష్‌రావుకు వినసొంపుగా అనిపించిందేమో. అధికారంలో ఉన్న పదేళ్లపాటు కేంద్రమంత్రులను, ప్రతిపక్షనాయకులను, ఉద్యమకారులను, పాత్రికేయులను కేసీఆర్ నోటికొచ్చిన బూతులు తిడుతున్నప్పుడు హరీష్‌రావుకు వీరోచితంగా కనిపించిందేమో. అంతెందుకు అధికారం పోయిన తరువాత నల్గొండ సభలో వీల్‌చైర్‌లో కూర్చొని కూడా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని, మంత్రివర్గ సహచరులను కేసీఆర్ తిట్టిన తిట్లు హరీష్‌కు వినిపించలేదా? వినిపించినా ఎందుకింత ఆత్మవంచన? రాజకీయాల్లో



బూతులు, తిట్లు, పరుష పదజాలం వంటివి కేసీఆర్‌తోపాటు ఈ హరీష్‌రావు, ఆయన బామ్మర్ది కేటీఆర్, అప్పటి మంత్రివర్గ సహచరులు మల్లారెడ్డి, నిరంజన్‌రెడ్డి వంటి వారందరి సుభాషితాలు అందరికీ తెలుసు. కేసీఆర్ తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రిగా వాడిన బూతులు, పరుష పదజాలం మహిళలను అవమానించడం, బాడీ షేమింగ్ వంటి వాటి గురించి రాయడానికి నాకు సంస్కారం అడ్డొస్తుంది. ప్రత్యర్థులు అదే భాషలో సమాధానం చెబితే మీకు కర్ణకఠోరంగా అనిపిస్తున్నది.

సంస్కారం, భాష, హుందాతనం వంటివాటి గురించి హరీష్‌రావు మాట్లాడటం చాలా ఆశ్చర్యకరం. అధికారంలో ఉన్నప్పుడూ, అధికారం పోయిన తరువాతా కూడా కేసీఆర్ మాట్లాడిన వికృత భాష, ప్రతీకార దాడుల గురించి ఎందుకు నోరు విప్పలేదు? ఉద్యమంలో క్రియాశీలకంగా ఉన్న ప్రొ. కోదండరామ్ ఇంటి తలుపులు బద్దలు కొట్టినప్పుడు ప్రతీకార దాడులు ఎందుకు వద్దనిపించలేదు? ఒక ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న రేవంత్‌రెడ్డి ఇంటి తలుపులను అర్ధరాత్రి పగులగొట్టి పోలీసులు అరాచకంగా వ్యవహరించినప్పుడు ప్రతీకార దాడుల ప్రస్తావన ఎందుకు లేదు? ఎందరో ఉద్యమకారులను, ప్రతిపక్ష పార్టీల నేతలను, రైతులను, విద్యార్థులను అక్రమంగా నిర్బంధించినా నోరెందుకు విప్పలేదు? అధికారం పోయిన ఆరు నెలల్లోనే హరీష్‌రావు ఎంత సంస్కారవంతుడయ్యాడో, ఎంతటి నీతి ప్రవచనాలు వల్లిస్తున్నాడో చూస్తుంటే తెలంగాణ వాదులకు ఆశ్చర్యం కలుగుతోంది. అబద్ధాలు చెప్పడంలోనూ, ఆత్మవంచన చేసుకోవడంలోనూ, బుకాయించడంలోనూ, తప్పులు చేసి తెలంగాణ వాదం ముసుగేసుకోవడంలోనూ మామను మించిన అల్లుడయ్యాడనిపిస్తోంది!



సంస్కారం, భాష, హుందాతనం వంటివాటి గురించి హరీష్‌రావు మాట్లాడటం చాలా ఆశ్చర్యకరం. అధికారంలో ఉన్నప్పుడూ, అధికారం పోయిన తరువాతా కూడా కేసీఆర్ మాట్లాడిన వికృత భాష, ప్రతీకార దాడుల గురించి ఎందుకు నోరు విప్పలేదు? అబద్ధాలు చెప్పడంలోనూ, ఆత్మవంచన చేసుకోవడంలోనూ, బుకాయించడంలోనూ, తప్పులు చేసి తెలంగాణ వాదం ముసుగేసుకోవడంలోనూ మామను మించిన అల్లుడయ్యాడనిపిస్తోంది!

రాజకీయాలు ఒక ఆట అని, వాగ్యుద్ధాలు సహజమేనని చెబుతున్న హరీష్‌రావుకు అందరికీ నియమావళి సమానమని అనిపిస్త లేదా? రాజకీయ మైదానంలో కేసీఆర్‌కు, బీఆర్ఎస్ నాయకులకు మాత్రమే బూతులు మాట్లాడే లైసెన్స్ ఉందా? వాళ్లు ఎన్ని మాట్లాడినా ప్రత్యర్థులు గౌరవంగా, మర్యాదగా మాట్లాడాలా? ఫుట్‌బాల్ ఆటలో కేసీఆర్ కాలితో ఆడితే ఆయన ప్రత్యర్థులు మాత్రం చేతితో ఆడాలా? ఇదెక్కడి న్యాయం? 80 వేలకు పైగా పుస్తకాలను చదివినట్టుగా చెప్పుకున్న కేసీఆర్‌కు ఆ పుస్తకాల్లో ఉన్న తిట్లను, బూతులను మాట్లాడటానికి ప్రత్యేక పర్మానా తెచ్చుకున్నారా? హరీష్‌రావుకు అధికారం పోయినా కేసీఆర్, కేసీఆర్ పార్టీ నాయకులు ప్రజాస్వామ్యానికి అతీతులమనే భావజాలంతోనే ఉన్నట్టున్నారు.

కాంగ్రెస్ పార్టీకి మరెవరూ దిక్కులేనట్లు తెలుగుదేశం నుంచి వచ్చిన నాయకుడు రేవంత్ రెడ్డిని అధ్యక్షుడిగా నియమించారని హరీష్‌రావు చాలా బాధపడ్డారు. తెలంగాణ ఏర్పాటైన తర్వాత తెలుగుదేశం తెలంగాణ రాష్ట్ర శాసనసభాపక్ష నాయకుడు (ఎర్రబెల్లి దయాకర్‌రావు) ఇప్పుడెక్కడున్నారు? తెలంగాణ ఏర్పాటైన తర్వాత టీడీపీ తెలంగాణ అధ్యక్షుడు (ఎల్. రమణ) ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నారు? అంతెందుకు హరీష్‌రావును మంత్రిగా, ఎమ్మెల్యేగా చేసిన కేసీఆర్ అంతకుముందు అదే తెలుగుదేశం పార్టీలో మంత్రిగా ఉన్న విషయం కూడా హరీష్‌రావుకు గుర్తులేదా? ఒకరిద్దరు నాయకులు తప్ప కేసీఆర్ మంత్రివర్గంలో ఉన్నవారు ఎవరు? కేసీఆర్‌తో సహా ఆయన కేబినెట్‌లో ఉన్నవారంతా చంద్రబాబుతో పనిచేసినవాళ్లే కదా! తెలంగాణ టీడీపీ మంత్రివర్గాన్ని ఏర్పాటు చేయాలనుకుంటే కేసీఆర్ మంత్రివర్గాన్ని చూపిస్తే సరిపోతుంది అని తెలంగాణ వాదులు చేసిన విమర్శలను హరీష్‌రావు ఎలా మర్చిపోతారు? తెలుగుదేశం పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యేలను టీఆర్ఎస్‌లో చేర్చుకొని మంత్రి పదవులిచ్చినప్పుడు హరీష్‌రావుకు నోరెందుకు పెగలలేదు? ప్రత్యక్షంగా తను రాసినవన్నీ కేసీఆర్‌కి వర్తిస్తాయని హరీష్‌రావుకు తెలియదా? తెలంగాణ ఏర్పాటైన వెంటనే టీఆర్ఎస్ అనేది ఒక పక్కా రాజకీయ పార్టీ అని, ఉద్యమ పార్టీ కాదు అని కేసీఆర్ చాలా స్పష్టంగా చెప్పిన విషయం హరీష్‌రావుకు ఎందుకో గుర్తులేదు.

సమైక్యవాద పాలకుల మానసపుత్రుడు రేవంత్‌రెడ్డి అని రాశారు. రేవంత్‌రెడ్డి ఏ విధంగా సమైక్యవాద మానస పుత్రుడో వివరించలేదు. తెలంగాణ బిల్లు అసెంబ్లీలో పెట్టినప్పుడు టీడీపీలో ఉండి కూడా తెలంగాణ కోసం అసెంబ్లీ బయట, అసెంబ్లీ లోపల కొట్లాడిన రేవంత్ రెడ్డి వీడియోలు, అసెంబ్లీ రికార్డులు బహిరంగంగానే ఉన్నాయి. లేకుంటే హరీష్‌రావుకు నేను పంపిస్తాను. ఒక రాజకీయపార్టీ నాయకుడిగా, ప్రజాప్రతినిధిగా ప్రజల శ్రేయస్సు, ఆత్మగౌరవం కోసమే రేవంత్‌రెడ్డి తండ్లాడిండు. అది కేసీఆర్‌కు, హరీష్‌రావుకు నచ్చకపోతే ఎవరేం చేస్తారు? సమైక్యవాదం గురించే మాట్లాడితే-2009లో టీడీపీ, సీపీఎం వంటి పార్టీలతో కలిసి పోటీ చేసి గెలిచిన కేటీఆర్, హరీష్‌రావులు ఎట్లా తెలంగాణ వాదులవుతారు? ఇట్లాంటి ఆత్మవంచన, అబద్ధాలు రెండున్నర దశాబ్దాలపాటు రాజకీయాల్లో ఉన్నానని చెప్పుకుంటున్న హరీష్‌రావుకు తగునా?

తెలంగాణ బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెడుతున్న సమయంలో రాష్ట్రాన్ని విడదీయవద్దని, సమైక్యాంధ్ర ఉద్యమం చేసిన జగన్మోహన్‌రెడ్డి ఎలా మిత్రుడయ్యాడు? ఆయనను ప్రగతిభవన్‌కు పిలిపించి సన్మానించి, భోజనం పెట్టి అలయ్ బలయ్ చేసుకున్నారు. కాళేశ్వరం కట్టవద్దని ధర్నా నిర్వహించిన అయనను ఆ ప్రాజెక్టు ఓపెనింగ్‌కి కేసీఆర్ ఏ విధంగా పిలిచారు? సమైక్యవాదులకు సన్మానాలు చేసి, ఆంధ్రాకి వెళ్లి వారింట చేపల పులుసు తిని రాయలసీమను రతనాల సీమగా మార్చాలని ప్రకటించిన మీ కేసీఆర్ సమైక్యవాదా? రేవంత్‌రెడ్డి సమైక్యవాదా?

రాజకీయ భాషను సంస్కరించి, సవరించే మహా యజ్ఞానికి పూనుకుంటానని హరీష్‌రావు శపథం తీసుకున్నారు, సంతోషం! ముందుగా తెలంగాణలో పాడు భాషకు ఆజ్యం పోసిన ఆ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తోనే మొదలుపెడితే నమ్మశక్యంగా ఉంటుంది. ఇప్పటిదాకా మాట్లాడినది తప్పు అనీ, ఇక అలాంటి పరుష పదజాలాన్ని రాజకీయ ప్రత్యర్థుల మీదా, ఉద్యమకారుల మీదా, జర్నలిస్టుల మీదా, న్యాయవాదుల మీదా, మహిళల మీదా, ప్రజల మీదా వాడననీ, ఇప్పటి దాకా కేసీఆర్, ఆ పార్టీ నాయకులు చేసిన వ్యాఖ్యలకు ప్రాయశ్చిత్తం చేయించిన తర్వాత హరీష్‌రావు ముందుకు వస్తే అది నిజంగా శుభ పరిణామమే!

▪ బోరెడ్డి అయోధ్యరెడ్డి
సీపీఆర్ఓ, తెలంగాణ ముఖ్యమంత్రి

మోదీ ఇండియా, రాహుల్ భారత్

'మనం మన దేశం గురించి మరణించక పోవచ్చు.. కానీ మన దేశం కోసం తప్పనిసరిగా జీవించాలి' అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు. తన అమెరికా పర్యటనలో భాగంగా లాంగ్ ఐలాండ్‌లోని ఒక స్టేడియంలో 13 వేల మంది ప్రవాస భారతీయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. దాదాపు 60 బస్సుల్లో అమెరికాలోని 40 రాష్ట్రాల నుంచి భారతీయులను రప్పించారు. 'భారతదేశం అవకాశాల కోసం ఎదురుచూడడం లేదు. అవకాశాలను కల్పిస్తోంది. ప్రతి భారతీయుడికీ భారతదేశం, దాని విజయాల పట్ల ఆత్మవిశ్వాసం ఉన్నది' అని మోదీ అన్నారు. సరిగ్గా మూడు వారాల క్రితం ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఇదే అమెరికాలో విస్తృతంగా పర్యటించి అనేక అంశాలను ప్రస్తావించారు. మోదీ తన అమెరికా పర్యటనలో రాహుల్ ప్రస్తావించిన అంశాలు ఏవీ లేవనెత్తలేదు. తన పాలనలో దేశం అభివృద్ధి చెందుతున్న తీరు, మౌలిక సదుపాయాల విషయంలో శీఘ్ర ప్రగతి గురించి వివరించారు. దాదాపు 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేలా చేశామని, ప్రపంచానికి మొబైల్ ఫోన్లను ఎగుమతి చేసే స్థాయికి ఎదిగామని చెప్పుకున్నారు. సహజంగానే 'భారత మాతాకీ జై' అన్న నినాదాలు మిన్నుముట్టాయి. ఆనందోత్సాహాలతో ఎంతో మంది స్త్రీ పురుషులు మోదీతో సెల్ఫీలు దిగేందుకు పోటీపడడంలో ఆశ్చర్యం లేదు.



మోదీకి పెద్ద ఎత్తున జనాన్ని రప్పించి మాట్లాడడమంటే చాలా ఇష్టం. కేంద్రంలో తొలిసారి అధికారంలోకి రాగానే 2014లో మేడిసన్ స్క్వేర్ గార్డెన్‌లోను, 2016లో కాలిఫోర్నియాలోని శాన్‌జోస్‌లోను, 2018లో టెక్సాస్‌లోని హ్యూస్టన్‌లోనూ ఆయన ఇదే విధంగా అమెరికాలో భారతీయ జనాన్ని రప్పించి మరీ వారి ముందు అనర్గళంగా ప్రసంగించి హర్షధ్వానాలు స్వీకరించారు.

మోదీ పర్యటించడానికి కొద్ది రోజుల ముందు రాహుల్ గాంధీ కూడా అమెరికాలో మూడు రోజుల పాటు పర్యటించారు. యువజనులు, సాంకేతిక నిపుణులు, విద్యార్థులను, జర్నలిస్టులను కలుసుకున్నారు. అమెరికాలో ట్రక్కు నడుపుతూ ప్రమాదానికి గురైన ఒక సిక్కు డ్రైవర్‌ను, ఆయన మిత్రులను కూడా కలుసుకుని వారి జీవన పరిస్థితులను తెలుసుకున్నారు. ఇండియా రాగానే కర్నాల్‌లో ఆ డ్రైవర్ ఇంటికి వెళ్లి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

మోదీ, రాహుల్ ఇద్దరూ అమెరికాలో పర్యటించినప్పటికీ వారు కలుసుకున్న ప్రజలు వేరు, మాట్లాడిన అంశాలు వేరు. ఇప్పటి వరకూ అమెరికా వంటి అగ్రరాజ్యానికి వెళ్లి నరేంద్రమోదీ చెప్పిన దానికి భిన్నంగా మాట్లాడిన భారతీయ నేత లేరు. గత పది సంవత్సరాలుగా రాహుల్‌గాంధీ పడుతూ, లేస్తూ, పాఠాలు నేర్చుకుంటూ అటు పార్లమెంట్‌లోనూ, బహిరంగ సభల్లో మాత్రమే కాకుండా అమెరికాకు కూడా వెళ్లి మాట్లాడగలిగిన స్థాయికి చేరుకున్నారనడంలో సందేహం లేదు. ఈ ఇద్దరి పర్యటనలు వారి ఆలోచనా దృక్పథాలను ప్రతిఫలించాయి. ఒక ప్రధానిగా మోదీ భారతదేశంలో అద్భుతాలు జరుగుతున్నాయని, తన హయాంలో అభివృద్ధి తారస్థాయికి చేరుకున్నదని చెప్పుకోవడం సహజం. అదే సమయంలో భారతదేశంలో నిరుద్యోగం గురించి, ఎన్నికల్లో ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు లేకపోవడం గురించి, ప్రతిపక్ష పార్టీల అణచివేత గురించి, రైతుల సమస్యల గురించి రాహుల్ అమెరికాలో భారత జనానికి వివరించారు. మోదీ మాటలు విని హర్షధ్వానాలు చేసే ప్రేక్షకులు వేరు. రాహుల్ మాటలు విని ప్రశ్నలు లేవనెత్తే జనం వేరు. ఈ ఇద్దరూ తమ ఆడియెన్స్‌ను తాము సృష్టించుకున్నారు. రాహుల్‌గాంధీలా వాషింగ్టన్‌లోని నేషనల్ ప్రెస్ క్లబ్‌కు మోదీ వెళ్లి జర్నలిస్టులతో మాట్లాడే అవకాశాలు లేవు. భారత దేశంలోనే ఆయన గత పదేళ్లలో విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసిన దాఖలాలు లేవు. ఇరువురి భావాల ఘర్షణకు అమెరికా వేదిక అయింది.

నరేంద్ర మోదీ, రాహుల్‌గాంధీ ఇద్దరూ తమ అమెరికా పర్యటనలో ఒకే ఇండియా గురించి మాట్లాడారు. మోదీ ప్రచారం చేసిన ఇండియా వేరు, రాహుల్ ప్రదర్శించిన ఇండియా స్వరూపం వేరు. ఒకరిది సంపన్న భారతదేశం, అభివృద్ధి కోసం ఉరకలు వేస్తున్న ఇండియా అయితే మరొకరిది నిరుద్యోగం, అధిక ధరల మధ్య సతమతమవుతూ, పలు అణచివేతలను ప్రతిఘటిస్తున్న భారతదేశం. ఎవరు వాస్తవం చెబుతున్నారనుకోవాలి? నిజానికి మోదీ చాటి చెప్పిన సంపన్నత, రాహుల్ ప్రస్తావించిన సమస్యలు భారతదేశంలో ఉన్నాయని ఎవరైనా అంగీకరించక తప్పదు.



▪ ఎ. కృష్ణారావు

ఇండియాగేట్

తేడా ఏమంటే మోదీ ఇప్పటికే తనతో ప్రభావితమైన వారితో మాట్లాడితే రాహుల్ తన ప్రభావం చూపేందుకు అమెరికాలో రకరకాల భారతీయ వర్గాలను కలుసుకున్నారు. ఇద్దరూ ఒకే ఇండియా గురించి మాట్లాడారు. అయితే మోదీ ప్రచారం చేసిన ఇండియా వేరు, రాహుల్ ప్రదర్శించిన ఇండియా స్వరూపం వేరు. ఒకరిది సంపన్న భారతదేశం, అభివృద్ధి కోసం ఉరకలు వేస్తున్న ఇండియా అయితే మరొకరిది నిరుద్యోగం, అధిక ధరల మధ్య సతమతమవుతూ, పలు అణచివేతలను ప్రతిఘటిస్తున్న భారతదేశం. మోదీ, రాహుల్‌లలో ఎవరు వాస్తవం చెబుతున్నారనుకోవాలి? నిజానికి ప్రధానమంత్రి, ప్రతిపక్ష నేత ప్రస్తావించిన వేర్వేరు ఇండియాలు భారతదేశంలో ఉన్నాయని ఎవరైనా అంగీకరించక తప్పదు. మోదీ తన హయాంలో సృష్టించిన సంపద గురించి మాట్లాడితే రాహుల్‌గాంధీ ఈ సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతం కావడం గురించి మాట్లాడారు. 'నేను మోదీని ద్వేషించను.. నా ఆలోచనా విధానం వేరు, ఆయన ఆలోచనా విధానం వేరు..' అని రాహుల్ వాషింగ్టన్‌లోని జార్జిటౌన్ యూనివర్సిటీలో విద్యార్థులతో మాట్లాడుతూ చెప్పారు.

రాహుల్‌గాంధీ తన అమెరికా పర్యటనలో సరిహద్దుల్లో చైనా బలగాల మోహరింపు గురించి మాట్లాడారు. చైనా దళాలు చొచ్చుకురావడం గురించి ఆయన చేసిన వ్యాఖ్యలను భారతదేశంలో ఎవరూ పెద్దగా ఖండించలేదు. నిజానికి ఈ విషయంలో మోదీ ప్రభుత్వంలో కూడా ఆందోళన నెలకొన్నది. అందువల్ల ఒక వైపు అమెరికాలో మోదీ క్వాడ్ సమావేశంలో పాల్గొని, కీలకమైన రక్షణ ఒప్పందాలను కుదుర్చుకున్నప్పటికీ మరోవైపు చైనాతో చర్చలకు ద్వారాలు తెరిచారు. కొద్ది రోజుల క్రితం సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన బ్రిక్స్ జాతీయ రక్షణ సలహాదారుల సమావేశంలో భారత భద్రతా సలహాదారు అజిత్ డోవల్ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తోనూ, చైనా విదేశాంగ మంత్రితోనూ చర్చలు జరిపారు. వాస్తవ నియంత్రణ రేఖ వద్ద నుంచి ఇరు దేశాల సైన్యాలు తక్షణమే వెనక్కు వెళ్లేలా చేయాలని కోరారు. అంతకు ముందు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ కూడా చైనా విదేశాంగ మంత్రితో మాట్లాడారు. సరిహద్దుల్లో ఉద్రిక్తత తగ్గడంతోపాటు భారతదేశం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలంటే చైనాతో వ్యాపార సంబంధాలు సజావుగా సాగడం ముఖ్యమని ప్రభుత్వ ప్రధాన ఆర్థిక సలహాదారు అనంత నాగేశ్వరన్ లాంటి వారు కూడా సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో చైనా దూకుడు గురించి రాహుల్ చేసిన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఉన్నదని చెప్పక తప్పదు. చైనా బలగాలు వెనక్కు తగ్గేలా చేయడం మోదీకి కూడా రాజకీయ అవసరం.

స్థూలంగా చూస్తే ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పెద్ద సమస్యల్లేవు. 13 సంవత్సరాలు గుజరాత్‌లో ముఖ్యమంత్రి పదవి నిర్వహించిన తర్వాత ఆయన పది సంవత్సరాలు కేంద్రంలో అధికారం చెలాయించారు. భారతీయ జనతా పార్టీని రెండుసార్లు తిరుగులేని మెజారిటీతో గెలిపించిన మోదీ మూడోసారి కూడా ఆ పార్టీకి 240 సీట్లు సంపాదించి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయగలిగారు. ఇప్పటికీ బీజేపీ, దాని మిత్రపక్షాలు 16 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాయి. లోక్ సభలో 543 సీట్లలో 293 సీట్లు, రాజ్యసభలో దాదాపు సగం సీట్లు ఎన్డీఏకు ఉన్నాయి. మరో అయిదేళ్ల వరకూ నరేంద్రమోదీ సారథ్యంలోని బీజేపీకి ఢోకా లేదని చెప్పేందుకు అనేక కారణాలున్నాయి.

అయితే రాజకీయాల్లో స్థిరత్వం పూర్తిగా సంఖ్యాబలంపై ఆధారపడి ఉండదు. ప్రజలు మన గురించి ఏమనుకుంటున్నారు, మన పాలన ఎలా సాగుతుంది, మన విధానాలు ఎలా ఉన్నాయి, ఇతర రాజకీయ పార్టీలకు ఎంత మేరకు జనాదరణ లభిస్తుంది అన్న అంశాలపై ప్రభుత్వం గ్రాఫ్ పెరుగుతోందా, పడిపోతుందా సులభంగా చెప్పవచ్చు. మోదీ మూడోసారి తక్కువ సంఖ్యాబలంతో గెలిచిన తర్వాత మళ్లీ పూర్తి మెజారిటీ సాధించేలా పార్టీని నడిపించడం ఆయనకు కత్తిమీద సాములా కనపడుతోంది. ఒకరి నాయకత్వంలో పార్టీ దినదిన ప్రవర్ధమానమవుతుంటే అందరూ ఆరాధించే వారే కనపడుతుంటారు. కాని అదే పార్టీ దెబ్బతినడం ప్రారంభమవుతే బహిర్గత విమర్శకులతో పాటు అంతర్గత ప్రత్యర్థులు కూడా సిద్ధమవుతారు. శ్రీశ్రీ అన్నట్లు నిప్పులు చిమ్ముకుంటూ ఎగిరిపోతుంటే నిబిడాశ్చర్యం ప్రదర్శించినవారే నేలకు రాలిపోతున్నప్పుడు నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తారు. మోదీకి ఇకనుంచి అగ్ని పరీక్షలు మొదలు కానున్నాయి. హర్యానా, జమ్ము-కశ్మీర్, మహారాష్ట్ర, జార్ఖండ్, ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు ఆయన శక్తి సామర్థ్యాలకు పరీక్షగా మారనున్నాయి. ఇప్పటి వరకూ ప్రతి ఎన్నికలోనూ మోదీయే తాను ముందుండి నిలిచి ఉధృతంగా ప్రచారం చేసి గెలిపించారు. పార్టీ అంతా ఆయనపైనే ఆధారపడవలసిన పరిస్థితి ఆయనే కల్పించారు. ఎన్నికల్లో గెలిపించడం అనేది సింహంపై స్వారీ చేయడం లాంటిదని ఆయనకు కూడా తెలుసు. ప్రత్యర్థులను బలహీనపరిచేందుకు మోదీ, షాలు ఇంతవరకూ ప్రయోగించిన అస్త్రాలు ఇక ముందు కూడా పనిచేస్తాయో లేదో చెప్పలేము.

మోదీకి ఎన్ని సమస్యలున్నాయో రాహుల్‌కు కూడా అన్ని సమస్యలున్నాయి. బీజేపీ అంతా మోదీ వైపు చూస్తున్నట్లు ఇండియా కూటమి అంతా రాహుల్ నాయకత్వ శైలిపైనే ఆధారపడి ఉన్నదని చెప్పక తప్పదు. అందువల్ల రాహుల్ వేసే ప్రతి అడుగూ, మాట్లాడే ప్రతి మాటా ఆచితూచి మాట్లాడక తప్పదు. మోదీ ఎదుర్కొనే ప్రతి సమస్యను రాహుల్ తనకు అనుకూలంగా మార్చుకోవాల్సి ఉంటుంది. కాంగ్రెస్ 99 సీట్లు సాధించిన తర్వాత ఆయన ప్రతిపక్ష నేతగా అమెరికా వెళ్లి మాట్లాడే ధైర్యం చేయగలిగారు. కాని ఇంటగెలవకుండా రచ్చగెలవడం సాధ్యం కాదు. అనేక చోట్ల సంస్థాగత బలహీనతలు, అసమ్మతి, అసంతృప్తి, నాయకుల మధ్య కుమ్ములాటలు కాంగ్రెస్ సహజలక్షణాలుగా మారాయి. ఏఐసీసీ హర్యానా నేతలతో నిండిపోవడం, తెలంగాణతో పాటు వివిధ రాష్ట్రాలనుంచి నేతలు ఢిల్లీ చుట్టూ తిరగడం చూస్తుంటే పాత సంస్కృతిలోంచి కాంగ్రెస్ ఇంకా బయటపడలేదని తెలుస్తోంది. నరేంద్ర మోదీ, రాహుల్‌గాంధీలలో ఎవరు దేశానికి దిశానిర్దేశం చేయగలరు?


(ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిధి)

ధరణి లోపాల ఊసెత్తకుండా కొత్త చట్టమా!?

తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకునే ప్రయత్నంలో భాగంగా రైతులు పడుతున్న కష్టాలను గట్టెక్కించడానికి ధరణి పోర్టల్ స్థానంలో కొత్త ఆర్ఓఆర్ చట్టం-2024ను తీసుకొని వస్తానంటుంది. ధరణిగా పిలవబడే పోర్టల్ 2020 అసెంబ్లీలో చర్చ చేయబడని చట్టం, అది ఒక చట్టం కాని చట్టం. ఈరోజు వరకు కూడా దానివల్ల ప్రజలు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఏ రకమైన స్పందన లేని గత ప్రభుత్వం చివరికి అధికారం కూడా కోల్పోవలసి వచ్చింది. ఈ పోర్టల్‌ను బంగాళాఖాతంలో వేస్తామంటూ ప్రచారం చేసి ప్రజలకు హామీనిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఇప్పుడు అందులోని లోటుపాట్లను సవరించకుండా కొత్త ఆర్ఓఆర్ 2024 చట్టం తెస్తానంటున్నది.

ధరణి పోర్టల్ 2020 - కొత్త ఆర్.ఓ.ఆర్ చట్టం 2024.. ఈ రెండింటిని కూడా నల్సార్ యూనివర్సిటీ వారు తయారు చేశారు. కొత్త చట్టం ముసాయిదా కూడా తయారు చేశారు. ఈ రెండు చట్టాల్లో కూడా 1971లో వచ్చిన ఆర్ఓఆర్ చట్టానికి భిన్నమైన సూచనలు ఏమీ లేవు. ఈ చట్టం ఆధారంగానే 1989లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో సీనియర్ ఐఏఎస్ అధికారుల పర్యవేక్షణలో రూల్స్ రూపొంది, అవి అమలు జరుగుతూ వస్తున్నాయి. అప్పటి నుండి 2019 వరకు కూడా సజావుగా జరిగాయి. ప్రజలకు కొన్ని అసౌకర్యాలు ఉన్నప్పటికీ ఆ వ్యవస్థ బాగానే ఉండింది.

ధరణిలో ఉన్న లోపాలను సరి చేయకుండా కొత్త వ్యవస్థ ప్రతిపాదనలు ఎంతవరకు సబబు? 1971 చట్టాన్ని అనుసరించి కొన్ని మార్పులు చేర్పులు చేసి సంస్థాగతమైన నిర్ణయాలు తీసుకుని చట్టం చేసి ఉంటే కొంత మేలు జరిగేది. నిజానికి ఈ రెండు కొత్త చట్టాలకు 1971 చట్టం మూలమైన ఆధారం. ఈ మూడింటిని క్రోడీకరించి ప్రస్తుత పోర్టల్‌లో కరెక్షన్ చేసి ఉంటే సరిపోయేది.



ధరణిలో ఉన్న లోపాలను సరిచేయకుండా కొత్త వ్యవస్థ ప్రతిపాదనలు ఎంతవరకు సబబు. 1971 చట్టాన్ని అనుసరించి కొన్ని మార్పులు చేర్పులు చేసి సంస్థాగతమైన నిర్ణయాలు తీసుకుని చట్టం చేసి ఉంటే కొంత మేలు జరిగేది. నిజానికి ఈ రెండు కొత్త చట్టాలకు 1971 చట్టం మూలమైన ఆధారం. ఈ మూడింటిని క్రోడీకరించి ప్రస్తుత పోర్టల్‌లో కరెక్షన్ చేసి ఉంటే సరిపోయేది. అంతేగాని కొత్త చట్టం తీసుకురావడం, రూల్స్ తయారు చేయడం కాలయాపనే అవుతుంది.

కొత్త చట్టం ముసాయిదా రెడీ అయ్యింది. తెలంగాణ ప్రభుత్వం దీన్ని చర్చ కోసం, ప్రజాభిప్రాయం కోసం ప్రజలు ముందుకు తీసుకొచ్చింది. ఈ బిల్లు కాపీలను అన్ని ప్రతిపక్షాలకు, అన్ని రాజకీయ పార్టీలకు, రైతు సంఘాలకు, రిటైర్డ్ కలెక్టర్లకు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగ సంఘాలకు ఇచ్చారు. బిల్లు కాపీలను ప్రజాక్షేత్రంలో పెడుతూ అందరి సలహాలు సూచనలు కోరారు. అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల్లో కూడా సమావేశాలు నిర్వహించి రైతులు, రాజకీయ నాయకులు జిల్లాల వారీగా ఉన్న ముఖ్య నాయకుల సమక్షంలో సమావేశాలు నిర్వహించారు. ప్రజల నుండి వస్తున్న సూచనలను, సలహాలను పరిగణనలోకి తీసుకొని ముందుకెళ్లాలని ప్రభుత్వం సూచించింది.

ఇక్కడ అనుభవజ్ఞులైన రెవెన్యూ సిబ్బంది, కొన్ని రైతు సంఘాలు చేసిన సూచన ప్రకారం 1971లో వచ్చిన ఆర్ఓఆర్ చట్టం ఒక శాస్త్రీయ దృక్పథంతో చేయబడింది. ప్రస్తుత ధరణిలో ఉన్న మార్పులు చేర్పులు చేసి యథాతథంగా కొనసాగిస్తే సరిపోతుంది. అనుభవదారు లేదా కాస్తు కాలమ్‌లో సాగు రైతు పేరు ఉండాలని సూచనలు వచ్చాయి. యాభై సంవత్సరాలుగా కౌలు చేసుకుంటున్న భూములను ప్రభుత్వం కొనుగోలు చేసి ఇచ్చి ఉంటే రైతులకు మేలు జరిగేది. గత ప్రభుత్వం దళితులకు మూడు ఎకరాల వాగ్దానం నెరవేరేది. భూమిని కొని ఇవ్వకపోగా కౌలు చేసుకుంటున్న భూములకు, కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి అందవలసిన సహాయం అందకుండా పోయింది. ప్రస్తుతం చేస్తున్న మార్పులు చేర్పులలో వారికి కొన్ని రక్షణలు కల్పించాలి.

వీటన్నింటినీ దృష్టిలో ఉంచుకొని గత ప్రభుత్వం 2020లో కౌలు రైతుల హక్కులను గుర్తించకుండా అనుభవదారుని గడిని తొలగించారు. దీనివలన వందలు వేల ఎకరాల పట్టాదారులు లేదా భూస్వాములు వాటిని అమ్ముకోవడం కొనుగోలు చేయడం సులభతరం అయ్యింది. కేసీఆర్ లక్ష్యం నెరవేరింది. ఈ వాస్తవాలు తెలంగాణ రాష్ట్ర ప్రజలకు ఆలస్యంగా అర్థం అయ్యాయి. ఇప్పుడు కొత్త చట్టం పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వ ముందుకు వస్తోంది. కానీ మెజారిటీగా ఉన్న బడుగు బలహీనుల, చిన్న సన్నకారు రైతుల, ప్రజా ప్రయోజనాలకు వాస్తవ రూపాన్ని ఇచ్చేలా కొత్త చట్టం ఉండాలి.

రైతులు చేస్తున్న ప్రధాన సూచనలలో భాగంగా తహసీల్దారు నుంచి తొలగించబడిన అధికారాలను పునరుద్ధరించాలి. ఎనభై శాతం పనులు తహసీల్దారు కార్యాలయంలోనే జరగాలి. పాలన వికేంద్రీకరించబడాలి. పరిపాలన సజావుగా జరగాలంటే యాభై మూడు రకాల విధులు నిర్వహించవలసిన రెవెన్యూ శాఖ, పాలకుల ఇష్టానుసారం కాకుండా అవసరమైన క్షేత్రస్థాయి మానవ వనరులు వీఆర్ఏ, వీఆర్వోలను, ప్రతి మండలానికి ఒక సర్వేయర్ లేదా లైసెన్స్ సర్వేయర్, పాత తహసీల్దారు కార్యాలయానికి ఒక స్టాటిస్టికల్ అధికారిని నియమించేలా చట్టం చేయాలి. తెలంగాణ రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమిని కొలిచి కమతాల వారీగా ఒక యూనిక్ నంబర్ ఇవ్వాలి. జాయింట్ రిజిస్టర్ వద్ద జరిగే వ్యవసాయ భూముల మ్యుటేషన్, సక్సెషన్ ప్రొసీడింగ్స్ ఇచ్చే ముందు పదిహేను రోజుల వ్యవధి ఉండాలి. అభ్యంతరాలు ఏవైనా ఉంటే బయటికి వస్తాయి. తహసీల్దారు ఇచ్చిన ఉత్తర్వులలో ఏవైనా లోపాలు ఉంటే ఆర్డీఓకి అప్పీలు చేసుకునేలా ఉండాలి. ఇక్కడ న్యాయం జరగకపోతే జాయింట్ కలెక్టర్, చివరగా ల్యాండ్ రెవెన్యూ ట్రిబ్యునల్ ఏర్పాటు చేసి అన్ని స్థాయిల్లో తొంభై రోజులలో పరిష్కారించేలా చట్టం చేయాలి.

ప్రస్తుతం ఉన్న ధరణి పోర్టల్ పుస్తకం లాంటిది, భూదార్ కార్డు దానికి ఇవ్వాలని అనుకుంటే ముందు భూదార్, టెంపరరీ భూదార్, భూదార్ కార్డు ఇందుకు ఒక సంపూర్ణమైన నిర్వచనం ఉండేలా చూడాలి. ఇది సమగ్ర సర్వే చేయకుండా ఏ కార్డు ఇచ్చినా ఈ ప్రయోగం నిరర్థకమే. అన్ని భూములను ఒకసారి సర్వే చేయాలి. ఆ పని చేయకుండా ఏ నిర్ణయమైనా సరైన ఫలితాలను ఇవ్వదు. ధరణి స్థానంలో భూమాత అనే పేరు ఉండటం ఎవరికీ అభ్యంతరం ఉండదు. ఈ చట్టంలో ఏజెన్సీ ప్రాంతాల్లోని భూమి బాధిత ఆదివాసీల ప్రస్తావన తీసుకురావాలి. 1/70 చట్టం సరిగ్గా అమలు అయ్యేలా రూపకల్పన చేయాలి. ప్రతి ఏటా పాత పద్ధతిలోనే జమాబందీ చేయాలి. రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమి లెక్క తేలుతుంది. ప్రతి ఏటా భూమాత రికార్డును ఒక ప్రింట్ తీసి అన్ని అమెండ్మెంట్లతో ఫస్లీ ఇయర్‌లో తయారు చేయాలి. మ్యుటేషన్, సక్సెషన్ సమయంలో చట్టబద్ధంగా నియమించబడిన కంప్యూటర్ టెక్నీషియన్, బాధ్యతాయుతమైన సర్వీస్ ప్రొవైడర్ (ఎస్‌ఐసి), మీసేవ లాంటి ప్రైవేట్ సంస్థలపై కూడా నిఘా ఉండేలా చట్టం చేయాలి. అరవై శాతం గ్రామీణ ప్రజల జీవనాధారం వ్యవసాయం. రైతులు, రైతు కూలీల, రైతు అనుబంధ వృత్తుల వారి దృష్టి కోణంలో పై సలహాలను క్షుణ్ణంగా పరిశీలించి, పారదర్శకమైన సులభతరమైన భాషలో ఒక ప్రగతిశీలమైన కొత్త భూమి హక్కుల రికార్డు చట్టం 2024 తీసుకురావాలి.

• వి. బాలరాజు
తహసీల్దారు రిటైర్డు

అభివృద్ధికి మానవత్వమే పునాది

నేడు పండిట్ దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి. తన జీవితాన్ని దేశం కోసం త్యాగం చేసిన అసామాన్య వ్యక్తి. దీనదయాళ్ ఉపాధ్యాయ ఏకాత్మ మానవ దర్శనం సిద్ధాంతాన్ని రూపొందించారు. ఇది వ్యక్తి నిర్మాణం, సమాజ నిర్మాణంతో పాటు వ్యక్తిని, సమాజాన్ని, అభివృద్ధిని ధర్మమార్గంలో నడిపిస్తుంది. ఈ సిద్ధాంతం ఆధారంగా వ్యక్తి శరీరం... మనస్సు, బుద్ధి, ఆత్మల కలయిక, అలాగే సమాజం కూడా ప్రజలు అనే శరీరం, సంకల్పం అనే మనస్సు, ధర్మం అనే బుద్ధి, ఆదర్శాలు అనే ఆత్మను కలిగి వుంటుంది. వ్యక్తితో పాటు సమాజం కూడా చతుర్విధ పురుషార్థాలను ఆచరించినప్పుడు వ్యక్తి, సమాజం పరస్పర సహకారపూరకాలుగా ఉండి, అభివృద్ధి చెంది, మానవత్వం పునాదిగా దేశం సమగ్రాభివృద్ధి చెందుతుందని ఏకాత్మ మానవ దర్శనం బోధిస్తుంది.

సమాజంలో వ్యక్తులు స్వార్థపరులైనపుడు ఆ సమాజం అందరికీ విద్యను, ఉద్యోగాలను ఇవ్వలేదు. సమాజంలోని ప్రతి వ్యక్తి ఎదుగుదలకు సమాజంలో కుటుంబ వ్యవస్థను, సామాజిక నిర్మితిని పటిష్టం చేయాలి. సమాజాన్ని రక్షించే విషయంలో కొందరు మహానుభావులు ఈ కుటుంబ, సామాజిక విలువలను తమ సాంస్కృతిక ఉద్యమాల ద్వారా నిలబెడతారు. వీరినే విరాట్ స్వరూపులుగా వర్ణించారు దీనదయాళ్.

– డా. శ్రీశైలం వీరమల్ల
ఇగ్నో, న్యూఢిల్లీ


కార్యక్రమంలో మాట్లాడుతున్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి


కౌన్సిల్ సమావేశానికి హాజరైన మంత్రి, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లు


కమిషనర్ అశ్విని తానాజీ వాకడే


మాట్లాడుతున్న మేయర్ గుండు సుధారాణి

- ప్రతిపక్షాల నిరసనలు, నినాదాల మధ్య తీర్మానాలు
- సమస్యలు చెప్పుకొనేందుకు మైక్ ఇవ్వలేదని సభ్యుల ఆందోళన
- సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్ కార్పొరేటర్లు
- మేయర్ తీరుపై ప్రతిపక్ష నేతల అసహనం
- రూ.30కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులకు ఆమోదం

గరం గరంగా..

బల్దియా కౌన్సిల్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 24: వరంగల్ నగరాభివృద్ధి, 15వ ఆర్థిక సంఘం మిగులు నిధుల నుంచి నీటి సరఫరా, పారిశుధ్యంతోపాటు ఇతర అభివృద్ధి పనులు చేపట్టడానికి మంగళవారం జరిగిన గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం వాడి వేడిగా సాగింది. అధికార, ప్రతిపక్ష కార్పొరేటర్ల అరుపులతో దద్దరిల్లింది. ముందునుంచీ అనుకున్నట్టుగానే బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు కొంతసేపు సమావేశంలో నిరసన తెలిపారు. మేయర్ గుండు సుధారాణి తీరుపై కొందరు బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్లు మండిపడ్డారు. ఈ క్రమంలోనే కొన్ని ప్రతిపాదనలు సమావేశం ఆమోదించింది.

కాగా, బల్దియా కౌన్సిల్ సమావేశానికి కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీకి చెందిన కార్పొరేటర్లతో పాటు కొందరు మహిళా కార్పొరేటర్ల భర్తలు ఉదయం 11గంటలకు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ వద్దకు చేరుకున్నారు. కార్పొరేటర్లు 11.30 కౌన్సిల్‌హాల్‌లోకి చేరుకున్నారు. అంతకుముందే బల్దియా పాలకమండలి కార్యాలయంలో రాష్ట్ర దేవాదాయ, పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ, వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, పరకాల రేవూరి ప్రకాశ్‌రెడ్డితోపాటు మేయర్ గుండు సుధారాణి సమావేశమయ్యారు. సాధారణ సర్వసభ్య సమావేశపు సప్లిమెంటరీ ఎజెండా అంశాలు, సమావేశంలో వ్యవహరించాల్సిన తీరుపై మాట్లాడుకున్నట్టు తెలిసింది. ఆ తర్వాత మంత్రి సురేఖ, ఎమ్మెల్యేలు, మేయర్, కాంగ్రెస్ కార్పొరేటర్లు జట్టుగా కౌన్సిల్ హాల్‌కు చేరుకున్నారు. బల్దియా కౌన్సిల్ సమావేశం ప్రారంభమయ్యాక మేయర్ గుండు సుధారాణి మేయర్ సీట్లో కూర్చుని 15వ ఆర్థిక సంఘం నిధులకు రూ.30కోట్లకు ప్రతిపాదించగా సభ్యులు ఆమోదం తెలిపారు.

ఈ సందర్భంగా కొందరు బీఆర్ఎస్ కార్పొరేటర్లు వారి వారి డివిజన్‌లలో నెలకొన్న సమస్యలు, అభివృద్ధిపై ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని చెప్పకునేందుకు మాట్లాడే అవకాశం కల్పించాలని కోరినా వారికి మైక్‌ను ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ కార్పొరేటర్లను చాలా చులకనగా చూశారని, కౌన్సిల్‌లో కనీస మర్యాద ఇవ్వకపోవడంతో బహిష్కరించామని తెలిపారు. సమావేశం తీరు పూర్తిగా రాజ్యాంగ విరుద్ధమని, మేయర్ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ కార్పొరేటర్లు, డిప్యూటీ మేయర్ రిజ్వానా పేర్కొన్నారు. కాగా, బీఆర్ఎస్ కార్పొరేటర్లు బయటకు వెళ్లిన తర్వాత మధ్యాహ్నం 3 గంటల వరకు కౌన్సిల్ సమావేశం ప్రశాంతంగా జరిగింది. అయితే ఎంజెండాలో ప్రస్తావించిన అంశాల లో రెండింటినీ తిరస్కరించారు. బల్దియా ఇండోర్ స్టేడియంలో పని చేస్తున్న బ్యాడ్మింటన్ కోచ్ శ్రీధర్ గడువు పొడగింపు నిలిపివేయాలని ఎమ్మెల్యే నాగరాజు వెల్లడించారు. అదేవిధంగా ప్రస్తుతం నగరంలో సీఎం నిధుల నుంచి జరుగుతున్న రూ.67లక్షల అభివృద్ధి పనులను జనరల్ ఫండ్ నుంచి ఇవ్వాలని ప్రతిపాదనలో చేర్చడంతో దానికి మంత్రి కొండా సురేఖ తిరస్కరించారు. సీఎం ఫండ్‌ను జనరల్ ఫండ్ నుంచి ఇవ్వకూడదని సీఎంకు లెటర్ పెట్టి డబ్బులు తెప్పించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.

ఆమోదించిన ఎజెండా అంశాలు

- ప్రజారోగ్య విభాగంలో పని చేస్తూ రోడ్డు ప్రమాదానికి గురై మరణించిన కొమ్ము దేవయ్య కుటుంబానికి రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా
- అన్నపూర్ణ అక్షయపాత్ర ద్వారా ప్రజలకు రూ.5కే భోజనం అందిస్తున్న సంస్థకు రూ.2.35కోట్లు
- ఇంజనీరింగ్ విభాగంలో పనులు చేసేందుకు కావలసిన సౌకర్యాల కోసం రూ.2కోట్లు కేటాయింపు
- 16వ డివిజన్, బట్టల బట్టల బజార్, బాలసముద్రం చిల్డ్రన్స్ పార్క్ అభివృద్ధి, ఉనికిచెర్లలో వివిధ అభివృద్ధి పనులకు రూ.3.60లక్షల కేటాయింపు
- అర్బన్ మలేరియా విభాగం దోమల నివారణ కోసం రూ.1.39లక్షల కేటాయింపు
- ఇంటింటికీ చెత్త సేకరణ, రోడ్ల శుభ్రత కోసం 250 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకం
- వరంగల్ నగరంలోని పలు డివిజన్‌లు, మెయిన్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ.100కోట్లు కేటాయింపు

ప్రశాంతంగా కౌన్సిల్ సమావేశం

బల్దియాలో జరిగిన కౌన్సిల్ సమావేశం చాలా ప్రశాంతంగా జరిగిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో చాలా సమస్యలు ప్రస్తావించామన్నారు. ముఖ్యమంత్రిని గ్రేటర్ వరంగల్ అభివృద్ధికి రూ.100కోట్లు కావాలని కోరుతామన్నారు ఇండ్లకు అనుమతులిచ్చే సమయంలో అధికారులు పూర్తి విచారణ జరపాలన్నారు. శానిటేషన్ విభాగంలో ప్రజలు ఫిర్యాదు చేసిన వెంటనే సీఎంహెచ్‌వో, శానిటరీ ఇన్‌స్పెక్టర్, జవాన్‌లు స్పందించకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. నగరంలో చాలా చోట్ల వీధి లైట్లు వెలగడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయని, ఎలక్ట్రిసిటీ

మిగతా 8వ పేజీలో..

బొమ్మకు ప్లాస్టిక్ అలంకరణ

ప్లాస్టిక్‌ను నిషేధించాలని సందేశం



గ్రేటర్ వరంగల్‌లో ప్లాస్టిక్‌ను నియంత్రించేందుకు ప్రజారోగ్య విభాగం అధికారులు వినూత్నంగా బొమ్మను ప్రదర్శించారు. మంగళవారం బల్దియా కౌన్సిల్ సమావేశానికి హాజరవుతున్న మంత్రి, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు కొట్టొచ్చినట్టు కనిపించే విధంగా ఆకర్షణీయంగా బొమ్మకు ప్రజలు ఉపయోగించే ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ సంచులు, ప్లాస్టిక్ బాటిళ్లు కట్టి అలంకరించారు. మొత్తంగా ప్లాస్టిక్ వస్తువులు వాడకూడదని, ప్లాస్టిక్ ద్వారా ఆరోగ్యపరమైన సమస్యలు వస్తాయని అధికారులు చెప్పకనే బొమ్మతో చెప్పించారు.

మఫ్టీలో పోలీసులు

కౌన్సిల్ సమావేశంలో గొడవ జరుగుతుందనే అనుమానంతో ముందస్తుగా ఇంటెలిజెన్స్, ఎస్‌బీ నిఘా వర్గాలు అప్రమత్తమయ్యాయి. సీపీ అంబర్ కిశోర్ ఝా ఆదేశాల మేరకు పోలీసులను రంగంలోకి దిగారు. ఈ క్రమంలో కౌన్సిల్ హాల్‌లో సమావేశం నేపథ్యంలో 100 మంది పోలీసులు బల్దియాకు చేరుకున్నారు. ఎంజీఎం రెండో గేటు నుంచి కౌన్సిల్ హాల్ వరకు పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కొందరు పోలీసులను ఎవరికీ అనుమానం రాకుండా కార్పొరేటర్ల మధ్య కూర్చోబెట్టారు. ఇద్దరు ఇన్‌స్పెక్టర్లు, ఇద్దరు ఎస్‌ఐలతో పాటు మహిళా, పురుష పోలీసు కానిస్టేబుళ్లు హాల్‌లో కూర్చున్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ కార్పొరేటర్ల మధ్య జరిగిన సంభాషణలను అక్కడ ఉన్న పోలీసులు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు సమాచారం అందించారు.

వివేకానందుడి స్ఫూర్తితో యువత రాణించాలి..

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- జేఎన్ఎస్‌లో ప్రారంభమైన యువజనోత్సవాలు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 24: భారతదేశ గొప్పతనాన్ని విశ్వవ్యాప్తం చేసిన స్వామి వివేకానంద స్ఫూర్తితో యువత రాణించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో హనుమకొండ జవహర్‌లాల్‌నెహ్రూ స్టేడియం (జేఎన్ఎస్)లో మంగళవారం ఏర్పాటుచేసిన జిల్లా యువజనోత్సవాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయిని మాట్లాడుతూ.. సామాజిక పరివర్తనలో యువత కీలక భూమిక పోషించే సమాజాన్ని స్వామి వివేకానంద ముందే ఊహించారన్నారు. విద్యతో నైతిక విలువలు, మేధస్సు పెంపొందుతుందని నమ్మిన మేధావి వివేకానంద అని కొనియాడారు. స్వామి వివేకానంద జయంతి సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని, వచ్చే ఏడాది కల్లా ఇలాంటి సాంస్కృతిక కార్యక్రమాలు హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో అంగరంగా వైభవంగా నిర్వహించుకోవచ్చన్నారు. అంతకుముందు వివేకానందుడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించిన కలెక్టర్ ప్రావీణ్య.. మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ప్రపంచానికి సాంస్కృతిక వారసత్వాన్ని పరిచయం చేసే వేదిక యువజనోత్సవాలు అన్నారు. జిల్లా యువజన క్రీడల అధికారి గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో జానపద నృత్యం సోలో, గ్రూప్, జానప ద పాటలు సోలో, గ్రూపు, కవిత్వం, (హిందీ, ఇంగ్లీష్) వ్యాచరచన (హిందీ, ఇంగ్లీష్) పెయింటింగ్, ఉపన్యాసం, వకృత్వం (హిందీ, ఇంగ్లీష్) హస్తకళలు, వస్త్రాలు, వ్యవసాయ ఉత్పత్తి అంశాలలో పోటీలు నిర్వహించగా, 250మంది అభ్యర్థులు పాల్గొన్నారన్నారు. ఇక్కడ జిల్లాస్థాయిలో వివిధ అంశాలలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని త్వరలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యువజనోత్సవాల్లో పాల్గొనడానికి ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శనలు

సైన్స్ మేళాలో పలు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వేలేరు మండలంలోని కేజీబీవీ విద్యార్థులు ఏర్పాటు చేసిన వాటర్ పవర్ (నీటితో విద్యుత్ ఉత్పత్తి), అదే విధంగా సంగెం మండలం గవిచర్ల గ్రామంలోని మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న వర్షిక్ తయారు చేసిన హైడ్రో బైస్కిల్ (వాటర్‌తో నడిచే సైకిల్) ప్రత్యేక ఆకర్షణగా నిలిశాయి. వీటిని తిలకించిన కలెక్టర్ విద్యార్థులను అభినందించారు. ముఖ్యంగా వాటర్‌పవర్, హైడ్రో సైకిల్ తయారు చేసిన విద్యార్థులను ప్రశంసించారు. కార్యక్రమంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు మహ్మద్ అజీజ్‌ఖాన్, కార్పొరేటర్లు వేముల శ్రీనివాస్, తోట వెంకటేశ్వర్లు, యువజన కార్యాలయ సూపరింటెండెంట్ వై.విజయశ్రీ, జాతీయ యువజన అవార్డు గ్రహీతలు మండల పరుశరాములు, గంగోజుల నరేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బిన్నీ లక్ష్మణ్, చీకటి ఆనంద్, నలుబోల సతీష్, డీఎస్‌ఏ కోచ్‌లు శ్రీమన్నారాయణ, ఎం.డి. అఫ్జల్, కొత్త ప్రశాంత్, శంకర్, రమేష్, రాయబారపు నవీన్, విష్ణు పి.వెంకటేశ్వర్లు, రాజు తదితరులు పాల్గొన్నారు.


నీటితో నడిచే సైకిల్ తయారు చేసిన విద్యార్థి వర్షిక్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

అత్యుత్సాహంతో ఉద్యోగానికి ఎసరు

- మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్యపై వేటు
- ఓ నేతకు ఎస్కార్ట్ ఇచ్చిన ఫలితం
- ఐజీ ఆఫీసుకు అటాచ్ చేస్తూ ఆర్డర్స్



వరంగల్ క్రైం, సెప్టెంబరు 24: అత్యుత్సాహం ఉద్యోగానికి ఎసరు తెచ్చింది. పోస్టింగ్‌ల కోసం ప్రజాప్రతినిధుల జపం చేస్తున్న క్రమంలో.. పోలీసు అధికారులు ఉద్యోగానికి ఎసరు తెచ్చుకుంటున్నారు. ప్రజాప్రతినిధులకే కాకుండా వారి కుటుంబసభ్యులకు సైతం సేవలు చేస్తూ దొరికిపోతున్నారు. గత నెలలో వరంగల్‌కు చెందిన ఒక ప్రజాప్రతినిధి భర్త జన్మదిన వేడుకల్లో ఏసీపీతో పాటు ఒక సీఐ పాల్గొన్నారు. మరోరోజు సదరు ప్రజాప్రతినిధి పొరుగు నియోజకవర్గంలో ఉన్న దేవాలయానికి వెళ్లిన సమయంలో మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య ఎస్కార్ట్ ఇచ్చారు. ఈ రెండు సంఘటనలు పత్రికల్లో రావడంతో సీపీ అంబర్ కిషోర్ ఝా విచారణకు ఆదేశించారు. డీసీపీ ఆధ్వర్యంలో విచారణ జరగగా, మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్యను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ మంగళవారం సీపీ అంబర్ కిషోర్‌ఝా ఉత్తర్వులు జారీ చేసినట్లు సమాచారం. కాగా, అధికారిక విధుల్లో ఉండి ప్రైవేటు కార్యక్రమాల్లో పాల్గొన్నందుకు మరో ఇద్దరిపై బదిలీ వేటు పడే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అభివృద్ధిలో జాతీయ రహదారుల పాత్ర కీలకం

- మెరుగైన రవాణా వ్యవస్థతోనే అభివృద్ధి
- ఎంపీ కడియం కావ్య


నేషనల్ హైవేస్ అధికారి శివశంకర్‌తో మాట్లాడుతున్న ఎంపీ కావ్య, స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

బాలసముద్రం, సెప్టెంబరు 24: అభివృద్ధిలో జాతీయ రహదారుల పాత్ర కీలకమని, మెరుగైన రవాణా వ్యవస్థ కలిగినప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని వరంగల్ ఎంపీ కడియం కావ్య అన్నారు. మంగళవారం హైదరాబాద్‌లోని నేషనల్ హైవేస్ రీజనల్ కార్యాలయంలో అధికారి శివశంకర్‌ను స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరితో కలిసి రహదారుల గురించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ కావ్య మాట్లాడుతూ.. నేషనల్ హైవే 163 హైదరాబాద్ నుంచి భూపాలపట్నం జాతీయ రహదారి కాగా, స్టేషన్ ఘన్‌పూర్‌లోని నియోజకవర్గంలోని నిడిగొండ, ఛాగల్, స్టేషన్ ఘన్‌పూర్, చిన్న పెండ్యాల, కరుణాపురం వరకు సర్వీస్ రోడ్డును పొడిగించాలన్నారు. ఆయా గ్రామాలకు అనుసంధానంగా సర్వీస్ రోడ్డు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. చిన్న పెండ్యాల గ్రామ పరిధిలో సెంట్రల్ లైటింగ్ లేక ట్రాఫిక్ సమస్యలతో అధికంగా రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం జరుగుతున్నాయన్నారు. సర్వీస్ రోడ్డు పొడిగింపుతో ఆయాగ్రామాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిల నిర్మాణం చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

అలాగే ఎన్‌హెచ్ 563లో భాగంగా వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిని నాలుగు లైన్ల రోడ్డుగా అభివృద్ధి చేయాలని ఎంపీ కావ్య కోరారు. ఎన్‌హెచ్ 563 జగిత్యాల నుంచి కరీంనగర్‌కు, వరంగల్ నుంచి ఖమ్మం వరకు విస్తరించాల్సి ఉందని, అందులో జగిత్యాల నుంచి వరంగల్ వరకు నాలుగు లైన్ల రహదారి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వరంగల్ నుంచి ఖమ్మం వరకు నాలుగు లైన్ల రహదారిగా అభివృద్ధి చేయడానికి అన్ని అర్హతలు ఉన్నాయని, కానీ రెండు లైన్ల రహదారిగానే ఉందని అన్నారు. వరంగల్, ఖమ్మం జాతీయ రహదారిలో ఎక్కువ ట్రాఫిక్ ఉందని, పారిశ్రామిక వాణిజ్య వాహనాల రవాణా పెరిగిపోయిందని వివరించారు. ప్రయాణికుల భద్రత, అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వరంగల్ నుంచి ఖమ్మం వరకు నాలుగు లైన్ల రహదారిని అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఎన్‌హెచ్ 353లో సీఆర్ నగర్ భూపాలపల్లి నుంచి ఘన్‌పూర్ వరకు బైపాస్ రోడ్డు నిర్మాణం చేపట్టాలన్నారు.

కాగా, ఎంపీ కావ్య చెప్పిన విషయాలపై నేషనల్ హైవే రీజనల్ అధికారి శివశంకర్ మాట్లాడుతూ.. నిడిగొండ, ఛాగల్, స్టేషన్ ఘన్‌పూర్, చిన్నపెండ్యాల కరుణాపురంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జి, సెంట్రల్ లైటింగ్‌ను వెంటనే ఏర్పాటు చేస్తామని, దీనికి సంబంధించి వరంగల్ ప్రాజెక్టు డైరెక్టర్ స్థల పరిశీలన చేసి వెంటనే పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు.

భూపాలపల్లి బైపాస్ రోడ్డు రూ.660కోట్లతో మంజూరై టెండర్ దశలో ఉందని, వీలైనంత త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ప్రాజెక్టు డైరెక్టర్ దుర్గాప్రసాద్, ఎన్‌హెచ్ఏఐ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదును కట్టుదిట్టంగా నిర్వహించాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి



రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డితో జరిగిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 24: జిల్లాల్లో ఓటరు నమోదు కార్యక్రమం కట్టుదిట్టంగా నిర్వహించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి జిల్లాల కలెక్టర్‌లకు సూచించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్, ఈఆర్‌వో నెట్ 2.0పై మంగళవారం జిల్లాల కలెక్టర్‌లతో ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. వారం రోజులుగా నూతన ఓటరు నమోదుపై చేపట్టిన ఇంటింటి సర్వే పని తీరు చాలా మెరుగుపడిందని, ఇప్పటివరకు 90శాతం పైగా ఇంటింటి సర్వే పూర్తయిందన్నారు. సెప్టెంబర్ 28 నాటికి 100శాతం ప్రతీ పోలింగ్ కేంద్రం పరిధిలో బూత్‌స్థాయి అధికారుల ద్వారా ఇంటింటి సర్వే పూర్తి చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఓటరు నమోదుకు సంబంధించి ఫారం 6, ఫారం 7, ఫారం 8 దరఖాస్తులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సెప్టెంబర్ నెలాఖరువరకు పెండింగ్ దరఖాస్తులు పూర్తి చేయాలని, ఇతర ప్రాంతాలకు తరలివెళ్లిన వారి వివరాలు నోటీసు జారీ చేసి నిర్దేశిత ప్రొసీజర్ ఫాలో అయిన తర్వాత తొలగించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో హనుమకొండ కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అన్ని మండలాలకు నూతన ఎంఈవోలు

- సీనియర్ హెడ్మాస్టర్లకు అదనపు బాధ్యతలు

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24: జిల్లాలోని 14 మండలాలకు ఎంఈవోలను నియమిస్తూ ప్రభుత్వం మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేసింది. కొన్నేళ్లుగా నాలుగు మండలాలకు కలిపి ఒక్కరికే ఎంఈవోగా బాధ్యతలు చేపట్టడంతో పాఠశాలల పర్యవేక్షణ కొరవడింది. పనిభారంతో సదరు ఎంఈవోలు సైతం ఇబ్బందులకు గురైన సంఘటనలున్నాయి. వాటిన్నంటినీ దృష్టిలోకి తీసుకున్న ప్రభుత్వం.. ప్రతీ మండలానికి ఒక ఎంఈవోను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయా మండలాల్లోని సీనియర్ ప్రధానోపాధ్యాయులకు ఆయా మండలాల ఎంఈవోలుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని భీమదేవరపల్లి మండలానికి వెంకటేశ్వర్‌రావు, కమలాపూర్‌కు ఎర్ర రాంకిషన్‌రాజు, పరకాలకు ఎస్.రమాదేవి, ఐనవోలుకు పి.ఆనందం, హనుమకొండకు కుర్ర రమేష్ బాబు, నడికూడకు కున్‌సోత్ హనుమంతరావు, ధర్మసాగర్‌కు బి.రాంధన్, వేలేరుకు ఎం.చంద్ర మౌళి, కాజీపేటకు బి.మనోజ్, ఎల్కతుర్తికి సీహెచ్.సత్యనారాయణ, ఆత్మకూరుకు ఎన్.విజయ్‌కుమార్, దామెరకు బానోత్ జుమ్ము, శాయంపేటకు జి.భిక్షపతిని నియమించారు.

నిజాయితీగా ప్రజలకు సేవలందించాలి


ట్రెయినీ ఎస్సైలతో సీపీ అంబర్ కిషోర్ ఝా

వరంగల్ క్రైం, సెప్టెంబరు 24: సమస్యలతో స్టేషన్‌కు వచ్చే ప్రజలకు నిజాయితీగా సేవలందించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు. మంగళవారం ట్రెయినీ ఎస్సైలు సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్సైలను సీపీ అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు ప్రత్యక్షంగా సేవలందించే అవకాశం కేవలం పోలీసులకు మాత్రమే ఉంటుందన్నారు. పోలీసు ఉద్యోగాల్లో చేరినందుకు గర్వపడాలన్నారు. ప్రజలకు సేవలందిస్తూ పోలీస్‌శాఖకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని కమిషనర్ అంబర్ కిషోర్ ఝా సూచించారు.

ఏచూరి మరణం అన్ని వర్గాలకు తీరనిలోటు

ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ● కేయూలో సీతారాం సంస్మరణ సభ ● హాజరైన ప్రజాసంఘాల నేతలు, విద్యార్థులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సీతారాం ఏచూరి మరణం ప్రజాస్వామ్య వాదులకు, అన్ని వర్గాల ప్రజలందరికీ తీరనిలోటని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం కేయూక్యాంపస్‌లోని కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం సెమినార్‌హాల్‌లో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా కమిటీ నేతృత్వంలో సీతారాం ఏచూరి సంస్మరణ సభ జరిగింది. ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షకార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ అధ్యక్షతన జరిగిన సభలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.



సీతారాం ఏచూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నర్సిరెడ్డి, పుల్లా శ్రీనివాస్ తదితరులు

సీతారాం ఏచూరి గొప్ప ప్రజాస్వామ్యవాదని అని, అయన ఆశయాల సాధనకు ముందుకురావాలని పిలుపునిచ్చారు. దేశంలో ఆర్థిక, రాజకీయ సంక్షోభాలకు సోషలిజమే శాస్త్రీయ పరిష్కారం చూపుతుందని చెప్పారు. కమ్యూనిస్టులు కార్మిక, కర్షక వర్గాలకు ప్రాతినిధ్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. ఏచూరి మరణం దేశ ప్రజానీకానికి, కార్మిక, కర్షక వర్గాలకు తీరనిలోటని చెప్పారు. 2020 జాతీయ నూతన విద్యావిధానాన్ని రద్దు చేయాలని అన్నారు. దేశంలో విద్యతోనే అందరికీ ప్రజాస్వామ్య ఫలితాలను అందుతాయని చెప్పారు. ఆల్ ఇండియా వర్సిటీల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ.. అపర మేధావిగా, కమ్యూనిస్టు ఉద్యమ సారథిగా నిలిచిన సీతారాం ఏచూరి మరణం బాధాకరమన్నారు. సీపీఐ(ఎం) హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బొట్ల చక్రపాణి మాట్లాడుతూ.. భవిష్యత్ అంతా కమ్యూనిస్టులదేనని చెప్పారు. వర్సిటీ కాంట్రాక్టు అధ్యాపకుల సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ అంజన్‌రావు మాట్లాడుతూ.. యువతకు, కమ్యూనిస్టులకు సీతారాం ఏచూరి ఐకాన్‌గా నిలిచారని అన్నారు. సీఐటీయూ తెలంగాణ వర్సిటీల అధ్యక్షుడు మెట్టు రవి మాట్లాడుతూ.. కార్మిక వర్గాల స్ఫూర్తి ప్రదాత ఏచూరి అన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు స్టాలిన్, మంద శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఏచూరి ఆశయాల సాధనకు ఎస్ఎఫ్ఐ ముందుండి పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థి ఉద్యమాలకు ఏచూరి ఆద్యుడని చెప్పా రు. జేఎన్‌యూ కేంద్రంగా ఆయన చేసిన పోరాటం, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీని ఎదురించిన ధీరత్వాన్ని కొనియాడారు. సభా ప్రారంభంలో సీతారాం ఏచూరి చిత్రపటానికి అతిథులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో సీఐటీయూ వర్సిటీ నేత కచ్చకాయల చిరంజీవి, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బొచ్చు కల్యాణ్, అనూష, సహాయ కార్యదర్శులు జస్వంత్, పరిమళ, కేయూ అధ్యక్షుడు సాయి కిరణ్, నాయకులు కుమార్, సాయి, రాహుల్, కావ్య, ప్రవళిక, అనూష, ప్రదీప్, శిరిష, సందీప్, రాజ్‌కుమార్, వివిధ విద్యార్థి, ప్రజా సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఇంతకీ ఆయనెవరు?

సాధారణ వ్యక్తికి బల్దియా సమావేశం వద్ద గౌరవమర్యాదలు

చర్చనీయాంశమైన పోలీసు అధికారి తీరు.. సోషల్ మీడియాలో వైరల్

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 24: నగరంలో వివాదాస్పదుడిగా ముద్రపడిన ఓ సాధారణ వ్యక్తికి బల్దియా సమావేశం సందర్భంగా ఇచ్చిన గౌరవ మర్యాదలు చూసి ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారు. అసలు ఆయన ప్రజాప్రతినిధి కానేకాదు. ఆయనకూ మంగళవారం జరిగిన బల్దియా కౌన్సిల్ సమావేశానికి ఎలాంటి సంబంధం లేదు. ఆహ్వానం లేకపోయినా తన ఇద్దరు గన్‌మెన్‌లతో బల్దియా కార్యాలయానికి వచ్చాడు. ఇంకేముంది.. అక్కడి మెయిన్ గేట్ నుంచి సమావేశ మందిరం వరకు పోలీసులు కూడా గౌరవ మర్యాదలిస్తూ తీసుకెళ్లారు. ఓ పోలీసు అధికారి అయితే.. సదరు వ్యక్తి వస్తున్నాడన్న విషయం తెలుసుకుని సిబ్బందితో కలిసి ప్రధాన ద్వారం వద్దకు ఎదురేగి మరీ స్వాగతం పలికారు. తానే ముందుండి మరీ ఆయన్ను సమావేశ మందిరంలోకి తీసుకెళ్లారు. అంతేకాదు.. ఆయనే దగ్గరుండి సదరు వ్యక్తికి కమిషనర్ కార్యాలయం పక్కనే ఉన్న గదిలో విశ్రాంతి కల్పించారు. కౌన్సిల్ కార్యాలయానికి వంద మీటర్ల దూరంలోనే సాధారణ ప్రజలు, మహిళా కార్పొరేటర్ల భర్తలు, వారి సహచరులను కూడా అనుమతించని పోలీసులు ఆ వ్యక్తికి రాచమర్యాదలు చేసి మరీ అనుమతించడం, ఆయనతో పాటు 20మంది అపరిచితులను కూడా రానివ్వడం చర్చనీయాంశమైంది. ఓ సాధారణ వ్యక్తికి ఇలా ప్రాధాన్యం ఇవ్వడం, ఓ పోలీసుఅధికారి ఆయనకు ఇచ్చిన గౌరవమర్యాదల గురించి సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. కొంత కాలంగా సదరు పోలీసు అధికారి ఆ సాధారణ వ్యక్తి గురించి మీడియా, ప్రజల సమక్షంలోనే పొగడ్తలతో ముంచెత్తడం వివాదాస్పదంగా మారింది. రాజకీయ నాయకులకు కొమ్ముకాస్తుండడం తెలిసి పోలీసు ఉన్నతాధికారులు సైతం ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదన్న చర్చ జరుగుతోంది. దీనిపై సీపీ ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాల్సిందే మరీ.



ఎమ్మెల్సీ కోదండరామ్‌ను పూలమాలతో సన్మానిస్తున్న టీజీవోలు

ఎమ్మెల్సీ కోదండరామ్‌కు టీజీవోల సన్మానం

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబర్ 24: హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞానభవన్‌లో మంగళవారం తెలంగాణ ఉద్యోగ, గెజిటెడ్ ఆఫీసర్స్ టీచర్స్ వర్కర్స్ పెన్షనర్స్ జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ కోదండరామ్‌ను సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఉమ్మడి వరంగల్ జిల్లా తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ (టీజీవో) అసోసియేషన్ నాయకులు పూలమాలతో సన్మానించారు. ఎమ్మెల్సీని సన్మానించిన వారిలో టీజీవోస్ ఉమ్మడి వరంగల్ జిల్లా కోఆర్డినేటర్ ఎన్నమనేని జగన్‌మోహన్‌రావు, జనగామ జిల్లా అధ్యక్షుడు అమ్జద్ అలీ, హనుమకొండ జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రవీణ్‌కుమార్, నాయకులు రాజేష్ కుమార్, ఆస్నాల శ్రీనివాస్, నాగ నారాయణ, కృష్ణార్జునరావు ఉన్నారు.

నేడు వర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల అవిర్భావ వేడుకలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: కాకతీయ యూనివర్సిటీ మహిళ ఇంజనీరింగ్ కళాశాల 11వ అవిర్భావ దినోత్సవ వేడుకలను వర్సిటీ సెనెట్ హాల్‌లో నిర్వహిస్తామని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భిక్షాలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 25న బుధవారం 9.30 గంటలకు ప్రారంభమయ్యే వేడుకలకు కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఛైర్‌పర్సన్ డాక్టర్ ఎస్.నాగవాణి, గౌరవ అతిథులుగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈసీ మెంబర్ బి.సురేశ్‌లాల్, వర్సిటీ న్యాయ కళాశాల ప్రిన్సిపాల్, ఈసీ మెంబర్ డాక్టర్ నిమ్మ. సుదర్శన్, ఈసీ మెంబర్ డాక్టర్ బి.రమారెడ్డి, ఈసీ మెంబర్ డాక్టర్ చిర్ర రాజు హాజరుకానున్నట్లు తెలిపారు. సభలో కన్వీనర్‌గా ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్‌గా బి.కిరణ్‌కుమార్ వ్యవహరిస్తారు.

హెడ్‌కానిస్టేబుల్ జయరాజ్‌కు స్ఫూర్తి సేవా రత్న జాతీయ అవార్డు



మడికొండ, సెప్టెంబరు 24: మడికొండ పోలీస్‌స్టేషన్ హెడ్‌కానిస్టేబుల్ గుండబత్తిన జయరాజ్‌ను భారతీయ స్ఫూర్తి సేవారత్న జాతీయ అవార్డు వరించింది. బాలల రక్షణ, ప్రజారోగ్యం, మానవహక్కుల వంటి అనేక సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా జయరాజ్ సేవలను గుర్తించిన స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఎన్‌జీవో వారు అవార్డును ప్రకటించారు. ఈ సందర్భంగా జయరాజ్‌ను పలువురు అభినందించారు. ఈనెల 29న హైదరాబాద్ కింగ్ కోఠిలోని సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో ప్రముఖుల చేతుల మీదుగా అవార్డును అందుకోనున్నట్లు స్పష్టం చేశారు.

పిడుగుపడి వృదుడి మృతి

కొత్తగూడ, సెప్టెంబర్ 24 : కొత్తగూడ మండలం బత్తులపల్లి శివారు మంగళవారం పిడుగుపడి దుర్గం లక్ష్మయ్య (65) మృతి చెందాడు. కార్లాయి, బత్తులపల్లి గ్రామాల మధ్య మధ్యాహ్నం అకస్మాత్తుగా ఉరుములు, మెరుపులతో భారీ వర్షం కురిసింది. పొలం వద్దకు కాపలాకు వెళ్లిన లక్ష్మయ్యపై పిడుగు పడడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడికి భార్య ఎల్లమ్మ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.



దుర్గం లక్ష్మయ్య(ఫైల్)

జనం నాడి.. డాక్టర్ ఆమెడ..

● ప్రజావైద్యుడిగా చిరస్మరణీయుడు ● మానవతకు నిలువెత్తు నిదర్శనం ● నేడు డాక్టర్ ఆమెడ నారాయణ వర్ధంతి

హనుమకొండ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ జిల్లా గీసుగొండ మండలం మొగిలిచెర్లలో 26 ఏళ్ల కిందట జరిగిన ఓ అమానవీయ సంఘటన తాలూకు గాయం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల గుండెల్లో ఇప్పటికీ పచ్చిగానే ఉంది. సరిగ్గా ఇదే రోజు (1996 సెప్టెంబర్ 25)న ప్రజా వైద్యుడు డాక్టర్ ఆమెడ నారాయణను కొందరు అంగతుకులు నిర్దాక్షిణ్యంగా కాల్చి చంపిన సంఘటన ప్రజల జ్ఞాపకాల్లో సుడులు తిరుగుతూనే ఉంది. మొగిలిచెర్ల పేరు వినగానే నాటి నెత్తుటి దృశ్యం కళ్లకు కట్టినట్టు కనిపిస్తూనే ఉంటుంది. డాక్టర్ నారాయణ మొగిలిచెర్ల ప్రజల మనసుల్లో ఓ మనసున్న డాక్టర్‌గా, ప్రజాసేవకుడుగా ఇప్పటికీ నిలిచే ఉన్నాడనడానికి అక్కడ ఏ ఇంటి తలుపుతట్టినా వినిపిస్తుంది. ఆమెడ 28వ వర్ధంతి సందర్భంగా గత జ్ఞాపకాలు.

పేదరికాన్ని జయించి..

ఆమెడ నారాయణ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన వారు. 1957లో ప్రస్తుత మహబూబాబాద్ జిల్లా కురవి గ్రామంలో తల్లిదండ్రులు మహాలక్ష్మి, ముత్తయ్యలకు జన్మించారు. ఆరుగురు సంతానంలో ఆయన రెండోవారు. నారయణ పాఠశాల విద్యాభ్యాసం కురవిలోనే సాగింది. అనంతరం మహబూబాబాద్ జూనియర్ కాలేజీలో ఇంటర్ విద్య పూర్తి చేశాడు. ఆ తర్వాత హనుమకొండ సుబేదారిలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో డిగ్రీ చదువుతుండగానే మెడికల్ ఎంట్రెన్స్‌రాసి కాకతీయ వైద్యకళాశాలలో సీటు పొందాడు.

కార్యక్షేత్రం మొగిలిచెర్ల

అన్న నాగయ్య వామపక్ష భావజాలం నారాయణను ప్రభావితం చేసింది. విద్యార్థిగా ఉన్నప్పుడే ఎస్ఎఫ్ఐ కార్యకలాపాల్లో చురుకుగా పాల్గొన్నారు. ఆనాడు వరంగల్ విద్యార్థి యువజన, మేధావి వర్గాల్లో ప్రభావం చూపిన విప్లవోద్యమం ఆయనను కదలించింది. ఇదే అప్పటి సుప్రసిద్ధ ప్రజాహక్కుల నేత, పిల్లల డాక్టర్ రామనాథంకు దగ్గర చేసింది. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పం,



నిబద్ధతను ఆయన నుంచే అందిపుచ్చుకున్నారు. ఎంబీబీఎస్ పూర్తిగానే డాక్టర్ ఆమెడ వైద్యాన్ని ఒక వృత్తిగా కాక సేవగా ఎంచుకున్నారు. అందుకు కార్యక్షేత్రంగా ప్రస్తుతం వరంగల్ జిల్లాలోని గీసుగొండ మండలం మొగిలిచెర్ల గ్రామాన్ని ఎంచుకున్నారు. ప్రజల కోసం పరితపించే పిల్లల వైద్యుడు రామనాథం చేతుల మీదుగా తన ప్రజావైద్యశాలను ప్రారంభించారు.

అప్పుడె..

అనతికాలంలోనే మొగిలిచెర్ల, దాని చుట్టు పక్కల 40 గామాల్లోకు దేవుడుగా మారారు. ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు అవిశ్రాంతంగా వైద్య సేవలను అందించారు. వృత్తిధర్మం పట్ల ఎనలేని నిబద్ధత కలిగిన డాక్టర్ నారాయణ.. ఒక విశిష్టమైన దృక్పథాన్ని కలిగి ఉన్నప్పటికీ తరతమ భేదం లేకుండా అన్నివర్గాల ప్రజలకు సేవలు అందించారు. నక్సల్స్ మొదలు పోలీసుల వరకు అందరూ ఆయన వద్ద వైద్య సేవలు పొందినవారే.

రోగుల సేవలో..

వృత్తిధర్మాన్ని చూడలేని రాజ్యానికి ఆయన శతృవయ్యారు. అనేక సార్లు బెదిరింపులు ఎదుర్కొన్నాడు. అయినా ఏనాడు అదరలేదు. బెదరలేదు. ప్రజలకు అందుబాటులో ఉండాలని మొగిలిచెర్లలోనే భార్యాబిడ్డలతో మకాం పెట్టి, అనివార్య పరిస్థితుల్లో 1995లో తన నివాసాన్ని హనుమకొండలోని తన సొంత ఇంటికి మార్చుకున్నాడు. నివాసమైతే మారింది కానీ, ఆయన మనసెప్పుడు మొగిలిచెర్లలోని తన ప్రజావైద్యశాలకు వచ్చే రోగులమీదు ఉండేది. ప్రతీ రోజు ఉదయం 6 గంటలకే బయలు దేరి రాత్రి 9 గంటల వరకు రోగులకు సేవలు అందించేవారు. ప్రజలకోసం పనిచేసే వాళ్లంటే రాజ్యవ్యవస్థకు కంటగింపు. ప్రయాణంలో కూడా మార్గమధ్యలో రోగులు కనబడితే ఆగి వారికి మందులిచ్చే స్వభావం నారాయణది. ఆయనను చంపాలని పథకం వేసుకున్నవారు దీనిని అవకాశంగా తీసుకున్నారు.

ఆ రోజు..

1996 సెప్టెంబరు 25-సరిగ్గా అదే రోజు డాక్టర్ నారాయణ రోజువారిలాగానే ఉదయం స్కూటర్‌పై మొగిలిచెర్లకు వెళుతున్నాడు. మార్గమధ్యలో ఏనుమాముల మార్కెట్ వద్ద రోడ్డు పక్కన కాపు కాసిన అగంతుకుల్లో ఒకరు ఎదురువచ్చాడు. కడుపునొప్పితో విలవిలలాడుతున్నట్టు నటించాడు. నిజమేనని నమ్మిన డాక్టర్ నారాయణ.. ఆగి పరీక్షిస్తుండగా వెనుక నుంచి ఆయనపై తూటాల వర్షం కురిసింది. ఆయన అక్కడికక్కడే కుప్పకూలాడు. నారాయణ హత్యావార్త దావానంలా వ్యాపించింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. మొగిలిచెర్ల శోకసముద్రమైంది. డాక్టర్ నారాయణ హత్యావార్త విన్న ప్రజలు, ముఖ్యంగా మహిళలు కనబరిచిన నిరసన అపూర్వం. కన్నీరుమున్నీరుగా విలపించిన ఆ జన సమూహమే డాక్టర్ ఆమెడకున్న ఆదరణకు సాక్ష్యం. భౌతికంగా డాక్టర్ నారాయణను లేకుండా చేసినా 30 ఊర్ల ప్రజల హృదయాల్లో ఇప్పటికీ నిలిచే ఉన్నారు. డాక్టర్ నారాయణ ఆదర్శాన్ని బతికించే కృషిలో ఆయనను సజీవంగా నిలుపుకోవడం కంటే మించిన నివాళి మరొకటి ఉండదు. డాక్టర్ నారాయణ అమరుడు. ఆయన ఆశయాలు నిరంతరం స్ఫూర్తిదాయం.

దామగుండం అడవిని కాపాడుకుందాం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24: దామగుండం అడవిని కాపాడుకొని ప్రకృతి వైపరిత్యాలు జరుగకుండా రాష్ట్రాన్ని కాపాడుకుందామని డీఎస్‌ఏ రాష్ట్ర కన్వీనర్ శ్రవణ్ పిలుపునిచ్చారు. దేశభద్రత పేరుతో వికారాబాద్ జిల్లాలోని దామగుండం రిజర్వ్ అడవుల్లో ఫ్రీక్వెన్సీ రాడార్ స్టేషన్ ఏర్పాటును నిరసిస్తూ డీఎస్‌ఏ ఆధ్వర్యంలో హనుమకొండలోని అశోకా జంక్షన్‌లో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా శ్రవణ్ మట్లాడుతూ.. మూడువేల ఎకరాల్లో విస్తరించి దామగూడెం అడవుల్లో వణ్యప్రాణులు, ఔషద మొక్కలతో పాటు లక్షల వృక్షాలు పర్యావరణ హితంగా ఉన్నాయన్నారు. ఇంత పెద్ద రిజర్వ్ ఫారెస్టును తొలగించి రాడార్ స్టేషన్‌ను ఏర్పాటు చేయడం సరికాదన్నారు. రాడార్ స్టేషన్ వల్ల విడుదలయ్యే రేడియేషన్ ద్వారా సమీప గ్రామాల ప్రజలు రోగాల బారిన పడే ప్రమాదముందన్నారు. ప్రభుత్వం వెంటనే రాడార్ స్టేషన్ ఏర్పాటును ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం కోకన్వీనర్ గణేష్ నాయకులు శివ, శరత్, అనిల్, అభినయ్, శిరీష, చందన, కళ్యాణి, జయరాం, అభిషేక్ తదితరులు పాల్గొన్నారు.



అశోకా జంక్షన్‌లో ఆందోళన చేస్తున్న డీఎస్‌ఏ నాయకులు

ఐటీఐల్లో ఐదో విడత ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐల్లో ఐదోవిడత ప్రవేశాలకోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా వరంగల్, హనుమకొండ ప్రభుత్వ ఐటీఐల ప్రిన్సిపాళ్లు ఎం.చందర్, జి.సక్రు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సంబంధిత వెబ్ పోర్టల్‌లో ఈ నెల 28 వరకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. మరిన్ని వివరాలకు ప్రభుత్వ ఐటీఐల్లో సంప్రదించాలని వారు కోరారు.

వయోవృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించుకోవాలి

సుబేదారి, సెప్టెంబరు 24: అక్టోబరు 1న అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహించుకోవాలని మహిళా, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి బి.రాజమణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 25 నుంచి అక్టోబరు 1 వరకు వయోవృద్ధుల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 26న వృద్ధాశ్రమాల్లోని వయోవృద్ధులకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలు, 27న వాకథాన్ ర్యాలీ, 28న తల్లిదండ్రుల పోషణ, సంక్షేమ చట్టం- 2007, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన సదస్సు, 29న పంచాయతీ సెక్రటరీలకు తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ చట్టం- 2007 అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఎల్డర్ లైన్ టోల్ ఫ్రీ నంబర్ 14567పై అవగాహన సదస్సు, ఈనెల 30న అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో గ్రాండ్ పేరెంట్స్ డే నిర్వహణ చేపట్టనున్నట్లు రాజమణి పేర్కొన్నారు. అక్టోబరు 1న జిల్లా స్థాయిలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నేటి నుంచి జంతుశాస్త్రంలో జాతీయ సదస్సు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: సెప్టెంబరు 25, 26 తేదీల్లో రెండు రోజుల పాటు 'రీసెంట్ ట్రెండ్స్ ఇన్ ఎనిమల్ బయోటెక్నాలజీ 'అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు విభాగాధిపతి ప్రొఫెసర్ జి.షమిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా కేయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ, హైదరాబాద్ స్కూల్ ఆఫ్ మెడికల్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెగీతా వేముగంటిలు హాజరై కీలక ప్రసంగం చేస్తారని పేర్కొన్నారు. గౌరవ అతిథిగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి పాల్గొంటారని తెలిపారు. అందరూ హాజరై సదస్సును విజయవంతం చేయాలని ఆమె కోరారు.

అజర ఆస్పత్రిలో కార్డియాలజీ దినోత్సవం

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 24: హనుమకొండలోని ములుగురోడ్‌లోని అజర ఆస్పత్రిలో ప్రపంచ కార్డియాలజీ దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ఈ నెల 29 వరకు ప్రత్యేక ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రివర్గాలు వెల్లడించాయి. హృదయ సంబంధిత ఆరోగ్యాన్ని పెంపొందించేందుకు అజర హాస్పిటల్స్ ఈ కార్యక్రమం ద్వారా ప్రజలకు పరీక్షలను ఉచితంగా అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమాజ పురోభివృద్ధిలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్ల కృషి గొప్పది

ఎన్‌ఎస్‌ఎస్ అవిర్భావ వేడుకల్లో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మల్లారెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ మల్లారెడ్డి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: సమాజ పురోభివృద్ధిలో జాతీయ సేవ పథకం (ఎన్‌ఎస్‌ఎస్) వలంటీర్ల కృషి గొప్పదని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ఉద్బోధించారు. మంగళవారం కేయూ సెనెట్ హాల్‌లో కేయూ ఎన్‌ఎస్‌ఎస్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ అధ్యక్షత జరిగిన ఎన్‌ఎస్‌ఎస్ అవిర్భావ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ వల్లారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వలంటీర్ల స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని, స్వచ్ఛత రోజువారి దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. పనిని దైవంగా భావించాలన్నారు. చిన్న పనలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వలంటీర్ల కరిక్యూలమ్‌లో సేవ ప్రధాన భాగమని చెప్పారు. ఏడాదిలో ఒక్కో వలంటీర్ 120గంటల పాటు సమాజ సేవ కార్యక్రమాల్లో పాలుపంచుకోవాలని గుర్తు చేశారు. సమాజ రుగ్మతలను రూపుమాపాలని చెప్పారు. సేవలో భాగమే స్వచ్ఛత అని చెప్పారు. ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లతోనే సమాజంలో మంచి మార్పులు వస్తాయని పేర్కొన్నారు. ట్రాఫిక్ నిర్వహణ, బాలికల సంరక్షణ, నిఘా కెమెరాలు, స్వచ్ఛ భారత్‌పై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వర్సిటీ క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్ మాట్లాడుతూ.. యువత స్వామి వివేకానంద, మదర్ థెరిస్సా లాంటి మహానుభావులను రోల్ మోడల్‌గా తీసుకుని జీవితంలో ఎదగాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులను గౌరవించుకోవాలని కోరారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎన్.ప్రసాద్ మాట్లాడుతూ.. మంచి సమాజ నిర్మాణంలో వలంటీర్లు నిజమైన సైన్యమని చెప్పారు. కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.అమరవేణి, ఫిజికల్ ఎడ్యుకేషన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏటీబీటీ ప్రసాద్, వివిధ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు, వలంటీర్లు పాల్గొన్నారు.

హోరెత్తించిన సాంస్కృతిక ప్రదర్శనలు

ఎన్‌ఎస్‌ఎస్ అవిర్భావ వేడుకలను పురస్కరించుకుని ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు మంగళవారం కేయూ సెనెట్‌హాల్‌లో చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, నృత్యాలు హోరెత్తించాయి. తెలంగాణ భాష, యాసలతోపాటు గిరిజన, కోయ సంస్కృతిని ప్రతిబింబించే నృత్య ప్రదర్శనలు చేశారు. తెలంగాణ బోనాలు, ఆదివాసీ నృత్యాలు, మిమిక్రీలు అంశాల్లో విద్యార్థులు పోటాపోటీగా ప్రదర్శనలు, నృత్యాలు చేశారు. యూనివర్సిటీ క్యాంపస్, వరంగల్ తూర్పు టీటీడబ్ల్యూఆర్‌డీసీ, ఆర్ట్స్ కళాశాల డిగ్రీ కళాశాల వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాళేశ్వరాలయ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళిక

● అధికారులు మాస్టర్ ప్లాన్ రూపొందించాలి ● సౌకర్యాలు మెరుగుపర్చాలి ● రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

మహదేవపూర్, సెప్టెంబరు 24: కాళేశ్వరాలయాన్ని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం సంకల్పించిందని, ఇందులో భాగంగా అధికారులు మాస్టర్ ప్లాన్‌ను రూపొంచాలని రాష్ట్ర దేవాదాలయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఆదేశించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వర ముక్తీశ్వరాలయాన్ని ఆమె మంగళవారం సందర్శించారు. కాళేశ్వర ముక్తీశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన ఆమెకు అర్చకులు ఆలయ సంప్రదాయ స్వాగతం, ఆశీర్వచనం పలికారు. అనంతరం ఆలయ కార్యనిర్వాహణాధికారి కార్యాలయంలో దేవాదాయ, పర్యాటకశాఖల అధికారులతో సమావేశమమైన శైలజా రామయ్యర్ దేవాలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్, సరస్వతీ పుష్కరాల నిర్వహణ, పర్యాటకంగా కాళేశ్వరాన్ని అభివృద్ధి చేయడం తదితర అంశాలపై సమీక్షించారు. తెలంగాణలోని శైవక్షేత్రాల్లో కాళేశ్వరం దేవాలయం ప్రధానమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయనుందని తెలిపారు. ఆలయ ప్రాంగణాన్ని విస్తరించడం, పలు పునర్నిర్మాణాలు, ఆధునికీకరణ, యాత్రికులకు సౌకర్యాల కల్పన, వసతి, భోజన శాల, పార్కింగ్ స్థలాలు, సురక్షిత తాగునీటి సౌకర్యం తదితర అంశాలపై అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. దేవాలయ ప్రధాన ద్వారాన్ని శిల్పకలతో అలంకరించడం, గోదావరి ఘాట్ అభివృద్ధి, నది తీరాన్ని శుభ్రతతో, అందంగా అభివృద్ధి చేయడం, దేవాలయం చుట్టూ పర్యాటక మార్గాల అభివృద్ధి, స్థానిక సంస్కృతిక ప్రదర్శనలు, మ్యూజియం తదితర పనులు చేపట్టనున్నట్టు తెలిపారు. ఆలయ పరిసరాల్లో సీసీ కెమెరాలు బిగించాలని, పోలీసు, రెన్యూ, పంచాయతీరాజ్, దేవాదాయ, పర్యాటక శాఖ అధికారులతో టాస్క్ ఫోర్స్ టీం ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దేవాలయ అభివృద్ధికి ప్రత్యేకంగా మంజూరైన నిధులతో చేపట్టిన పనులు పూర్తిచేయాలని కలెక్టర్ రాహుల్ శర్మను ఆదేశించారు. కాళేశ్వరం దేవాలయాన్ని అభివృద్ధి చేయడం ద్వారా భక్తులు పెద్ద ఎత్తున వస్తారని, తద్వారా పుణ్యక్షేత్రం ఎంతో అభివృద్ధి చెందుతుందని అన్నారు. అస్థికలు గోదావరిలో కలిపేందుకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు దేవాలయ ఆధీనంలో ఉన్న రూములను ఎందుకు కేటాయించడం లేదని దేవస్థానం అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమాచార పౌర సంబంధాల శాఖ, దేవాదాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హనుమంతరావు మాట్లాడుతూ.. భక్తులకు సౌకర్యాల కల్పనలో రాజీ పడొద్దన్నారు. కాళేశ్వరం వచ్చే భక్తులు మహిళలు, పురుషులు బట్టలు మార్చుకునేందుకు గదులు ఏర్పాటు చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న 100 గదులను వెంటనే పూర్తి చేయాలన్నారు. మోడల్ మరుగుదొడ్ల నిర్మాణాలు చేపట్టాలన్నారు. 2025లో జరిగే సరస్వతి పుష్కరాలనిర్వహణకు ఘాట్ సిద్ధం చేయాలని ఆదేశించారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ రూ.19.39 కోట్ల ఎస్డీఎఫ్ నిధుల నుంచి రూ. 12.07 కోట్ల పనులు ఇప్పటికే పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పనులు భూ సమస్య వల్ల ఆగిపోయాయని తెలిపారు. ఈ సమావేశంలో కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, పర్యాటక శాఖ జనరల్ మేనేజర్ ఉపేందర్‌రెడ్డి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, దేవాదాయ శాఖ ఉప కమిషనర్ శ్రీనాథరావు తదితరులు పాల్గొన్నారు.



కాళేశ్వరం ఆలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, కలెక్టర్ రాహుల్‌శర్మ

గంగ పుత్రులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

బాలసముద్రం, సెప్టెంబరు 24: గంగ పుత్రులు (బెస్త) అన్నిరంగాల్లో అభివృద్ధి చెందాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ పిలుపునిచ్చారు. మంగళవారం హనుమకొండలోని తారా గార్డెన్‌లో 14వ గంగపుత్ర (బెస్త) నిర్మాణ సంస్థ ఎంఏసీ హౌసింగ్ సొసైటీ జనరల్ బాడీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎమ్మెల్యే ముఠా గోపాల్ హాజరై మాట్లాడారు. గంగ పుత్ర కుటుంబ సభ్యుల భవిష్యత్ కోసం సంఘం అండగా ఉంటుందన్నారు. గంగపుత్ర జాతి అభ్యున్నతి కోసం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. సంఘంలో అందరు రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేసుకున్నట్లు తెలిపారు. ఏ సంఘానికి కూడా లేని 120 ఎకరాల లే అవుట్ గంగపుత్ర నిర్మాణ సంస్థ ఏర్పాటు చేసిందన్నారు. ఈ సమావేశంలో నలుగురు కొత్త సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఎన్నికల అధికారిగా ఇమ్మడి పుల్లయ్య వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డోలి రాజలింగం, దీటి మల్లయ్య, పారిపెల్లి రాజేందర్, ఎలుగు వెంకటేశ్వర్లు, వీరస్వామి, రాజేష్‌ఖన్నా, శ్రీనివాస్, బయ్య అనిల్, రామ్మూర్తి, జీ సుగుణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్

నకిలీ కరెంటు సామగ్రి విక్రయం

రూ.28లక్షల నకిలీ వైర్లు, స్విచ్‌లు పట్టివేత

వరంగల్ క్రైం, సెప్టెంబరు 24: అక్రమ దందాలకు అడ్డాగా వరంగల్ నగరం మారుతోంది. గంజాయి, మట్కాలాంటి దందాలే కాకుండా కరెంటు పరికరాలు సైతం నకిలీవి విక్రయిస్తుండటం విశేషం. భవన నిర్మాణ రంగంలో వాడే ఎలక్ట్రికల్ వైర్లు, స్విచ్‌లను బ్రాండెడ్ కంపెనీల ముసుగులో నకిలీవి వరంగల్ నగరంలో విక్రయిస్తున్నారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో అండర్ బ్రిడ్జి, శివనగర్ ప్రాంతంలో శ్రీపార్వతీ ఎలక్ట్రికల్స్ యజమాని చౌదరి ధనరావు నకిలీ దందా చేస్తున్నట్లు సమాచారం రావడంతో టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడి చేశారు. రూ.28లక్షల 67వేల విలువైన వైర్లు, స్విచ్‌లను స్వాధీనం చేసుకున్నారు. విక్రయిస్తున్న ధనరావును అదుపులోకి తీసుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ రాజు ధ్రువీకరించారు.

వరంగల్, హనుమకొండను ఒకే జిల్లాగా ప్రకటించాలి

జిల్లాల ఏకీకరణ ఉద్యమ కమిటీ చైర్మన్ వెంకటనారాయణ



హనుమకొండలోని ప్రెస్‌క్లబ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, పింగిళి సంపత్‌రెడ్డి

వడ్డెపల్లి, సెప్టెంబరు 24: వరంగల్, హనుమకొండ జిల్లాలను కలిపి ఒకే జిల్లాగా ప్రకటించాలని వరంగల్, హనుమకొండ జిల్లాల ఏకీకరణ ఉద్యమ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, కమిటీ సభ్యుడు పింగిళి సంపత్‌రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. భారతదేశ చరిత్రలో వరంగల్ నగరానికి, కాకతీయ సామ్రాజ్యంలో ఒక ప్రత్యేక స్థానం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధిస్తే వరంగల్ నగరం హైదరాబాద్‌కు సమాంతరంగా ఒక ఆర్థిక, వాణిజ్య, విద్య, వైద్య, ఉపాధి ఉద్యోగాలు కల్పించే కేంద్రంగా మారుతుందని ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు ఆశించారని పేర్కొన్నారు. ఏ రాష్ట్రంలో ఏ ఉమ్మడి జిల్లాను రెండు నుంచి నాలుగు జిల్లాల కంటే ఎక్కువ విభజించలేదని తెలిపారు. వరంగల్ ఉమ్మడి జిల్లాను ఆరు జిల్లాలుగా చేసి ఇక్కడి రాజకీయ చైతన్యం, అభివృద్ధి, భౌగోళిక ఉనికి, నగర స్వరూపాన్ని విధ్వంసం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం వరంగల్, హనుమకొండ జిల్లాలను ఒకే జిల్లాగా చేసి అభివృద్ధికి బాటలు వేయాలని కోరారు. సమావేశంలో జిల్లాల ఏకీకరణ ఉద్యమ కమిటీ సభ్యులు సోమ రామ్మూర్తి, దారం జనార్దన్, కొండ్ర నర్సింగరావు, సోమిడి శ్రీనివాస్, డాక్టర్ మంద వీరస్వామి, ఐతం నాగేష్, చిల్ల రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేయూ ఫార్మసీ కళాశాలలపై కొరడా

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 24: కేయూ పరిధిలోని 10 ఫార్మాడీ కళాశాలు, అలాగే మరో 4 బీఫార్మసీ సీట్లలో కోత విధించి వర్సిటీ ఉన్నతాధికారులు కొరడా ఝుళిపించారు. 'ఆంధ్రజ్యోతి'లో మంగళవారం 'అనుమతుల కోసం అడ్డదారులు' అనే శీర్షికతో వచ్చిన కథన కలకలం రేపింది. వర్సిటీ సీడీసీ డీన్ అధికారులు, ఫార్మసీ తనిఖీ అధికారుల నుంచి ప్రత్యేక నివేదికను తెప్పించుకుని సరైన వసతులు లేని కళాశాలలపై చర్యలకు దిగారు. వరంగల్ - హనుమకొండ, ఖమ్మంలోని 10 ఫార్మాడీ, మరో 4 బీఫార్మసీ కళాశాలల్లో గతంలో ఉన్న సీట్లలోనూ కోత విధించింది. ఈ మేరకు వర్సిటీ అధికారులు ఉత్తర్వులు వెలువరించారు.

బీఫార్మసీలో సీట్ల కోత విధించిన కళాశాలివే.. : కాకతీయ యూనివర్సిటీలో పరిధిలో 4 బీఫార్మసీ కళాశాలల్లో గతంలో ఉన్న 100 సీట్లకు బదులుగా ఈ ఏడాది 60 సీట్లకు తగ్గించారు. కోత పడిన కళాశాలల్లో ఖమ్మంలోని మహ్మదీయ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, సహస్ర ఫార్మసీ కళాశాల హనుమకొండ, శ్రీ కాలేజీ ఆఫ్ ఫార్మసీ కొత్తగూడెం, శ్రీ కాకతీయ కాలేజీ ఆఫ్ ఫార్మసీ, హనుమకొండలున్నాయి.

ఫార్మాడీ కళాశాలివే.. : కేయూ పరిధిలో 1 ఫార్మాడీ కళాశాలలపై సీట్లపై వేటు పడింది. వాటిలో నర్సంపేటలోని బాలాజీ ఫార్మాడీ కాలేజీ, జయముఖి కాలేజీ, సోమిడి నేతాజీ ఫార్మాడీ కాలేజీ, హనుమకొండ సహస్ర ఫార్మాడీ కాలేజీ, ఖమ్మంలోని బ్రౌన్స్ ఫార్మాడీ కాలేజీ, మహ్మదీయ ఫార్మాడీ కాలేజీ, ఖమ్మం కాలేజీ ఫార్మాడీ, హనుమకొండ పాత్‌ఫైండర్, శ్రీ శివానీ ఫార్మాడీ కాలేజీ, ఎస్ఆర్ఆర్ ఫార్మాడీ కాలేజీలున్నాయి. ఆయా కళాశాలల్లో గతంలో ఉన్న 30సీట్లకు బదులుగా 20 సీట్లకు తగ్గించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఐనవోలు, సెప్టెంబరు 24: మూడు ఇసుక ట్రాక్టర్లను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. ఎస్సై పస్తం శ్రీనివాస్ కథనం ప్రకారం.. పున్నేలు క్రాస్ రోడ్డు వద్ద మంగళవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న 3 ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

జూనియర్ లెక్చరర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 24: హనుమకొండ జిల్లా ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎన్నికల అధికారిగా పి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర పరిశీలకులుగా వీరమల్ల బాబురావు, ఏనుగు శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరించగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా వి.కరుణాకర్‌రెడ్డి, ప్రధానకార్యదర్శిగా టి.మైపాల్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

డెస్క్ జర్నలిస్టుకు సీఎంఆర్ఎఫ్ చేయూత



సీఎంఆర్ఎఫ్ మంజూరు పత్రాన్ని ప్రెస్‌క్లబ్ బాధ్యులకు అందజేస్తున్న ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి

వడ్డెపల్లి, సెప్టెంబరు 24: 'ఆంధ్రజ్యోతి' వరంగల్ డెస్క్ జర్నలిస్టు కర్ణకంటి రామకృష్ణాచారి గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురయ్యారు. ఇటీవల హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రిలో ఆయనకు ఓపెన్ హార్ట్ సర్జరీ జరిగింది. రామకృష్ణాచారి కుటుంబ, ఆర్థిక పరిస్థితి, వైద్య ఖర్చుల గురించి గ్రేటర్ వరంగల్ ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగ రాజు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దాంతో స్పందిం చిన ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి సీఎంఆర్ఎఫ్ నుంచి రూ.1లక్షా50వేలను మంజూరు చేయించి ఆ పత్రాన్ని ప్రెస్‌క్లబ్ బాధ్యులకు మంగళవారం అందజేశారు. ఈ కార్య క్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు, కోశాధికారి బోళ్ల అమర్, వైస్ ప్రెసిడెంట్లు దుర్గాప్రసాద్, అల్లం రాజేష్‌వర్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులు బస్టాండ్‌లోకి వెళ్లే దారి మార్పు

బాలసముద్రం, సెప్టెంబరు 24: హనుమకొండ బస్టాండ్‌లోకి వస్తున్న ప్రయాణికులను వాకింగ్ ట్రాక్ నుంచి బస్టాండ్‌లోకి ఆర్టీసీ సెక్యూరిటీ సిబ్బంది మంగళవారం దారి మళ్లించారు. ప్రయాణికుల కోసం ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ నుంచి బస్టాండ్ లోపలికి వెళ్లాలని ఇద్దరు సెక్యూరిటీ గార్డ్సు ఉదయం నుంచి రాత్రి వరకు తాడును అడ్డుగా కట్టి ప్రయాణికులను వాకింగ్ ట్రాక్ ద్వారా పంపిస్తున్నారు. బస్టాండ్ నుంచి బస్సులు బయటకు వచ్చే క్రమంలో ప్రయాణికులు ఎదురుగా వెళ్లి ప్రమాదాలకు గురవుతున్నారని, వారిని సురక్షితంగా పంపించడానికే ట్రాక్ ద్వారానే వెళ్లాలని దారి మళ్లిస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.

సఫాయి కార్మికులకు సన్మానం

హసన్‌పర్తి, సెప్టెంబరు 24: స్వచ్ఛత హీ సేవ 2024 వజ్రోత్సవ పక్షోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని సంస్కృతి విహార్ ఈటీసీ సెంటర్‌లో ఎమ్మెల్యే నాగరాజు, కలెక్టర్ ప్రావీణ్య చేతుల మీదుగా పంచాయతీ సఫాయి కార్మికులను మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా నాగారం, మల్లారెడ్డిపల్లి, సూదన్‌పల్లి, భైరాన్‌పల్లి, అనంతసాగర్ గ్రామాలకు చెందిన 20 మంది పారిశుధ్య కార్మికులకు సన్మానం చేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నాగపద్మజరాణి, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీరమాకాంత్, ఎంపీడీవో ప్రవీణ్, ఎంపీవో కర్ణాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

మేయర్ పీఏ వేధిస్తున్నాడు!

ఆత్మహత్యకు పాల్పడతానంటూ ఉద్యోగి హెచ్చరిక

వరంగల్ కార్పొరేషన్, సెప్టెంబరు 24: తనను చాలా కాలంగా మేయర్ గుండు సుధారాణి పీఏ అశోక్ మానసి కంగా వేధిస్తున్నాడని బాధితుడు జగన్ విలేకరుల ఎదుట వాపోయాడు. అందుకే కౌన్సిల్ జరుగుతున్న సమయంలో ఆత్మహత్యకు పాల్పడేందుకు వచ్చానని చెప్పాడు. బాధితుడు జగన్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్‌కు చెందిన కుక్కల నాగజగన్ అనే వ్యక్తి ఔట్ సోర్సింగ్ కార్మికుడిగా బల్దియాలో చాలామంది అధికారుల వద్ద డ్రైవర్‌గా పని చేశారు. కొద్దిరోజులుగా మేయర్ వద్ద పని చేస్తుండడంతో అక్కడ పని చేస్తున్న పీఏ అశోక్‌కు జగన్ నచ్చక మేయర్ వద్ద నుంచి ఇతర ప్రాంతానికి పంపించాడు. దీంతో బాధితుడు ఏసీ, కమిషనర్ సీసీని కలిసినా ప్రయోజనం లేకుండా పోయింది. తనను విధుల నుంచి తొలగించాలని నెల జీతం నిలిపి వేయాలని సీఎంహెచ్‌వోకు, ఏసీపై పీవో ఒత్తిడి తెచ్చినట్లు ఆరోపించాడు.

అంతే కాకుండా జగన్‌ను చెత్త ట్రాక్టర్, స్మశానవాటిక లో శవాలను తరలించే వాహనాలు లేదా చెత్త స్వచ్ఛ ఆటోపై విధులు కేటాయించాలని అధికారులపై ఒత్తిడి తెచ్చినట్లు తెలిపారు. మేయర్ బిల్డింగ్ వద్దకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంటానని చెప్పడంతో అక్కడి సిబ్బంది అడ్డుకుని బుజ్జగించారు. కాగా, విషయం ఉన్నతాధికారులకు తెలియడంతో సీఎం హెచ్‌వో కార్యాలయానికి పిలిపించుకుని జీతం మంజూరు చేయడంతోపాటు మరో చోట విధులు కేటాయిస్తానని హామీ ఇవ్వడంతో నాగజగన్ ఆత్మహత్య ప్రయత్నం విర మించుకున్నారు. మేయర్ పీఏ మరోమారు వేధిస్తే కుటుంబ సభ్యులతోకలిసి కమిషనర్ కార్యాలయం ముదు సామూహిక ఆత్మహత్యకు పాల్పడుతామని హెచ్చరించాడు.

టూరిజం ప్రాజెక్టు పనులు పూర్తి చేయాలి

● 27లోగా యువ టూరిజం క్లబ్ రిజిస్ట్రేషన్లు పూర్తి చేయండి

● కలెక్టర్ ప్రావీణ్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రావీణ్య

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 24: వంగర టూరిజం ప్రాజెక్టు పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం జిల్లా టూరిజం ప్రమోషన్స్ కౌన్సిల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని అన్ని విద్యాసంస్థల్లో సెప్టెంబర్ 27లోగా యువ టూరిజం క్లబ్ రిజిస్ట్రేషన్‌లు పూర్తి చేయాలన్నారు. అలాగే జిల్లాలోని వంగర ప్రాజెక్టుతో పాటు పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. టూరిజం సెక్రెటరీ ఆదేశాల ప్రకారం హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థుల నుంచి ఉన్నత విద్య వరకు అన్ని విభాగాల్లో టూరిజం క్లబ్‌లు ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా టూరిజం అధికారి ఎం.శివాజీ, పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ మల్లునాయక్, కేంద్ర పురావస్తు శాఖ అధికారి మల్లేశం, విద్యాశాఖ అధికారి వాసంతి, ఆర్టీసీ, టూరిజం, ఇంటర్మీడియట్ బోర్డు, ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్, నీటి పారుదల శాఖ అధికారులు పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

హసన్‌పర్తి: మహిళలు పురుషులతో సమానంగా అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకొని అన్నిరంగాలలో రాణించాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దారు కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్‌ను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుతో కలిసి కలెక్టర్, సెర్ప్ డీఆర్‌డీవో నాగపద్మజ, ఈజీఎస్ ఏపీడీ మేన శ్రీనివాస్, డీఆర్‌డీవో సుధీర్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతీ గ్రామంలో మహిళా సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అందించే అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మహిళలకు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తోందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ చల్ల ప్రసాద్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో కర్ణాకర్‌రెడ్డి, డీపీఎంలు దాసు, అనిల్, శ్రీకాంత్, ప్రకాష్, ఏపీఎం రవీందర్, దేవానంద్, సీసీలు అరుణ, అనురాధ, సదానందం, మండల సమాఖ్య వీఓఏలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



కాజీపేటలో శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

కాజీపేట, సెప్టెంబరు 24: ప్రజా సంక్షేమమే తమ ప్రభుత్వ ధ్యేయమని, అర్హులందరికీ ప్రజా సంక్షేమ కార్యక్రమాలు అందించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. కాజీపేటలో మంగళవారం 47, 63వ డివిజన్‌లో రూ.40లక్షలతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం ఇంపీరియల్ కాలనీవాసులు సమస్యలపై ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సంకు నర్సింగరావు, విజయశ్రీ రజాలీ, జక్కుల రవీందర్ యాదవ్, మాజీ కార్పొరేటర్ గోల్కొండ రాంబాబు, నాయకులు ఎం.డి. అంకూస్, షేక్ అస్లర్, మైసారపు సిరిల్ లారెన్స్, ఇప్ప శ్రీకాంత్, దొంగల కుమార్, సిలువేరు విజయ్ భాస్కర్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి

గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి

వరంగల్ ఎడ్యుకేషన్: రాష్ట్రంలోని గురుకుల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని యూటీఎఫ్ ఎంజేపీ వింగ్ ప్రతినిధి మాధవి డిమాండ్ చేశారు. ఈమేరకు ఆమె యూటీఎఫ్ నాయకులతో కలిసి మంగళవారం పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, కలెక్టర్ పి. ప్రావీణ్యను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... గురుకుల పాఠశాలల్లో కేర్ టేకర్లను నియమించాలని, గురుకులాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఐజీఎస్, టీఎస్జీఎల్ఐ సౌకర్యం కల్పించాలని, గురుకులాల ప్రిన్సిపాళ్లకు గెజిటెడ్ హోదా కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంజేపీ వింగ్ స్రవంతి, యూటీఎఫ్ నాయకులు రవీందర్‌రాజు, రాజు, కిరణ్‌కుమార్, మల్లిక్, మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

వరంగల్ క్రైం, సెప్టెంబరు 24: సుబేదారి పోలీస్‌స్టేషన్ పరిధిలోని హంటర్‌రోడ్డులో ఒకరి నివాసంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. ఈ దాడిలో రూ.12 వేల నగదు, నాలుగు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకుని నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారణ నిమిత్తం సుబేదారి పోలీసులకు అప్పగించారు. ఈ విషయాన్ని టాస్క్‌ఫోర్స్ సీఐ ఎస్.రాజు ధృవీకరించారు.

చెస్ గ్రాండ్‌మాస్టర్ అర్జున్‌కు ఎమ్మెల్యే అభినందనలు

వరంగల్ స్పోర్ట్స్, సెప్టెంబరు 24: ఇటీవల హంగేరిలోని బుడా పెస్టులో జరిగిన 45వ ప్రపంచ చెస్ ఒలంపియాడ్‌లో భారత్‌కు బంగారు పతకం సాధించిన హనుమకొండకు చెందిన చెస్ గ్రాండ్ మాస్టర్ ఇరిగేషి అర్జున్‌ను పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ఫోన్‌లో మంగళవారం అభినందించారు. రాష్ట్రం నుంచి తొలిసారి గ్రాండ్‌మాస్టర్ హోదాను పొంది చరిత్ర సృష్టించిన అర్జున్ హనుమకొండ కీర్తి ప్రతిష్ఠలను విశ్వవ్యాప్తం చేయడం అభినందనీయమన్నారు. చెస్‌లో చరిత్ర సృష్టించిన హంగేరి దేశం నుంచి నగరానికి రాగానే అర్జున్‌ను కలిసి అభినందనలు తెలిపి సత్కరిస్తామన్నారు. కాగా, ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అర్జున్‌కు సెల్‌ఫోన్‌లో వీడియోకాల్ ద్వారా శుభాకాంక్షలు తెలిపారు.

నేరాలకు పాల్పడితే చర్యలు తప్పవు

బాలసముద్రం, సెప్టెంబరు 24: నగరంలో నేరాలకు పాల్పడిన వారిపై చర్యలు తప్పవని హనుమకొండ ఏసీపీ దేవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండలోని దీన్‌దయాళ్‌నగర్ కాలనీలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. సరైన పత్రాలు లేని 15 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలు సీజ్ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. బాలురు వాహనాలు నడపడం నేరమన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. చట్టాలపై కాలనీవాసులకు అవగాహన కల్పించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దని స్థానికులకు సూచించారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ సీఐ వై సతీష్, యూనివర్సిటీ సీఐ సంజీవ్, ఎస్సైలు, 60 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

నేరాల నియంత్రణలో యువత పాత్ర కీలకం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న షీ టీమ్ సీఐ సుజాత

హసన్‌పర్తి, సెప్టెంబరు 24: నేరాల నియంత్రణలో యువత పాత్ర కీలకమని షీటీమ్ సీఐ సుజాత అన్నారు. మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ రాజశ్రీరెడ్డి అధ్యక్షతన ఎన్ఎస్ఎస్ అవతరణ దినోత్సవంలో భాగంగా విద్యార్థినులకు షీటీమ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సుజాత ఆధ్వర్యంలో నేరాల నియంత్రణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, టోల్ ఫ్రీ నెంబర్ల పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ.. సైబర్ నేరాలు, మహిళలపై అత్యాచారాలు, అఘాయిత్యాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవ్‌టీజింగ్, గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. అమ్మాయిలు సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫొటోలు, వివరాలను పంచుకోవడంలో జాగ్రత్త వహించాలన్నారు. సైబర్ నేరాలు జరిగితే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేయాలని, మహిళలు ఎవరినుండైనా ఇబ్బందులకు గురైతే 8712685257, 8712685142, 8712685270 నెంబర్‌లకు వాట్సాప్ ఫోన్ కాని నేరుగా ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ ఈసీఈ బ్రాంచ్ హెడ్ డాక్టర్ కే మహేందర్, శర్మ, సోషల్ మీడియా ఇన్‌చార్జి రవికిరణ్, హెడ్ కానిస్టేబుల్ భాస్కర్, రాంరెడ్డి, సువార్త, ఏవో వేణుగోపాలస్వామి, విద్యార్థినులు తదితరులు పాల్గొన్నారు.

కళాక్షేత్రం పనుల ఆలస్యంపై ఆగ్రహం



పనులు పరిశీలిస్తున్న కుడాచైర్మన్ వెంకట్రామిరెడ్డ, కమిషనర్ అశ్వినితానాజీ వాకడే

బాలసముద్రం, సెప్టెంబరు 24: కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనుల ఆలస్యంపై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే నిర్మాణ సంస్థ ప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి వివిధ శాఖల అధికారులతో కలిసి పనులను కమిషనర్ పరిశీలించారు. లిఫ్ట్ పనులు త్వరగా పూర్తి చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సూచించారు. కళాక్షేత్రం వెనుకభాగంలో ప్రహరీ సమీపంలో నర్సరీ మొక్కలు నాటాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ముఖ్య నేతతో బీఆర్ఎస్ నేతల భేటీ

పార్టీ మారేందుకు రహస్య చర్చలు

రాంనగర్, సెప్టెంబరు 24: వర్ధన్నపేట నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నేతతో బీఆర్ఎస్‌కు చెందిన పలువురు నేతలు రహస్యంగా భేటీ అయ్యారు. మంగళవారం నగరంలోని ఒక కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఉద్యమకారుడు, మాజీ కార్పొరేటర్ అయిన ఒక నేతతో పాటు మరో నలుగురు నేతలున్నట్లు సమాచారం. కాంగ్రెస్ ముఖ్య నేతతో జరిగిన భేటీలో ఐదుగురు బీఆర్ఎస్ నేతలు పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. సుదీర్ఘంగా జరిగిన చర్చల్లో బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చే వారికి సముచిత స్థానం కల్పించేలా తాను చొరవ తీసుకుంటానని కాంగ్రెస్ నేత అభయమిచ్చినట్లు సమాచారం. ముఖ్యమంత్రి సలహాదారుడైన వేం నరేందర్‌రెడ్డికి సన్నిహితుడైన సదరు ముఖ్యనేత.. ఐదుగురిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి కండువా కప్పించాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. ఐదుగురు నేతలు సైతం వర్ధన్నపేట నియోజకవర్గం పరిధిలోని వారు కావడం విశేషం. బీఆర్ఎస్ నేతలు కాంగ్రెస్ నేతతో భేటీ కావడం చర్చనీయాంశంగా మారింది.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

సీఐటీయూ జిల్లా ప్రతినిధి ఇమ్మడి సాగర్


వడ్డెపల్లి, సెప్టెంబరు 24: మున్సిపల్ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రతినిధి ఇమ్మడి సాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం గ్రేటర్ వరంగల్ 56, 57, 58, 59, 60 డివిజన్లలో మున్సిపల్ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఇమ్మడి సాగర్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికుడు సహజంగా మృతి చెందితే రూ. 5 లక్షలు ఎక్స్‌గ్రేషియా, ప్రమాదంలో మరణిస్తే ఆ కుటుంబానికి రూ. 10 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 60 జీవో ప్రకారం 452 మంది కార్మికులు, మలేరియా, స్వచ్ఛ ఆటో, హార్టికల్చర్ కార్మికులందరికీ కేటగిరి వారీగా వేతనాలు ఇవ్వాలన్నారు. జవాన్లందరికీ ఖమ్మం, కరీంనగర్ జిల్లాల్లో మాదిరిగా రూ. 19,500 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. నిరసనలో మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.

● హనుమకొండ చౌరస్తా: కార్పొరేషన్ పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికుల పెండింగ్ సమస్యలను కౌన్సిల్‌లో చర్చించి పరిష్కారం చేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు హాజరు పాయింట్ల వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టారు. మంగళవారం హనుమకొండ 9, 10వ డివిజన్ల పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు చేపట్టిన నిరసన కార్యక్రమానికి మద్దతుగా సీఐటీయూ మునిసిపల్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు టి.ఉప్పలయ్య పాల్గొని మాట్లాడారు. కౌన్సిల్‌లో కార్మికుల సమస్యలకు పరిష్కారం చూపకుంటే బుధవారం కార్పొరేషన్ ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన చేయడంతో పాటు ఈ నెల 28న జిల్లా కలెక్టర్ ఆఫీసు ఎదుట, అక్టోబరు 8న హైదరాబాద్‌లో మునిసిపల్ కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా, నిరసన కార్యక్రమాలు చేస్తామని హెచ్చరించారు. తాత్కాలికంగా పనిచేస్తున్న మునిసిపల్ కార్మికులను శాశ్వత ఉద్యోగులుగా గుర్తించడం, కనీసం రూ.26వేల వేతనం పెంచడంతో పాటు కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీఐటీయూ నాయకులు మారపాక అనిల్, దామోదర్, రవి, శ్రీనివాస్, నవనీత, బాబు, శ్రీధర్, రమేష్, ఎల్లస్వామి, గణేష్ పలు డివిజన్ల పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

ధర్మసాగర్, సెప్టెంబరు 24: విద్యుదాఘాతంతో చిట్యాల అరవింద్ (20) సోమవారం రాత్రి మృతి చెందాడు. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని ముప్పారంనకు చెందిన అరవింద్ ఇస్త్రీ చేస్తుండగా కరెంట్‌షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు 108 వాహనంలో ఎంజీఎం దవాఖానకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అరవింద్ ఇంటర్ పూర్తి చేసి కంప్యూటర్ కోచింగ్ తీసుకుంటున్నాడు.

దేశ భవిష్యత్‌కు రూపకర్తలుగా మారండి



రావు పద్మను సన్మానిస్తున్న ఎస్సీ మోర్చా కమిటీ

హనుమకొండ టౌన్, సెప్టెంబర్ 24: బీజేపీ కుటుంబంలో భాగమై భవిష్యత్ భారతావనికి రూపకర్తలుగా మారాలని బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ పిలుపునిచ్చారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా రెండు రోజుల కార్యక్రమంలో భాగంగా మంగళవారం బీజేపీ పార్టీ సదస్యత దివాస్ పేరుతో ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించింది. రెండు రోజుల పాటు జాతీయ స్థాయి నాయకుడి నుంచి బూత్ స్థాయి నాయకుల వరకు సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. డ్రైవ్ మొదటి రోజులో భాగంగా జిల్లా అధ్యక్షురాలు పశ్చిమ నియోజకవర్గంలోని 112వ బూత్‌లో కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తూ ప్రజలచే బీజేపీ పార్టీ సభ్యత్వ నమోదు చేయించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, కందగట్ల సత్యనారాయణ, హరిశ్ తదితరులు పాల్గొన్నారు.

రావు పద్మను కలిసిన ఎస్సీ మోర్చా కమిటీ

ఇటీవలే నూతనంగా ఎన్నికైన బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కమిటీ మంగళవారం పార్టీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. ఈ సందర్భంగా రావు పద్మ మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేయాలని సూచించారు. పార్టీ నియమాలకు కట్టుబడి సభ్యత్వ నమోదు కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొని పార్టీ సభ్యత్వాన్ని పెంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు, ఉపాధ్యక్షుడు గుంటి కృష్ణారావు, మల్లమ్మారి శివాజీ గణేశ్, బర్ల నవీన్, ప్రధాన కార్యదర్శి బత్తుల వినయ్, కార్యదర్శులు భైరపాక వెంకటేశ్, బొచ్చు శ్రీనువాస్ తదితరులు పాల్గొన్నారు.

గరం గరంగా బల్దియా కౌన్సిల్

(5వ పేజీ తరువాయి)

అధికారులు సకాలంలో స్పందించాలన్నారు. మంచి నీటి సరఫరా సమస్య పరిష్కారం కోసం యాక్షన్ ప్లాన్ ప్రకారం పనులు చేపట్టాలన్నారు. నీటి సరఫరా కోసం రూ.4.30లక్షల స్పెషల్ ఫండ్ కూడా మంజూరైందన్నారు. కొద్ది రోజుల్లో బతుకమ్మ పండగ జరుగనుందని, అకాలవర్షాల వల్ల చాలా చెరువులు, కుంటలు ప్రమాదకరంగా మారాయని, వాటిని గుర్తించి మరమతు చేయాలని అధికారులను ఆదేశించారు. నయీంనగర్ నాలా విషయంలో ప్రత్యేక శ్రద్ధచూపిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్టు చెప్పారు. రానున్న రోజుల్లో వరంగల్‌ను ఐటీ హబ్‌గా, మెడికల్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రిని కలుస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో చేసిన అభివృద్ధి ఏమీ లేదని, కాళోజీ కళాక్షేత్రం ప్రారంభించి మధ్యలో వదిలేస్తే.. తమ ప్రభుత్వం పూర్తి చేసిందన్నారు. వచ్చే నెల ప్రారంభం అవుతుందని మంత్రి తెలిపారు.

అభివృద్ధి పనులపై ప్రతిపాదనలకు ఆమోదం

15వ ఆర్థిక సంఘం మిగులు నిధులను అభివృద్ధి పనుల కోసం ఖర్చు చేసే దిశగా కౌన్సిల్ సమావేశం జరిగిందని మేయర్ గుండు సుధారాణి చెప్పారు. శానిటేషన్ పరికరాలు, ఇంజనీరింగ్, మరో 250 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల నియామకానికి సంబంధించిన ఎజెండాపై చర్చించామని తెలిపారు. ప్రతిపాదనలను సభ్యులు ఆమోదించారన్నారు. ఎమ్మెల్యేల పరిధిలో ఉన్న డివిజన్‌లలో నెలకొన్న సమస్యలపై ఆయా శాఖల అధికారులు దృష్టి సారించాలని ఆదేశించామన్నారు. కార్పొరేషన్‌కు కావలసిన నిధులపై మంత్రి, ఎమ్మెల్యేలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి మంజూరు చేయిస్తామని చెప్పారని అన్నారు.

పదేళ్లలో లేని అభివృద్ధి జరుగుతోంది..

కార్పొరేషన్ చరిత్రలో గతంలో ఎన్నడూ జరగనంత వేగంగా వరంగల్ నగరంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి తెలిపారు. ప్రతీ సభ్యుడి సమస్య విని సమస్యలపై స్పందించామన్నారు. పదేళ్లలో బీఆర్ఎస్ చేసింది ఏమీ లేదన్నారు. గతంలో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు టెండర్ వేసేందుకు వచ్చేవారు కాదని, ఎందుకంటే కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లింపు విషయంలో బీఆర్ఎస్ ప్రభుత్వం జాప్యం చేసేదన్నారు. కాంగ్రెస్ అభివృద్ధి చూడలేక కౌన్సిల్ నుంచి బీఆర్ఎస్ నాయకులు వెళ్లిపోయారన్నారు.

ప్రజల సమస్యల చర్చ జరిగింది..

బల్దియాలో జరిగిన కౌన్సిల్ సమావేశం వరంగల్ నగర ప్రజల సమస్యల పరిష్కారం కోసం జరిగిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మంత్రి, మేయర్, తోటి ఎమ్మెల్యేలు సభ్యులకు సహకరించి అన్ని సమస్యలు విని అభివృద్ధి దిశగా ప్రయాణించాలని చెప్పారన్నారు. కౌన్సిల్‌లో తీర్మానం చేసిన ప్రకారంగా విలీన గ్రామాలలో పారిశుధ్య కార్మికులు తక్కువగా ఉన్నారని, ప్రస్తుతం నియమించే 250 మందిని విలీన గ్రామాలకు కేటాయించాలన్నారు.

ఇది ప్రజల కౌన్సిల్ కాదు.. కాంగ్రెస్ కౌన్సిల్..

కౌన్సిల్ సమావేశం అనేది ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు పెట్టాలి కానీ.. ఈ సమావేశం పక్కాగా కాంగ్రెస్ కౌన్సిల్‌గా జరిగిందని డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీం మసూద్ విమర్శించారు. డివిజన్‌లలో నెలకొన్న సమస్యల గురించి నాలుగుసార్లు మేయర్‌కు, మంత్రికి విన్నవించాలనే ప్రయత్నం చేసినా తమకు కనీసం మాట్లాడే అర్హత కూడా కల్పించలేదన్నారు. మేయర్‌కు ప్రతిపక్షాల మీద ఎందుకు ఇంత చిన్న చూపు అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ కార్పొరేటర్ల డివిజన్‌లకు నిధులు ఇవ్వకుండా కాంగ్రెస్ కార్పొరేటర్ల డివిజన్‌లకు ఇప్పటికే తలా రూ.30లక్షల నిధులు ఇచ్చారన్నారు. ఇది ప్రజలకు మేయర్ ఇచ్చే తప్పుడు సంకేతం కాదా? అని మండిపడ్డారు.

ప్రియాంక గాంధీ.. మీరైనా మాటపై నిలబడతారా..?

» ట్రిపుల్ ఆర్ బాధితుల సమస్యలు పరిష్కరించాలి: హరీశ్



తెలంగాణ ఉత్తర దిక్కులోని ట్రిపుల్ ఆర్ బాధితులకు న్యాయం చేస్తామని, ఎన్నికల్లో ఇచ్చిన హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. భువనగిరిలో నిర్వహించిన ఎన్నికల ప్రచారసభలో బాధితులకు కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి ప్రియాంక గాంధీతో హామీ ఇప్పించి ఇప్పుడు మాట మార్చడం దౌర్భాగ్యమన్నారు. 'ప్రజా సమస్యలపై ఇక్కడి నేతలకు పట్టింపులేదు.. మీరైనా ఇచ్చిన మాటమీద నిలబడతారా? లేదంటే కాంగ్రెస్ నైజమే ఇదని మాట తప్పుతారా?' అంటూ ప్రియాంక గాంధీని ఆయన ప్రశ్నించారు. ప్రత్యేక చొరవ తీసుకొని బాధితుల సమస్యలు పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డిని, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఆదేశించాలని ఆమెను కోరారు. మంగళవారం హైదరాబాద్‌లోని హరీశ్ నివాసంలో ఆయనను ట్రిపుల్ ఆర్ బాధితులు, రైతులు కలిశారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి, కాంగ్రెస్ ఎమ్మెల్యేలెవరూ తమ బాధను పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల హామీని నిలబెట్టుకునే వరకు బాధితులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆర్ఆర్ఆర్ ఏర్పాటు విషయంలో ఉత్తర భాగంలో 40 కిలోమీటర్లకు బదులుగా 28 కిలోమీటర్లను పరిగణనలోకి తీసుకొని జంక్షన్ ఏర్పాటు చేయడం వల్ల చౌటుప్పల్ మునిసిపాలిటీ, మండల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. మధ్య నుంచి రోడ్డు వెళ్లడంవల్ల మునిసిపాలిటీ రెండు భాగాలుగా విడిపోతుందని, బాధితులు రెండు పంటలు పండించే పచ్చని పొలాలను, ఇండ్లు, ప్లాట్లను కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. బాధితులకు న్యాయం చేయకుంటే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

కేటీఆర్..అస్తిత్వం కోసమే మీ డ్రామాలు: సంజయ్



హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అస్తిత్వం కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డ్రామాలాడుతున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. 'మేలుకో బాలుడా...! ప్రజలు మీ గోల్‌మాల్‌ను కొనుగోలు చేయడం లేదు..' అంటూ సెటైర్ వేశారు. కేటీఆర్‌ను 'గజిని'గా సంబోధించిన సంజయ్, అమృత్ టెండర్‌లలో మీ పార్టీ 'ధూమ్ మచాలే' పీఆర్ స్టంట్‌లకు చాలాకాలం ముందే బీజేపీ మాట్లాడిందని స్పష్టం చేశారు. దొంగలు పడిన ఆరు నెలలకు కుక్కలు మొరిగినట్లు సంజయ్ మాట్లాడుతున్నారని కేటీఆర్ చేసిన ట్వీట్‌పై సంజయ్ కౌంటర్ ట్వీట్ చేశారు. రేపు అన్నది ఉందో లేదో అన్న పరిస్థితిని ఎదుర్కొంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం అమృత్ టెండర్‌లలో అవినీతి జరగలేదని భావిస్తే సీవీసీ విచారణ కోరాలని సంజయ్ మరోసారి డిమాండ్ చేశారు.

98 మందితో ఉద్యోగుల జేఏసీ కార్యవర్గం

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల హక్కుల సాధనకు ఏర్పడిన తెలంగాణ ఉద్యోగుల జేఏసీ పూర్తిస్థాయి కార్యవర్గం ఏర్పడింది. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో 98 మందితో కూడిన ఈ కార్యవర్గాన్ని జేఏసీ నేతలు ప్రకటించారు. 205 భాగస్వామ్య సంఘాలున్న జేఏసీ చైర్మన్, సెక్రటరీ జనరల్‌గా మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాస్‌రావును ఇంతకుముందే ఎన్నుకున్న విషయం తెలిసిందే. అడిషనల్ సెక్రటరీ జనరల్‌గా పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, డిప్యూటీ సెక్రటరీ జనరల్స్‌గా టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎం హుస్సేనీ, టీజీవో ప్రధాన కార్యదర్శి ఎనుగుల సత్యనారాయణ, సీపీఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు స్థితప్రజ్ఞ, కో చైర్మన్లుగా చావ రవి, సదానంద్ గౌడ్, రవీందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, మారెడ్డి అంజిరెడ్డి, లింగారెడ్డి, నాగిరెడ్డి, మణిపాల్ రెడ్డి, జ్ఞానేశ్వర్‌ను ఎన్నుకున్నారు. పలు సంఘాల నేతలకు ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సంయుక్త కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులుగా చోటు కల్పించారు. 74 డిపార్ట్‌మెంటల్ ఫోరంల అధ్యక్ష కార్యదర్శులు, 33 జిల్లాల జేఏసీ చైర్మన్లు, కన్వీనర్లు, హైదరాబాద్ నగర, సచివాలయ శాఖ జేఏసీ చైర్మన్లు, కన్వీనర్లు కూడా రాష్ట్ర జేఏసీలో కార్యవర్గ సభ్యులుగా కొనసాగుతారని జేఏసీ నేతలు ప్రకటించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన కోదండరాంను జేఏసీ నేతలు ఘనంగా సన్మానించారు.

కాంట్రాక్టు టీచర్లుగా 2008 డీఎస్సీ బాధితులు

హైదరాబాద్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): డీఎస్సీ- 2008 బాధితులకు న్యాయం చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందులో భాగంగా వారిని కాంట్రాక్టు పద్ధతిలో ఉపాధ్యాయులుగా నియమించనుంది. ఇందుకు సంబంధించి 27వ తేదీ నుంచి ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియను చేపట్టనున్నట్లు విద్యాశాఖ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయుల పోస్టుల భర్తీలో 30 శాతం ఎస్‌జీటీ పోస్టుల రిజర్వేషన్ ప్రవేశపెట్టడం ద్వారా డీఎస్సీ-2008లో బీఈడీ అభ్యర్థులు నష్టపోయారు. తమకు న్యాయం చేయాలని అప్పటి నుంచి వారు ఆందోళన చేస్తూ వచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వారికి న్యాయం చేస్తామని ప్రభుత్వ పెద్దలు ప్రకటించారు. అందులో భాగంగానే తాజాగా 2008 డీఎస్సీ అభ్యర్థులకు విద్యాశాఖలో కాంట్రాక్టుపై ఉద్యోగాలను ఇవ్వాలని నిర్ణయించారు.

ఓపెన్ వర్సిటీ స్థలం జేఎన్ఏఎఫ్ఏకు వద్దు

» సీఎం రేవంత్‌కు ప్రొఫెసర్ ఘంటా వినతి

బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి చెందిన 10 ఎకరాల భూమిని జేఎన్ఏఎఫ్ఏ యూనివర్సిటీకి కేటాయించవద్దని సీఎం రేవంత్ రెడ్డిని ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి ట్విటర్(ఎక్స్) వేదికగా కోరారు. ఓపెన్ యూనివర్సిటీ ద్వారా అనేక మందికి మేలు జరుగుతోందని ఆయన గుర్తు చేశారు. భూమిని ఇతర యూనివర్సిటీలకు కేటాయించడం ద్వారా ఓపెన్ యూనివర్సిటీ అవసరాలకు ఇబ్బంది ఏర్పడుతుందని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో యూనివర్సిటీ సిబ్బంది ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, ప్రభుత్వం దీనిపై పునరాలోచన చేయాలని కోరారు.

'మహాబలిజ'తో కాపు ఉపకులాలకు లాభం

శ్రీకృష్ణ దేవరాయ ఉద్యోగ జేఏసీ వార్షికోత్సవంలో నేతల తీర్మానం

హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 'మహాబలిజ' పేరిట పునరేకీకరణతో కాపు ఉపకులాలకు ఎంతో లాభం చేకూరుతుందని పలువురు కాపు నేతలు స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని జలవిహార్‌లో జరిగిన కృష్ణదేవరాయ ఉద్యోగ జేఏసీ 9వ వార్షికోత్సవానికి తెలంగాణతో పాటు పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, మహరాష్ట్ర, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుంచి కాపు నేతలు, కార్యకర్తలు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో దక్షిణ భారతదేశంలోని బలిజ, కాపు, తెలగ, ఒంటరి, తూర్పు కాపు, మున్నూరు కాపులను కలిపి మహాబలిజ పేరిట పునరేకీకరణ చేయాలని, తద్వారా విద్య, ఆర్థిక ప్రగతిని సాధించాలని తీర్మానించారు. ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక పరమైన పండుగలను కలిసి నిర్వహించుకోవడం ద్వారా ఐక్యత సాధించాలని పలువురు నేతలు పేర్కొన్నారు. కార్యక్రమంలో శ్రీకృష్ణదేవరాయ ఉద్యోగ జేఏసీ కన్వీనర్ కె.ఎన్. కుమార్, ఐకాన్ గ్రూప్ వ్యవస్థాపకుడు మెండు చక్రపాణితో పాటు పలువురు సీనియర్ బ్యూరోక్రాట్లు, డాక్టర్లు, శాస్త్రవేత్తలు, వ్యాపారవేత్తలు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఐజీ త్రిపాఠి నేతృత్వంలో సిట్!

» తిరుమల లడ్డూ కల్తీపై ప్రత్యేక దర్యాప్తు


అమరావతి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల వెంటేశ్వరుడి భక్తులు పరమ పవిత్రమైన లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసినవారి పని పట్టేందుక సిట్ (ప్రత్యేక దర్యాప్తు బృందం) ఏర్పాటైంది. ఈ బృందానికి గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి నాయకత్వం వహించనున్నారు. ఈ మేరకు సిట్ ఏర్పాటుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆమోదం తెలిపారు. ఐజీ సర్వశ్రేష్ఠ నేతృత్వంలో విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, కడప ఎస్పీ హర్షవర్ధన్ రాజు, డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో ఈ బృందం పనిచేస్తుంది. లడ్డూ నాణ్యత నుంచి దాని వెనక ఉన్న కమీషన్ల బాగోతాన్ని, అపచారానికి బాధ్యులను ఈ బృందం తేల్చనుంది.

శ్రీశైలం జలాశయం ఖాళీ చేసేస్తున్నారు!

» ఇన్‌ఫ్లో అంతంతమాత్రంగా ఉన్నా పోటాపోటీగా జల విద్యుత్ ఉత్పత్తి

» తెలంగాణ, ఏపీ వైఖరితో 3 వారాల్లో 52.61 టీఎంసీల తరుగుదల

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జలాశయాల్లో నీటిని తొలుత తాగునీటికి, ఆ తర్వాతే సాగునీటికి, చివరిలో జల విద్యుత్ ఉత్పాదనకు వినియోగించాలనేది నిబంధన. అయితే వరదలు తగ్గి.. ఇన్‌ఫ్లో లేనప్పటికీ తెలుగు రాష్ట్రాలు పోటీపడి శ్రీశైలం రిజర్వాయర్‌ను ఖాళీ చేస్తున్నాయి. జల విద్యుత్ ఉత్పత్తి, పోతిరెడ్డిపాడు నుంచి భారీగా నీటి తరలింపుతో జలాశయం వేగంగా ఖాళీ అవుతోంది. ఈ నెల 9న 206.10 టీఎంసీల నీటి నిల్వ ఉండగా... మంగళవారం ఉదయం 163.2 టీఎంసీలు మాత్రమే ఉంది. శ్రీశైలం పూర్తి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా మూడు వారాల్లో 52.61 టీఎంసీలను ఖాళీ చేసేశారు. నవంబరు దాకా ప్రాజెక్టులకు వరద ప్రవాహం ఉంటుందని సమాచారం ఉన్నా... కచ్చితంగా వస్తుందో లేదో చెప్పలేని పరిస్థితి. ఎగువన ఆల్మట్టి ప్రాజెక్టుకు వరద పోటెత్తితేనే దిగువన ఉన్న శ్రీశైలంలో నీటిని విద్యుత్ ఉత్పాదనకు వినియోగించుకోవాలి. ఆల్మట్టి నుంచి కేవలం 12 వేల క్యూసెక్కులు, ఆ దిగువన ఉన్న నారాయణపూర్ నుంచి 14,307 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో మాత్రమే ఉంది. జూరాల నుంచి 18,355 క్యూసెక్కుల ఔట్‌ఫ్లో ఉన్నా ఒక్కచుక్క కూడా శ్రీశైలం జలాశయంలోకి చేరకుండానే మళ్లిస్తున్నారు. ప్రస్తుతం ఒక్క చుక్క కూడా



రావడం లేదని ఆంధ్రప్రదేశ్ జలవనరుల సమాచార వెబ్‌సైట్‌లో గణాంకాలు చూపిస్తుండటం గమనార్హం. వచ్చిన ఇన్‌ఫ్లోను వచ్చినట్లే పోతిరెడ్డిపాడు, కల్వకుర్తి నుంచి మళ్లిస్తుండటం గమనార్హం. భారీగా ఇన్‌ఫ్లో ఉన్న సమయంలో జల విద్యుత్ ఉత్పత్తి చేయాలి. కానీ ఇన్‌ఫ్లో అంతంతమాత్రంగా ఉన్నప్పుడు పోటీపడి జల విద్యుత్ ఉత్పత్తి చేయడం విమర్శలకు తావిస్తోంది. శ్రీశైలం కుడి గట్టు జల విద్యుత్ కేంద్రం నుంచి ఏపీ ఇప్పటిదాకా 766.41 మిలియన్ యూనిట్లు, ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రం నుంచి తెలంగాణ ఇప్పటిదాకా 1,057 మిలియన్ యూనిట్లు ఉత్పత్తి చేసింది. మంగళవారం శ్రీశైలం ప్రాజెక్టు నుంచి 52 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు 44 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. జల విద్యుత్ ఉత్పత్తి చేస్తూ వచ్చింది వచ్చినట్టే దిగువకు వదిలిపెట్టారు. ఆ దిగువన ఉన్న పులిచింతలకు 37 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 36 వేల క్యూసెక్కులు వదిలిపెట్టారు. దాంతో ప్రకాశం బ్యారేజీ నుంచి మంగళవారం 43 వేల క్యూసెక్కులు సముద్రం దిశగా వెళ్లిపోయాయి. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు జాగ్రత్తగా వ్యవహరించి.. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలను పెంచుకోవాలని రైతులు కోరుతున్నారు.

'జే గ్యాంగ్' ఆట కట్టు!

బలంగా బిగుస్తున్న సీఐడీ ఉచ్చు.. నాసిరకం మద్యం స్కామ్ దర్యాప్తులో భారీ ముందడుగు

» ఏపీ బ్రూవరీస్ కార్యాలయంలో తనిఖీలు

» మాజీ ఎండీ గది తెరిచిన అధికారులు

» మద్యం కేసులో కీలక ఆధారాల సేకరణ

» తాజా సాక్ష్యాధారాలతో మరో కేసు

» తాడేపల్లి దోపిడీ త్వరలో వెలుగులోకి..

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వైసీపీ వందిమాగధుల మద్యం దోపిడీ బయటికి వస్తోంది. ఐదేళ్ల పాటు జగన్ పాలనలో పేదోడిని దోచిన కుట్రకోణం వెలుగులోకి వస్తోంది.. మద్య నిషేధం హామీతో అధికారంలోకి వచ్చి వెంటనే మాట మార్చిన మోసగాడి గుట్టు బయట పడుతోంది.. స్టార్ హోటళ్లలో తప్ప ఎక్కడా లిక్కర్ లేకుండా చేస్తానంటూ నాసిరకం మద్యాన్ని స్టార్ హోటళ్ల ధరలకు విక్రయించిన వంచకుడి బండారం బయట పడుతోంది.. జే బ్రాండుతో పేదల రక్తాన్ని పీల్చేసి వేల కోట్లు వెనకేసుకున్న తాడేపల్లి ప్యాలెస్‌లో అవినీతి మద్యం కంపు ముక్కుపుటలు అదిరేలా వస్తోంది.. మద్యం తయారీ మొదలు కొనుగోలు వరకూ... సరఫరా నుంచి విక్రయాల దాకా.. అన్నీ గుప్పిట పెట్టుకుని జగన్ గ్యాంగ్ సాగించిన అక్రమ దందా వెలికితీసే పనిలో నిమగ్నమైన ఏపీ సీఐడీ మంగళవారం కీలక ముందడుగు వేసింది. వేల కోట్ల రూపాయల కుంభకోణానికి మూలమైన ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఎండీ వాసుదేవ రెడ్డిపై మూడు నెలల క్రితం దొంగతనం కేసు నమోదైంది. ప్రసాదంపాడులోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి రాత్రి పదింటికి ఎవరో కారులో ఫైళ్లు, కొన్ని బాక్సులు పట్టుకెళుతున్నారంటూ అందిన ఫిర్యాదు మేరకు సీఐడీ కేసు నమోదుచేసింది. అప్పట్లోనే దీనిపై తనిఖీలు చేసింది. మద్యం కుంభకోణంలో మొత్తం సమాచారాన్ని సేకరించి అసలు సూత్రధారులు, వేలకోట్ల కమీషన్లు పొందిన వారికి ఉచ్చు బిగించేందుకు సంసిద్ధమైంది. అన్నింటికీ ప్రధాన సాక్షి అయిన వాసుదేవ రెడ్డి కోసం వెతికిన సీఐడీ అధికారులకు కీలక ఆధారాలు లభించాయి. వాటిని జాగ్రత్తగా పరిశీలించి న్యాయపరమైన అడ్డంకుల్లేకుండా జాగ్రత్త పడ్డ దర్యాప్తు అధికారులు, అదే సమాచారంతో తాజాగా సోదాలకు దిగారు. మంగళవారం సాయంత్రం ప్రసాదం పాడులోని ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్‌కు చేరుకున్న సీఐడీ బృందాలు గతంలో సీజ్ చేసిన వాసుదేవ రెడ్డి కార్యాలయాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేశాయి. ఆయన గదిలో ఫైళ్లు, కంప్యూటర్లు, ఇతరత్రా కీలక ఆధారాలు సేకరించాయి.

దర్యాప్తు అధికారులే నివ్వెరపోయేలా...

వాసుదేవ రెడ్డి గదిలో జరిపిన తనిఖీల్లో కొత్తగా లభ్యమైన సమాచారం సీఐడీ అధికారులనే నివ్వెరపాటుకు గురిచేసినట్లు సమాచారం. 'నాడు ప్రభుత్వమే ఇంత నాసికరం మద్యంతో ప్రజల ప్రాణాలు తీసిందా.?' అని వారంతా ఆశ్చర్యపోయారు. వైసీపీ ప్రభుత్వంలో పెద్దలు, సన్నిహితులు, అనుయాయులు కోటరీగా ఏర్పడి ఇతర యాజమాన్యంలో ఉన్న డిస్టిలరీస్, బ్రూవరీస్‌ను కైవసం చేసేసుకున్నారు. అప్పటి నుంచి జనంపైకి జే బ్రాండ్ల మద్యం వదిలారు. దీనివెనుక వేల కోట్ల కుంభకోణం పథక రచన ఉన్నట్లు సీఐడీ అధికారులు పసిగట్టారు. ఈ బ్రాండ్లు అమ్ముడుపోవు అని అడిగే వ్యాపారుల్లేకుండా మద్యం దుకాణాలన్నీ నాడు ప్రభుత్వమే తన చేతిలో పెట్టుకుంది. కొనుగోలు దారులు ఏది అడిగినా మేమిచ్చిందే తీసుకో.. అంటూ ప్రాణాంతకమైన జె బ్రాండ్ల సీసాలు ఇవ్వడంలో అవినీతిని గుర్తించారు. అత్యంత నాసిరకమైన రసాయనాలతో తయారు చేసిన నాటు సారా కన్నా హాని కరమైన మద్యం విక్రయించి లక్షలాది మంది ఆరోగ్యంతో ఆడుకున్న వారికి సంకెళ్లు వేసేందుకు సిద్ధం అవుతున్నారు.

కీలక ఆధారాలతో కొత్తగా ఎఫ్ఐఆర్!

రాష్ట్రంలో 2019 జూన్ నుంచి మద్యం తయారు చేసిన కంపెనీలు ఎవరి చేతుల్లోకి బలవంతంగా వెళ్లాయనేది సీఐడీ గుర్తించింది. 'జే బ్రాండ్లన్నీ జగన్ అనుయాయుల కంపెనీలకు చెందినవేనని రుజువు చేసే పక్కా ఆధారాలు సేకరించింది. వాటికి ఇష్టారాజ్యంగా అనుమతులిచ్చి ప్రాణాంతక రసాయనాలతో మద్యం తయారు చేయించిన వైనాన్ని పసిగట్టింది. ఇతర నాణ్యమైన మద్యం లభించకుండా చేసి దోపిడీ చేసిన తీరును అంచనా వేసింది. అనుమతులిచ్చే స్థానంలో నాడు ఉన్న వాసుదేవరెడ్డి జే బ్రాండ్లు, లేబుళ్లకు అడ్డగోలుగా అనుమతులు ఇచ్చేశారు. దీనివెనుక తాడేపల్లి నుంచి వచ్చిన ఒత్తిళ్ల మర్మాన్ని చేధించింది. నాసిరకం మద్యాన్ని జగన్ అనుయాయుల కంపెనీల నుంచే బేసిక్ ధర కన్నా ఎక్కువ చెల్లించి కొనుగోలు చేసి ప్రభుత్వ ఖజానాకు పెట్టిన కన్నాన్ని గుర్తించింది. బేసిక్ ధర ఎక్కువగా చెల్లించడం వల్ల ఏపీ బేవరేజెస్‌కు వాటిల్లిన భారీ నష్టాన్ని కూడా సీఐడీ అంచనా వేసింది. తనిఖీల్లో భాగంగా.. ప్రసాదంపాడులోని ఏపీ డిస్టలరీస్ అండ్ బ్రూవరీస్ కార్యాలయంలో గతంలో పనిచేసిన సిబ్బందిని పిలిచి ఏమి జరిగిందో కూపీ లాగారు. ఈ నేపథ్యంలో తాజాగా ఎఫ్ఐఆర్‌ను సీఐడీ నమోదుచేసింది. అయితే, ఎవరు నిందితులు.. పెట్టిన సెక్షన్లు.. లభ్యమైన సాక్ష్యాలు.. ఇతరత్రా వివరాలు బయటికి చెప్పడం లేదు. తమకు లభించిన ఆధారాల మేరకే బాధ్యులపై కేసు నమోదు చేశామని, దర్యాప్తులో వెల్లడయ్యే మరిన్ని సాక్ష్యాల ఆధారంగా వెల్లడిస్తామని అధికారులు చెబుతున్నారు.

రాజ్యసభ సభ్యత్వానికి ఆర్.కృష్ణయ్య రాజీనామా

చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ ఆమోదం



అమరావతి/న్యూఢిల్లీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): బీసీ సంఘం నాయకుడు, ఏపీలోని వైసీపీ తరపున రాజ్యసభకు ఎన్నికైన ఆర్.కృష్ణయ్య తన పదవికి రాజీనామా చేశారు. సోమవారమే రాజ్యసభ చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్‌ను కలిసి రాజీనామా లేఖను అందజేయగా.. మంగళవారం ఆయన ఆమోదం తెలిపారు. పదవీ కాలం ఇంకా నాలుగేళ్లు ఉండగానే కృష్ణయ్య రాజీనామా చేశారు. వైసీపీ నుంచి ఇటీవల రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు, బీద మస్తాన్ రావు రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆర్.కృష్ణయ్య రాజీనామా చేశారు. దీంతో, వైసీపీ రాజ్యసభ సభ్యుల సంఖ్య 11 నుంచి ఎనిమిదికి తగ్గింది.

జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా కృష్ణయ్య?

హైదరాబాద్: ఆర్.కృష్ణయ్య తదుపరి అడుగు చర్చనీయాంశమైంది. ఆయన్ను మోదీ ప్రభుత్వం జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమించే అవకాశం ఉందని బీజేపీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. బీసీల హక్కుల కోసం చేస్తున్న పోరాటంలో భాగంగా కొత్త పార్టీ ఏర్పాటు చేయాలని రెండ్రోజుల కిందట జరిగిన సమావేశంలో పలు బీసీ సంఘాలు ఆయన్ను కోరాయి. అంతకుముందే బీజేపీ జాతీయ అగ్ర నేతలు ఆయన్ను పార్టీలోకి ఆహ్వానించినట్లు ప్రచారం జరిగింది. ఆయనకు కీలక పదవి కట్టబెట్టడం ద్వారా తెలంగాణలో బీసీ ఓటుబ్యాంకు మరింత పెంచుకోవచ్చన్న అంచనాల్లో భాగంగా వారు ఆయనతో చర్చించినట్లు చెబుతున్నారు. కృష్ణయ్య జన్మదినం సందర్భంగా ప్రధాని మోదీ, అమిత్ షా స్వయంగా ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఇది ఆయన్ను జాతీయ బీసీ కమిషన్ చైర్మన్‌గా నియమిస్తారనడానికి సంకేతాలని బీజేపీ వర్గాలు అంటున్నాయి.

మిల్లర్ ఆస్తులు జప్తు

(మొదటిపేజీ తరువాయి)

మేనేజర్ లేఖ రాశారు. కస్టమ్ మిల్లింగ్ బియ్యాన్ని పక్కదారి పట్టించిన రైస్ మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు నమోదుకు కలెక్టర్, అదనపు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండలం మన్‌పహాడ్ గ్రామంలోని శ్రీసాయిరాం మోడ్రన్ బిన్నీ రైస్ మిల్ యజమాని పల్లా చంద్ర శేఖర్ రెడ్డి 2022-23, 2023-24 సంవత్సరాల్లో 1987.560 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని సేకరించారు. కేవలం 143.038 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే ప్రభుత్వానికి పంపిణీ చేశారు. దీంతో ఈనెల 12న కొడకండ్ల డిప్యూటీ తహసీల్దార్ దేవా (పౌర సరఫరాలు) రైస్ మిల్లును తనిఖీ చేశారు. జరిమానా, వడ్డీతో కలిపి కస్టమ్ మిల్లింగ్ కోసం ఇచ్చిన రూ.5.67 కోట్ల విలువైన 1774 మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వలు లేవని గుర్తించారు. వాటిని పక్కదారి పట్టించి ఉంటారని నివేదించారు. ఈ నేపథ్యంలోనే, రైస్ మిల్లు యజమానిపై క్రిమినల్ కేసు నమోదు చేయడమే కాకుండా రైస్ మిల్లర్, ఆయన కుటుంబ సభ్యుల పేరిట ఉన్న ఆస్తులను గుర్తించి రెవెన్యూ రికవరీ యాక్టును ప్రారంభించాలని దేవరుప్పుల తహసీల్దారుకు కలెక్టర్ రిజ్వాన్ బాషా, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ ఆదేశాలు జారీ చేశారు. ఈ మేరకు దేవరుప్పుల పోలీసులకు జిల్లా పౌర సరఫరాల డీఎం అతిరామ్ ఫిర్యాదు చేశారు. ఆయన కుటుంబసభ్యుల పేరిట ఉన్న ఆస్తులపై ఎటువంటి లావాదేవీలను అనుమతించవద్దని జిల్లా సబ్ రిజిస్ట్రార్‌లకు లేఖ రాశారు.

అప్పరాజుపల్లి రైస్ మిల్లుపై టాస్క్‌ఫోర్స్ దాడులు

మహబూబాబాద్ జిల్లా అప్పరాజుపల్లి రాజరాజేశ్వర రైస్‌మిల్లుపై పౌర సరఫరాల శాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు నిర్వహించారు. సివిల్ సప్లై ఓఎస్‌డీ ప్రభాకర్, డీఎస్‌వో ప్రేమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఈ దాడులు కొనసాగాయి. 2022-23 రబీ సీజన్‌లో అప్పరాజుపల్లిలోని రాజరాజేశ్వర రైస్ మిల్లుకు 19,456 క్వింటాళ్ల ధాన్యం అప్పగించారు. మిల్లు బాధ్యులు ఒక్క గింజ కూడా కస్టమ్ మిల్లింగ్ కింద పౌర సరఫరాల శాఖకు అప్పగించలేదు. అలాగే, 2023-24 ఖరీఫ్ సీజన్‌లో మరో 32,240 క్వింటాళ్ల ధాన్యాన్ని మిల్లింగ్ కోసం ఇచ్చారు. ఇందులో 21,900 క్వింటాళ్ల ధాన్యం మిల్లులో లేదని గుర్తించారు. 2022-23 రబీ సీజన్‌లో ఇచ్చిన ధాన్యం విలువ రూ.4.15 కోట్లు; 2023-24 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రూ.5.41 కోట్లు.. మొత్తం రూ.9.56 కోట్లు ఉంటుందని తేల్చారు. మిల్లు యజమాని భూక్య నవీన్‌పై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసు నమోదు చేస్తామని పౌర సరఫరాల శాఖ అధికారులు చెప్పారు.

30న బీజేపీ రైతు దీక్ష: ఏలేటి

హైదరాబాద్, సెప్టెంబర్24 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రైతు హామీల సాధన పేరిట ఈనెల 30వ తేదీన రైతుదీక్ష నిర్వహించనున్నట్లు బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఇందిరాపార్కు వద్ద ఉన్న ధర్నాచౌక్‌లో 30న ఉదయం 11 గంటల నుంచి 24 గంటల పాటు దీక్ష కొనసాగుతుందని చెప్పారు. రైతులకు, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్న డిమాండ్‌తో నిర్వహించనున్న ఈ దీక్షలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో పాటు నాయకులంతా పాల్గొంటారని పేర్కొన్నారు.

సనాతన ధర్మం కోసం ప్రాణాలైనా ఇస్తా

» సనాతన ధర్మానికి హానిపై మౌనం సరికాదు

» లౌకికవాదం వన్‌వే కాదు టూ వే

» దానికి భంగం కలిగితే నిలదీస్తా:పవన్

విజయవాడ(వన్‌టౌన్), సెప్టెంబరు 24: సనాతన ధర్మానికి హాని కలిగితే ఎటువంటి పరిస్థితిలోనూ ఊరుకునేది లేదని, ప్రాణాలు ఇచ్చేందుకైనా తాను సిద్ధమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తెలిపారు. "చేతులెత్తి నమస్కరిస్తున్నా.. సనాతన ధర్మానికి హాని జరిగితే మౌనంగా ఉండటం మంచిది కాదు" అని రాష్ట్ర ప్రజలను ఉద్దేశించి అన్నారు. తిరుమలలో లడ్డూ కల్తీ వ్యవహారంలో వెంకటేశ్వరస్వామికి జరిగిన అపచారానికి క్షమాపణలు కోరుతూ ఆయన 11 రోజుల ప్రాయశ్చిత దీక్షను చేపట్టిన విషయం తెలిసిందే. అందులోభాగంగా మంగళవారం ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానం గుడి మెట్ల మార్గాన్ని నీళ్లు పోసి కడిగి శుభ్రం చేశారు. అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు. "తిరుమల లడ్డూ ప్రసాదానికి వినియోగించే నెయ్యి విషయంలో కల్తీ జరిగింది. ఈ విషయంపై హిందువులందరూ కలిసికట్టుగా మాట్లాడాలి. దీనిపై మౌనం మంచిది కాదు." అని పవన్ చెప్పారు. మాజీ అడ్వకేట్ జనరల్ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి మదమెక్కి మాట్లాడుతున్నారని పవన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నెయ్యికన్నా పందికొవ్వే ఖరీదైనదని, ఎవరైనా రాగిలో బంగారం కలుపుతారా అంటూ ఇష్టానుసారం మాట్లాడుతున్నారని మండిపడ్డారు.



కనకదుర్గమ్మ ఆలయం మెట్లకు పసుపు రాస్తున్న పవన్

ప్రకాశ్‌రాజ్, కార్తి గుర్తుంచుకోండి..

నటుడు ప్రకాశ్‌రాజ్ సున్నిత అంశాల విషయంలో తెలుసుకుని మాట్లాడాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ప్రకాశ్‌రాజ్ తనకు మంచి మిత్రుడని, అతనిపై ఎంతో గౌరవం ఉందని, అయితే సనాతన ధర్మ పవిత్రతకు భంగం కలిగినప్పుడు మాట్లాడటం కూడా తప్పే అని ప్రకాశ్ రాజ్ చెబితే ఎట్లా అని ప్రశ్నించారు. లడ్డూ విషయంలో జోకులు వేయడం సరికాదని తమిళ నటుడు కార్తిని ఉద్దేశించి అన్నారు. "సినీ ఫంక్షన్‌లో లడ్డూ సున్నిత అంశం అంటూ (కార్తి) సరదాగా మాట్లాడారు. అలా అనొద్దు. నేను నటులను గౌరవిస్తా. మీరు ఒకటికి వందసార్లు ఆలోచించుకుని మాట్లాడండి" అని అన్నారు.

సీఎంఆర్ చేయలేం

సన్న ధాన్యంతో 50-60 శాతమే బియ్యం

67 శాతం ఇవ్వాలంటే తీవ్రంగా నష్టపోతాం

ప్రభుత్వానికి నల్లగొండ జిల్లా రైస్ మిల్లర్స్ లేఖ

నల్లగొండ టౌన్, సెప్టెంబరు 24: వానాకాలం సీజన్ (2024-25)కు సంబంధించి కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) ప్రక్రియలో పాల్గొనలేమంటూ నల్లగొండ జిల్లా రైస్ మిలర్స్ అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. ఈ మేరకు అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి మంగళవారం లేఖ పంపారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ.. మిల్లర్లు ఎదుర్కొంటున్న వివిధ సమస్యల కారణంగా 2024-25 వానాకాలం సీజన్లో సీఎంఆర్ చేయలేమని 22న నిర్వహించిన జిల్లా సర్వసభ్య సమావేశంలో తీర్మానించినట్లు తెలిపారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్ల సమయంలో సన్నరకం ధాన్యానికి 17 శాతం తేమను నిర్ణయించి, సీఎంఆర్ డెలివరీ విషయంలో పాత విధానాన్నే (67 శాతం బియ్యం ప్రభుత్వానికి ఇవ్వాలి) అనుసరించడంతో తీవ్రంగా నష్టపోతున్నామని తెలిపారు. సన్న ధాన్యం ద్వారా 50-60 శాతం మాత్రమే బియ్యం వస్తాయని, కానీ, 67 శాతం ఇవ్వాలంటే తాము తీవ్రంగా నష్టపోతామని వివరించారు. ఖాళీ బస్తాలను ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోవడంతో స్థలాభావ సమస్యలను ఎదుర్కొంటున్నామని చెప్పారు. 2018-19 నుంచి ఇప్పటి వరకు ట్రాన్స్‌పోర్టు (ఎఫ్‌సీఐకి ఎగుమతి చేయడానికి), కస్టోడియన్ (ధాన్యం నిల్వ ఉంచినందుకు), డ్రైయేజ్ (తేమ శాతానికి) చార్జీలు చెల్లించలేదన్నారు. ఐదేళ్లుగా సుమారు రూ.100 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. సన్న ధాన్యానికి సీఎంఆర్‌పై విధానాన్ని ప్రకటించాలని డిమాండ్ చేశారు.

తెలంగాణలో రేవంత్ కుటుంబం దోపిడీ

కాంగ్రెస్‌కు ఓట్లెయ్యలేదనే పేదల ఇళ్ల కూల్చివేత.. కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుతున్నారు

» గాంధీకి కండువా కప్పిన సన్నాసి ఎవరు?

» చంద్రబాబు వారంలోనే పింఛన్లు పెంచారు

» పది నెలలైనా రేవంత్‌కు చేతనైతలేదు

» కాంగ్రెస్ సర్కారుపై కేటీఆర్ ధ్వజం

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబం దోచుకుంటోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి అయ్యప్ప సొసైటీలో ట్యాక్స్ వసూలు చేస్తున్నారని, కమీషన్లు, సెటిల్‌మెంట్ల దందా నడిపిస్తున్నారని అన్నారు. ఈ విషయాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ గతంలో తనతో చెప్పారని తెలిపారు. సీఎం, ఆయన బంధువులు చేస్తున్న దౌర్జన్యాలతో తెలంగాణలో రియల్ ఎస్టేట్ ఢమాల్ అయిందన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలతో కేటీఆర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ ప్రజలు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను గెలిపించారన్న కారణంతో వారిపై రేవంత్‌రెడ్డి సర్కారు పగబట్టినట్లుగా వ్యవహరిస్తోందన్నారు. హైడ్రా పేరుతో పేదల బతుకులను రోడ్డుపాలు చేస్తున్నారని మండిపడ్డారు. "హైడ్రాకు అందరూ సమానమని చెబుతూనే.. సీఎం రేవంత్‌రెడ్డి అన్న తిరుపతిరెడ్డికి మాత్రం ముందుగా నోటీసులిచ్చారు. పేదల ఇళ్లను మాత్రం పిల్లలు పుస్తకాలు తెచ్చుకోవడానికి కూడా సమయం ఇవ్వకుండా కూలుస్తున్నారు" అని కేటీఆర్ ధ్వజమెత్తారు. సీఎం రేవంత్‌రెడ్డికి దమ్ముంటే కాంగ్రెస్ నేతలు పట్నం మహేందర్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీల ఇళ్లను కూలగొట్టాలని సవాల్ విసిరారు. పేదల ఇళ్లను కూల్చివేస్తే బీఆర్ఎస్ ఊరుకోదని, బాధితులకు అండగా పోరాటం చేస్తామని ప్రకటించారు. "తెలంగాణ ఉన్నన్ని రోజులు కేసీఆర్ కనిపిస్తూనే ఉంటారు. ఆయన ఆనవాళ్లు చెరిపేయడం మీ వల్లకాదు చిట్టినాయుడా" అని వ్యాఖ్యానించారు.



ఆ ఎమ్మెల్యేల బతుకు బస్టాండే..

పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల బతుకు బస్టాండ్ అయిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. "మనం మనోడు కాదంటున్నాం. కాంగ్రెస్ వాళ్లూ మావాడు కాదంటున్నారు. దీంతో వాళ్లు ఎటూ కాకుండా పోయారు. వారి నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు వస్తాయి. ప్రజలు తగిన గుణపాఠం చెబుతారు" అని అన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కొట్టుకున్నారన్న మంత్రి శ్రీధర్‌బాబు.. శేరిలింగంపల్లి ఎమ్మెల్యేకు కండువా కప్పిన సన్నాసి, దౌర్భాగ్యుడు ఎవరో చెప్పాలన్నారు. వృద్ధులకు పింఛన్ పెంచుతామని ఇచ్చిన హామీని ఏపీలో సీఎం చంద్రబాబు అధికారం చేపట్టిన వారం రోజుల్లోనే అమలు చేశారని కేటీఆర్ తెలిపారు. ఇక్కడ రేవంత్‌కు మాత్రం చేతనైతలేదని విమర్శించారు. ఇక వైద్య విద్య ప్రవేశాలకు నిర్ణీత గడువు ముగుస్తోందని, ముఖ్యమంత్రి మొద్దునిద్ర వీడెదెప్పుడంటూ కేటీఆర్ 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. కాగా, బండి సంజయ్ కేంద్ర హోంశాఖ సహాయమంత్రిననే విషయాన్ని మరిచిపోయారంటూ కేటీఆర్ విమర్శించారు. అమృత్‌లో అవినీతి జరిగిందని ముందుగా చెప్పింది బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అని, కానీ.. ఆయన ఇప్పుడు దొంగపిల్లిలా కళ్లు మూసుకున్నారని వ్యాఖ్యానించారు. తాము మొత్తం ఆధారాలతో బయటపెట్టాక చిల్లర మాటలెందుకని, సీవీసీకి సిఫారసు చేయడమెందుకని ప్రశ్నించారు.

దిక్సూచి DIKSUCHI

తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం(ఎన్ఎస్‌కేటీయూ-సెంట్రల్ యూనివర్సిటీ)కి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో డిస్టెన్స్ కోర్సులు



సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సు

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. గరిష్ఠంగా ఏడాదిలో పూర్తిచేయాలి. సంస్కృత మాధ్యమంలో బోధన ఉంటుంది. **అర్హత:** దేవనాగరి లిపి రాయడం, చదవడం తెలిసి ఉండాలి. ఆగస్టు 15 నాటికి అభ్యర్థుల వయసు పదమూడేళ్లు నిండి ఉండాలి.

సంస్కృతంలో డిప్లొమా కోర్సు

కోర్సు వ్యవధి ఏడాది. గరిష్ఠంగా మూడేళ్లలో పూర్తిచేసే వీలుంది. ట్రెడిషనల్ సబ్జెక్టులను సంస్కృత మాధ్యమంలో, మోడరన్ సబ్జెక్టులను ఇంగ్లీష్ మాధ్యమంలో బోధిస్తారు. ఈ కోర్సు పూర్తిచేసినవారు సమ్మానిత శాస్త్రీ/బీఏ ప్రోగ్రామ్‌లో నేరుగా ప్రవేశం పొందవచ్చు. **అర్హత:** ఆర్ఎస్ విద్యాపీఠం/ఎన్ఎస్ యూనివర్సిటీ నుంచి సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసినవారు; న్యూఢిల్లీలోని ఆర్ఎస్ సంస్థానం నుంచి సంస్కృత ప్రథమ దీక్ష కోర్సు ఉత్తీర్ణులు; ప్రాక్ శాస్త్రీ/ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు పదహారేళ్లు నిండి ఉండాలి.

ప్రాక్ శాస్త్రీ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయవచ్చు. ఇది ఇంటర్ లెవెల్ ప్రోగ్రామ్. **అర్హత:** పదోతరగతి ఉత్తీర్ణులు; పూర్వ మాధ్యమ కోర్సు పూర్తిచేసిన వారు; శాన్‌స్క్రిట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో అర్హత సాధించినవారు; వేద భూషణ్ సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. పదోతరగతి స్థాయిలో సంస్కృతం ఒక సబ్జెక్టుగా చదివినవారికి, ఎన్ఎస్‌యూ నుంచి సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆఫ్ శాన్‌స్క్రిట్ పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి పదిహేనేళ్లు నిండి ఉండాలి.

బీఏ ఆనర్స్ శాంస్క్రిట్

ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తిచేయాలి. **అర్హత:** ఇంటర్/ప్రాక్ శాస్త్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో సంస్కృతం ఒక సబ్జెక్టుగా చదివినవారికి; ఎన్ఎస్‌యూ నుంచి సంస్కృతంలో సర్టిఫికెట్/డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారికి; ఇతర సంస్కృత సంబంధిత ప్రోగ్రామ్‌లు ఉత్తీర్ణులైనవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఆగస్టు 15 నాటికి వయసు పదిహేడేళ్లు నిండి ఉండాలి.

శాస్త్రీ ఆనర్స్ సాహిత్య, శాస్త్రీ ఆనర్స్ వ్యాకరణ

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తిచేయాలి. ఇవి డిగ్రీ లెవెల్ ప్రోగ్రామ్‌లు. **అర్హత:** ఇంటర్/ప్రాక్ శాస్త్రీ/ఉత్తర మాధ్యమ/మాధ్యమ/వరిష్ఠోపాధ్యాయ/ఉప శాస్త్రీ/సాహిత్య/వేద విభూషణ కోర్సులు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా ఇన్ సంస్కృతం/ విచక్షణ కోర్సు పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది. వయసు పదిహేడేళ్లు నిండి ఉండాలి.

పీజీ డిప్లొమా ఇన్ యోగ విజ్ఞాన

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాలి. ఇంగ్లీష్ లేదా సంస్కృత మాధ్యమంలో బోధన ఉంటుంది. **అర్హత:** ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 20 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.700
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 10
- **వెబ్‌సైట్:** https://nsktu.ac.in

ఆచార్య సాహిత్య, ఆచార్య పురాణేతిహాస, ఆచార్య ఫలిత జ్యోతిష, ఆచార్య ధర్మ శాస్త్ర

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాలి. సంస్కృత మాధ్యమంలో బోధన ఉంటుంది. ఇవి పీజీ లెవెల్ ప్రోగ్రామ్‌లు. **అర్హత:** మూడేళ్ల డిగ్రీ/శాస్త్రీ/బీఏ సంస్కృతం/శిరోమణి/మాధ్యమ/శాస్త్ర భూషణ/విద్యా ప్రవీణ/విద్యాలంకార /వేదాలంకార /విద్వత్ మాధ్యమ/బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్/బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 20 ఏళ్లు నిండి ఉండాలి. ఎన్ఈపీ 2020 నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్‌ల నుంచి వైదొలగే వీలుంది.

SCHOLARSHIP ALERT

SBIF Asha Scholarship Program 2024

Description: The SBIF Asha Scholarship Program 2024, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation. This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to school students from Class 6 to 12 and undergraduate & postgraduate students from the top 100 NIRF universities/colleges, undergraduate students from IITs, and students pursuing MBA/PGDM courses from IIMs. Applicants must have scored a minimum of 75% marks in the previous academic year. Their gross annual family income must be up to INR 6 lakh (Up to INR 3 lakh for Class 6-12 students).

Prizes & Rewards: * **Classes 6 to 12:** INR 15,000 each * **UG Students:** Up to INR 50,000. * **PG Students:** Up to INR 70,000. * **UG Students from IITs:** Up to INR 2,00,000 * **MBA Students from IIMs:** Up to INR 7,50,000

Last Date to Apply: 01-10-2024. **Application mode:** Online only

Short Url: www.b4s.in/aj/SBIFS7

Reliance Foundation PG Scholarships 2024-25

Description: The Reliance Foundation Postgraduate Scholarships aim to enable and propel India's future leaders who can think big, think green, and think digital for the benefit of society.

Eligibility: * Students who are enrolled in the first-year full-time regular postgraduate programmes pursuing select future-ready courses from Engineering, Technology, Energy and Life-Sciences


* Must have secured 550 to 1,000 in the GATE examination **OR**

* Must have scored 7.5 or above in their undergraduate CGPA (or % normalized to CGPA) [If students have not attempted GATE]

* Open for resident Indian citizens.

Prizes & Rewards: Up to INR 6,00,000 over the duration of the degree. **Last Date to Apply:** 06-10-2024. **Application mode:** Online applications only. **Short Url:** www.b4s.in/aj/RFS10

buddy4study.com



ఎన్టీఆర్‌తో నా జర్నీ ఎప్పుడూ స్పెషలే!

జూనియర్ ఎన్టీఆర్, జాన్వీ కపూర్ జంటగా నటించిన 'దేవర' చిత్రం ఈ శుక్రవారం విడుదల కానుంది. ఈ సందర్భంగా దర్శకుడు కొరటాల శివ ఆ సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను మీడియాకు తెలియజేశారు.



- మనిషికి మితిమీరిన ధైర్యం కూడా కరెక్ట్ కాదు. అది మూర్ఖత్వం అవుతుంది. మనకు తెలియకుండానే మనలో ఓ భయం ఉంటుంది. దాన్ని గౌరవించాలని చెప్పే కథ 'దేవర'. అయితే భయం లేకుండా ఉండాలనుకోవడం తప్పు. లా ఆఫ్ ల్యాండ్ అనేది ఉంటుంది కదా. దాన్ని అందరూ పాటించాలి. జవాబుదారీతనం కూడా ఒక భయమే. ఇలాంటి భయం ఉండడం వల్ల మనం చేసే పనిని చెక్ చేసుకుని మంచి రిజల్ట్ పొందుతాం.
- ఎన్టీఆర్‌తో జర్నీ ఎప్పుడూ నాకు స్పెషలే. ఏ విషయమైనా ఆయనతో డిస్కస్ చేసినప్పుడు బాగున్నా, బాగో లేకపోయినా డిప్లొమాటిక్‌గా సమాధానం చెప్పరు. ఓపెన్‌గా మనసులో ఉన్న భావాన్ని చెబుతారు. 'దేవర' లైన్ చెప్పినప్పుడు ఎన్టీఆర్ స్పందించిన తీరుతోనే నెక్ట్స్ లెవల్‌కు వెళ్లాలని నిర్ణయించుకున్నాం.
- 'దేవర' సినిమాను సెట్స్‌కు తీసుకెళ్లడానికి ఆరు నెలల సమయం తీసుకున్నాం. సముద్రం మీద ఎలా షూట్ చేయాలి, అక్కడ లైటింగ్ లో ఎలాంటి వేరియేషన్స్ ఉంటాయి. మనం సముద్రాన్ని ఎలా క్రియేట్ చేసుకోవాలి.. అనే అంశాలను బాగా స్టడీ చేశాం. దానికి ఎక్కువ సమయం పట్టింది. మన టెక్నీషియన్స్ గురించి ఎంత చెప్పినా తక్కువే. అద్భుతమైన టాలెంట్ ఉన్నవాళ్లు ఎలాంటి ప్రిపరేషన్ లేకుండా స్పాట్‌కు వెళ్లినా వర్క్ చేసెయ్యగలరు. హాలీవుడ్ టెక్నీషియన్లు అలా కాదు. వాళ్లు ప్రిపేర్ కాకపోతే భయపడిపోతారు. ప్రతి సన్నివేశాన్నీ రిహార్సల్స్ చేసుకుని వెళతారు. మనవాళ్లకు కూడా హాలీవుడ్ టెక్నీషియన్స్ తరహాలో ప్రిపరేషన్ టైమ్ ఇస్తే ఇంకా అద్భుతాలు చేస్తారు.
- ఆచార్య సినిమా ఆశించిన స్థాయిలో ఆడలేదు. అయితే దానికి ఒత్తిడేం పడలేదు. 'దేవర' చిత్రానికి ఇంకా బాగా ప్రిపేర్ అయ్యా. 'ఆచార్య' రిలీజ్ అయిన 20 రోజుల్లోనే దేవర సినిమా మోషన్ పోస్టర్ పనిలో నిమగ్నమయ్యా.
- ఇంత పెద్ద కథను మూడు గంటల లోపు చెప్పగలమా అని 'దేవర' సెకండ్ షెడ్యూల్ టైమ్‌లోనే అందరం అనుకున్నాం. ఎందుకంటే నేరేషన్ నాలుగు గంటలుంది. పేపర్ మీద పెట్టినప్పుడు అది ఆరేడు గంటలు వచ్చింది. అయినా రెండు పార్టులు వద్దనుకుని రివర్స్‌లో వెళ్లాం. కానీ కుదరదని తేలిపోయింది. దాంతో రెండు భాగాలుగా తీయాలని నిర్ణయించుకున్నాం.
- కథ రాసుకునేటప్పుడే దేవర, అతని కొడుకు వర పాత్రలకు ఎన్టీఆర్‌నే అనుకున్నా. మరో హీరో కోసం రాసుకున్న కథ కాదు. మనిషిలో భయం ఉండాలని నేను చెప్పే ప్రయత్నం చేశా. ఆ భయాన్ని జాన్వీకపూర్‌లో చూశా. వారం పది రోజుల ముందే సీన్ పేపరు కావాలని అడిగి నా దగ్గర తీసుకుని ప్రాక్టీస్ చేసి సెట్స్‌కు వచ్చేది. ఫస్ట్ డే షూటింగ్‌లో ఆమె పాల్గొన్న సీన్ పూర్తి కాగానే తారక్ 'ఫెంటాస్టిక్' అంటూ అభినందించారు.
- 'ఓంకార' సినిమా చూశాక భైర పాత్రకు సైఫ్ అలీఖాన్ సరిపోతాడని ఫీల్ అయ్యా. కానీ ఆయనలో నార్త్ లుక్ ఉంటుందేమోనని సందేహించా. లుక్ టెస్ట్ చేద్దామని చెప్పి స్కెచ్ వేసి పంపించా. ఆయనే ముందు నమ్మలేదు. షూటింగ్‌కు ఒక గంట ముందే వచ్చి ప్రిపేర్ అయ్యేవారు. 'భైర' ఎలా ఉండాలని నేను అనుకున్నానో సైఫ్ అలాగే ఉన్నారు.
- అనిరుధ్ మ్యూజిక్‌కు నేను హ్యాపీ. నా కాన్సెప్ట్‌ను అర్థం చేసుకుని మంచి సంగీతం ఇచ్చాడు. త్వరలోనే ఆయుధ పూజ సాంగ్ రిలీజ్ చేసే ఆలోచనలో ఉన్నాం.

పి.సుశీలకు 'కలైంజర్ స్మారక కళారంగ' పురస్కారం



తమిళనాడు ప్రభుత్వం మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకల సందర్భంగా చిత్రసీమ ప్రముఖులకిచ్చే 'కలైంజర్ స్మారక కళారంగ విద్వాంసుల అవార్డు'కు గానకోకిల పి.సుశీల ఎంపికయ్యారు. గత మూడేళ్లుగా డీఎంకే ప్రభుత్వం ఈ అవార్డులను సినీ, కళారంగాలకు, దశాబ్దాల తరబడి సేవలందిస్తున్న దిగ్గజాలకు ప్రదానం చేసి సత్కరిస్తోంది. ఆ మేరకు 2023వ సంవత్సరానికి గాను ఈ అవార్డుకు తమిళ సినీ గేయరచయిత సాహిత్య అకాడమీ గ్రహీత ఎం.మేత్తా, సినీ నేపథ్య గాయని పి.సుశీల ఎంపిక అయ్యారు. ప్రముఖ తమిళ సినీ దర్శకుడు ఎస్పీ ముత్తురామన్ నేతృత్వంలో నడిగర్ సంఘం అధ్యక్షుడు నాజర్, మరో దర్శకుడు కరుపళనియప్పన్ సభ్యులుగా ఉన్న ఎంపిక కమిటీ ఈ మేరకు మంగళవారం ప్రకటించింది. ఈ అవార్డు గ్రహీతలకు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ రూ.10లక్షల నగదు బహుమతి, ప్రశంసపత్రాన్ని అందజేయనున్నారు. ఈ నెల 30న చెన్నై సచివాలయంలో జరుగనున్న ప్రత్యేక కార్యక్రమంలో సినీ గేయరచయిత ఎం.మేత్తా, గాయని పి. సుశీల ఈ అవార్డులను అందుకోనున్నారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)



తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు వరద బాధితులను ఆదుకునేందుకు రూ. 15 లక్షల చెక్‌ను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి అందజేశారు. చాంబర్ అధ్యక్షుడు సునీల్ నారంగ్, ఉపాధ్యక్షుడు వీఎల్ శ్రీధర్ తదితరులు సీఎంను కలిశారు.

కోరుకున్నంత వినోదం ఉంటుంది



'ఈ సినిమా కథ వినగానే వివేక్ గారు 'అచ్చ తెలుగు సినిమాలా ఉంది. టైటిల్ ఏమనుకుంటున్నారు' అని అడిగారు 'శ్వాగ్' అని చెప్పగానే ఆయన ఆశ్చర్యపోయారు. వంశవృక్షం గురించి అందరికీ తెలిసిందే కదా దాన్ని గురించి సినిమాలో చెప్పాం' అన్నారు హసిత్ గోలి. శ్రీవిష్ణు హీరోగా ఆయన రూపొందించిన 'శ్వాగ్' చిత్రం అక్టోబర్ 4న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హసిత్ సినిమా గురించి వివరిస్తూ 'ఇందులో డిఫరెంట్ జనరేషన్స్ టచ్ చేశాం ఇది ఒక వంశానికి చెందిన కథ. ప్రతి జనరేషన్‌లో విష్ణు పాత్ర ఉంటుంది. తరతరాలుగా మగ, ఆడ గొడవ అనేది ఎలా మారుతూ వచ్చింది, ఇప్పటికి దాని రిలవెన్స్ ఏమిటనే ఆలోచనలో చేసిన కథ ఇది' అన్నారు. 'ఈ సినిమాలో పాత్రల పేర్లు రిథమిక్‌గా పెట్టాలని అనుకున్నాం. అందుకే భవభూతి లాంటి పేర్లు పాత్రలకు పెట్టాం. సినిమాలో నాలుగు పాత్రలకు సమాన ప్రాతినిధ్యం ఉంటుంది. ఆ నాలుగు పాత్రలు కలసి ఎలాంటి కథ చెప్పబోతున్నారన్నది ఆసక్తికరం. చాలా మంచి కథ ఇది. విష్ణు నుంచి కోరుకునే ఫన్ ఉంటుంది. ఇంటర్వెల్ బ్లాక్ ఆశ్చర్యపోయేలా ఉంటుంది. అలాగే రీతూ వర్మ వింధ్యామర వంశీ రాణిగా కనిపిస్తారు. అద్భుతంగా నటించారు. వంశవృక్ష నిలయం అనే ప్లేస్‌ని క్రియేట్ చేసి పెద్ద సెట్ వేశాం. అందరం ఒక ఛాలెంజ్‌గా తీసుకుని వర్క్ చేశాం. శ్రీవిష్ణు చాలా ఎనర్జిటిక్‌గా పెర్ఫార్మ్ చేశారు. నాలుగు పాత్రల్లో స్పష్టమైన వ్యత్యాసం కనిపించాలని 'భారతీయుడు' తదితర చిత్రాలకు పని చేసిన రషీద్‌గారు ప్రోస్థెటిక్స్ చేశారు' అని వివరించారు హసిత్.

సరికొత్త ప్రపంచంలోకి...



సుధీర్‌బాబు నటిస్తున్న సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'జటాధర'. ఈ పాన్ ఇండియా సినిమాను వెంకట్‌కల్యాణ్ దర్శకత్వంలో ప్రేరణ్ అరోరా, శివిన్ నారంగ్, నిఖిల్ నంద, ఉజ్వల్ ఆనంద్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి సెకండ్ పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఈ సందర్భంగా సుధీర్‌బాబు మాట్లాడుతూ "ఈ సినిమా మిమ్మల్ని ఓ సరికొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. విజువల్‌గా.. ఎమోషనల్‌గా అద్భుతంగా ఉంటుంది. ప్రస్తుతం ప్రీ ప్రొడక్షన్‌లో ఉన్న ఈ చిత్రం వచ్చే ఏడాది శివరాత్రికి విడుదలవుతుంది" అని చెప్పారు.

సిరిమల్లె చెట్టు లాంటి చిత్రం

- కార్తి



'దేవర' వార్‌ఫేర్ లాంటి సినిమా అయితే 'సత్యం సుందరం' సిరిమల్లె చెట్టు లాంటి అందమైన చిత్రం. ఈ రెండింటినీ తెలుగు ప్రేక్షకులు ఆదరించాలి' అని హీరో కార్తి కోరారు. ఆయన కథానాయకుడిగా ప్రేమ్‌కుమార్ దర్శకత్వం వహించిన చిత్రమిది. ఈ నెల 28న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. ఈ సందర్భంగా కార్తి మాట్లాడుతూ "అన్నయ్య సూర్యకూ ఈ కథ చాలా నచ్చింది. అరవింద్‌స్వామి కొత్తగా కనిపిస్తారు' అని హీరో కార్తి అన్నారు. ప్రేమ్‌కుమార్ మాట్లాడుతూ 'ప్రతి ఒక్కరి జీవితాలకు దగ్గరగా ఉండే చిత్రమిది. '96' చిత్రం లానే ఇది మీ మనసును చూరగొంటుంది' అన్నారు.



ఇరిగేషన్ శాఖలోకి
677 మంది ఏఈఈలు

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇరిగేషన్ శాఖలో కొత్తగా 677 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఏఈఈ)లు కొలువుల్లో చేరనున్నారు. వీరి ఎంపిక ప్రక్రియను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఇటీవలే పూర్తి చేసింది. ఏఈఈలుగా ఎంపికైన వారిలో 10 మంది ఐఐటీ పట్టభద్రులతో పాటు ఐఐటీల్లో పీజీ చేసిన 21 మంది, ఎన్ఐటీలో డిగ్రీ చేసిన 50 మందితో పాటు పీజీ చేసిన 33 మంది కలిపి మొత్తం 677 మంది నియామక పత్రాలను అందుకోనున్నారు. ఈ నెల 26న సాయంత్రం 5 గంటలకు జలసౌధ భవనంలో జరిగే కార్యక్రమంలో 677 మంది ఏఈఈలకు సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియామక పత్రాలు అందించనున్నారు. మరోవైపు కాలువలు, చెరువులను నిరంతరం పరిశీలించి, నీటి విడుదలతో పాటు వాటి పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలు చూడడానికి వీలుగా 1800 మంది లష్కర్ల నియామకాలపైనా సీఎం ప్రకటన చేయనున్నారు. లష్కర్లు లేకపోవడం వల్లే కాలువలు, చెరువులు భారీగా దెబ్బతిన్నాయని ప్రభుత్వం గుర్తించింది. దీంతో 1800 మంది లష్కర్లను గౌరవ వేతనంతో నియమించనున్నారు. కాగా, ఏఈఈలుగా ఎంపికైన అభ్యర్థులంతా ఈ నెల 26న సాయంత్రం 4 గంటలకు జలసౌధ కార్యాలయానికి చేరుకోవాలని ఈఎన్‌సీ జి.అనిల్‌కుమార్ కోరారు. ఇక ఎస్టీ కేటగిరీలో 50 మంది (లంబాడాలు) ఎంపికయ్యారు. వీరంతా కులధ్రువీకరణకు సంబంధించిన ప్రొఫార్మాను 26వ తేదీ సాయంత్రంలోగా సమర్పించాలని, అలా సమర్పించని అభ్యర్థులకు నియామక పత్రాలు ఇచ్చే ప్రసక్తే లేదని యన స్పష్టం చేశారు.

వైద్యవిద్య ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు వైద్యవిద్య ప్రవేశాల ప్రక్రియ మొదలైంది. ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా కౌన్సిలింగ్ కోసం దరఖాస్తు చేసుకున్న విద్యార్థుల ప్రొవిజినల్ మెరిట్ లిస్టును హెల్త్ యూనివర్సిటీ వీసీ కరుణాకర్ రెడ్డి మంగళవారం విడుదల చేశారు. బుధవారం సాయంత్రం వరకు విద్యార్థుల నుంచి అభ్యంతరాలను స్వీకరించి, గురువారం తుది మెరిట్ లిస్టును విడుదల చేస్తామని ఆయన తెలిపారు. అదే రోజు వెబ్ ఆప్షన్ల నమోదు ప్రక్రియ ప్రారంభమవుతుందన్నారు. గతేడాది సంబంధించిన కాలేజీల వారీ సీట్ల అలాట్‌మెంట్ వివరాలు యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. ఆ వివరాలను పరిశీలించి వెబ్ ఆప్షన్ల కోసం ముందే కాలేజీల జాబితాను సిద్ధం చేసుకోవాలని, తద్వారా ఆప్షన్ల నమోదు ప్రక్రియ సులభతరం అవుతుందని విద్యార్థులకు ఆయన సూచించారు.

గాంధీభవన్‌లో
నేటి నుంచి మంత్రులతో ముఖాముఖి

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గాంధీభవన్‌లో ప్రజలు, కాంగ్రెస్ కార్యకర్తలతో బుధవారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ముఖాముఖి నిర్వహిస్తారు. పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మహేశ్ కుమార్ గౌడ్.. తనతో పాటు వారంలో కనీసం రెండు రోజుల పాటు మంత్రులు కూడా అందుబాటులో ఉంటారని ప్రకటించిన నేపథ్యంలో మంత్రి దామోదరతో ముఖాముఖి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నారు. ప్రజా పాలన-ఇందిరమ్మ రాజ్యం నిర్మించే లక్ష్యంగా బుధవారం ఉదయం 11 నుంచి 2 గంటల వరకు ప్రజలు, కార్యకర్తలతో జరిగే ముఖాముఖిలో దామోదరతో పాటు టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, పార్టీ సీనియర్ నేతలు పాల్గొంటారని గాంధీభవన్ వర్గాలు పేర్కొన్నాయి. కాగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం మంగళవారం గాంధీభవన్‌లో పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

సర్కారు ఆస్పత్రుల్లో తీరు మారాలి

» అధికారులకు మంత్రి దామోదర ఆదేశాలు

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆస్పత్రుల్లో శానిటేషన్, సెక్యూరిటీ, పేషెంట్ కేర్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజ నర్సింహ అధికారులను ఆదేశించారు. శానిటేషన్, సెక్యూరిటీ విషయంలో ఎయిమ్స్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో అవలంబిస్తున్న విధానంపై అధ్యయనం చేయాలని, ఇందుకోసం నిపుణుల కమిటీని నియమించాలని ఆరోగ్య కార్యదర్శిని ఆదేశించారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్, సెక్యూరిటీ విభాగాల పనితీరు, హెచ్ఆర్, జాబ్ చార్ట్‌లను క్షుణ్ణంగా పరిశీలించి, పది రోజుల్లో కమిటీ తనకు నివేదిక అందజేయాలన్నారు. ఆరోగ్యశ్రీ కార్యాలయంలో మంత్రి దామోదర సమీక్ష నిర్వహించారు. డైట్, శానిటేషన్ సెక్యూరిటీ, పేషెంట్ కేర్ విభాగాల పనితీరు, సమస్యలపై చర్చించారు. ఆయా విభాగాల సిబ్బందికి బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేయాలని అన్నారు. ఆస్పత్రుల సూపరింటెండెంట్లతో పాటు, డీఎంఈ, డీహెచ్, వీవీపీ కమిషనర్లు.. తమ పరిధిలోని దవాఖానాల్లో పని చేస్తున్న వారి బయోమెట్రిక్ హాజరును పర్యవేక్షించాలని చెప్పారు. ఆస్పత్రుల లోపల ఇన్ పేషెంట్ వార్డ్స్, బయట ఔట్ పేషెంట్ ప్రాంతంలో రోగుల సంఖ్యకు తగినట్టుగా మరుగుదొడ్లు ఉండాలని మంత్రి సూచించారు.

హైడ్రాకు ముగ్గురు డిప్యూటీ ఈఈలు

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ విపత్తుల స్పందన, ఆస్తుల పరిరక్షణ సంస్థ(హైడ్రా)కు ముగ్గురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు(డిప్యూటీ ఈఈ)లను డిప్యూటేషన్‌పై పంపించాలని నీటిపారుదల శాఖ నిర్ణయించింది. తెలంగాణ నీటిపారుదల చట్టంలోని కొన్ని అధికారాలను హైడ్రాకు బదాయించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విష యం విదితమే. దాంతో హైడ్రాకు డిప్యూటేషన్‌పై వెళ్లదలుచుకున్న డీఈఈలు ఈ నెల 30వ తేదీలోగా సంబంధిత ఈఎన్‌సీ/సీఈలకు విజ్ఞప్తి చేసుకోవాలని ఈఎన్‌సీ(అడ్మిన్) జి.అనిల్‌కుమార్ సూచించారు.

మోదీని విమర్శించే స్థాయి రాహుల్‌కు లేదు

» దేశ వ్యతిరేక శక్తులతో రాహుల్ దోస్తీ: కిషన్ రెడ్డి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీని విమర్శించే స్థాయి కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీకి లేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కశ్మీర్ ఎన్నికల ప్రచారంలో భాగంగా మోదీపై రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలను కిషన్‌రెడ్డి ఖండించారు. దేశ, విదేశాల్లో భారత గౌరవాన్ని పెంచుతున్న మోదీపై విమర్శలు చేసే నైతిక హక్కు రాహుల్‌కు లేదన్నారు. మోదీపై 140 కోట్ల మంది ప్రజలకు విశ్వాసం ఉందని చెప్పారు. పార్లమెంటును, స్పీకర్ వ్యవస్థను, సుప్రీంకోర్టు, ఎన్నికల సంఘం వంటి రాజ్యాంగబద్ధ సంస్థలను అగౌరవపరచడం, భారత సైన్యం వంటి సున్నితమైన వ్యవస్థపై ప్రశ్నలను లేవనెత్తడం, వ్యతిరేక శక్తులతో దోస్తీ చేయడం, ఓట్లకోసం కుల మతాల మధ్య విభేదాలు సృష్టించడం రాహుల్‌కు నిత్యకృత్యమైందన్నారు. 2019 ఎన్నికల్లో ఓటమి తర్వాత కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేసి, పారిపోయిన వ్యక్తి రాహుల్ అని.. ఇప్పుడాయన జమ్మూకశ్మీర్‌లో విజయంపై నమ్మకం లేక.. దేశ వ్యతిరేక శక్తులతో జతకట్టారని ఆరోపించారు.

పాలమూరు ప్రాజెక్టులపై సర్కారు ఫోకస్!

» నేడు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు ముగ్గురు మంత్రులు

హైదరాబాద్/నాగర్‌కర్నూల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో నీటి పారుదల ప్రాజెక్టులపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. బుధవారం నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుల బృందం జిల్లాలో సుడిగాలి పర్యటన చేయనుంది. పలు ప్రాజెక్టుల పనులను పరిశీలించి సమీక్ష నిర్వహించనుంది. ఈ పర్యటనలో మంత్రుల బృందం ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావును వెంట తీసుకెళుతుండటం గమనార్హం. ఉదయం వీరంతా హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో బయల్దేరి జడ్చర్లలోని ఉద్దండపూర్ రిజర్వాయర్‌కు చేరుకొని, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పనులను పరిశీలిస్తారు. ఆ తర్వాత గద్వాలలోని నల్ల సోమనాద్రి గట్టు ఎత్తిపోతల పథకంలోని గట్టు రిజర్వాయర్‌కు చేరుకొంటారు. ఈ ప్రాజెక్టు పనులపై అధికారులతో సమీక్ష తర్వాత అక్కడి నుంచి రాజీవ్ బీమా ఎత్తిపోతల పథకంలోని శంకర సముద్రం రిజర్వాయర్‌కు చేరుకొంటారు. ప్రాజెక్టు పనులను పరిశీలించిన తర్వాత, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టులోని నార్లాపూర్ రిజర్వాయర్ వద్దకు చేరుకొంటారు. అనంతరం ఇదే ప్రాజెక్టులోని, ఇటీవలే వరదలకు నీటమునిగిన వట్టెం పంపింగ్ హౌస్‌ను పరిశీలించనున్నారు.

దసరాకు మంత్రివర్గ విస్తరణ?

ఏఐసీసీ నుంచి ఎలాంటి ఆలస్యం లేదన్న ఖర్గే

» నలుగురి పేర్లు ఇప్పటికే ఖరారు
» మరో ఇద్దరి పేర్లపై కుదరని ఏకాభిప్రాయం
» సీఎం రేవంత్ వెళ్లి చర్చించాక తుది జాబితా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో దసరా నాటికి మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ విషయంలో ఏఐసీసీ వైపు నుంచి ఎలాంటి ఆలస్యం లేదని పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే చెప్పినట్లు తెలిసింది. మంత్రివర్గంలో మరో ఆరు ఖాళీలు ఉండగా.. నాలుగు పేర్లను తాము ఖరారు చేశామని, మరో రెండు పేర్ల విషయంలోనే ఏకాభిప్రాయం కుదరలేదని ఖర్గే సోమవారం తనను కలిసిన రాష్ట్ర కాంగ్రెస్ నేతలతో అన్నట్లు తెలిసింది. ఈ రెండు బెర్తుల కోసం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టివిక్రమార్క వేర్వేరు పేర్లను ప్రతిపాదించారని ఆయన చెప్పినట్లు సమాచారం. గతవారం ఈ ఇద్దరు నేతలు ఢిల్లీకి వచ్చి ఖర్గే, కేసీ వేణుగోపాల్‌ను కలిసి వెళ్లారు. అయితే హరియాణా, జమ్మూకశ్మీర్‌లో ఎన్నికల హడావిడి తగ్గాక అక్టోబరు మొదటి వారంలో సీఎం రేవంత్‌రెడ్డి వచ్చి చర్చలు జరుపుతారని, ఆ తర్వాత మంత్రివర్గ జాబితా ఖరారు కావచ్చని ఏఐసీసీ వర్గాలు భావిస్తున్నాయి. కాగా, మంత్రివర్గంలో నూతనంగా చేరేవారిలో.. ఎమ్మెల్యేలు గడ్డం వివేక్, మల్‌రెడ్డి రంగారెడ్డి, సుదర్శన్‌రెడ్డి, వాకిటి శ్రీహరి, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, బాలునాయక్, రాంచందర్‌నాయక్, ఎమ్మెల్సీ ఆమెర్ అలీఖాన్ తదితరుల పేర్లు చర్చల్లో ఉన్నాయి.

రేవంత్‌రెడ్డి.. కోర్టుకు రండి!

(మొదటిపేజీ తరువాయి)

హాజరు కాకపోవడంతో జడ్జి ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి సహా ఈ కేసులో నిందితులు విచారణకు ఎందుకు రావడం లేదని వారి తరఫు న్యాయవాదులను జడ్జి ప్రశ్నించారు. రేవంత్‌తో పాటు ఉదయ్ సింహ, వేం కృష్ణ కీర్తన్, సండ్ర వెంకటవీరయ్య, సెబాస్టియన్ వచ్చే నెల 16న కచ్చితంగా విచారణకు రావాలని సమన్లు జారీ చేశారు. 2015లో తెలంగాణ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అప్పటి నామినేటెడ్ ఆంగ్లో-ఇండియన్ ఎమ్మెల్యే స్టీఫెన్‌సన్‌కు రేవంత్ రూ.50 లక్షలు ఇవ్వబోయారనే అభియోగంపై తొలుత ఏసీబీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టింది. ఆ తర్వాత ఈ కేసులో ఈడీ కూడా దర్యాప్తు ప్రారంభించింది. ఈ కేసు విచారణను తెలంగాణ నుంచి మార్చాలంటూ మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తోసిపుచ్చిన సంగతి తెలిసిందే. అయితే ఈ కేసుకు సంబంధించిన అంశాలను సీఎం రేవంత్ రెడ్డికి నివేదించవద్దని తెలంగాణ ఏసీబీ డైరెక్టర్ జనరల్‌ను కోర్టు ఆదేశించింది.

మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూం ఇళ్లు

(మొదటిపేజీ తరువాయి)



పద్మశ్రీ మొగిలయ్యకు ఇంటిస్థలం పత్రాల్ని అందిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

రోడ్డున పడకూడదని, అర్హులందరికీ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కేటాయించాలని ఆదేశించారు. సీఎం రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్‌లోని తన నివాసంలో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్, హైదరాబాద్ మెట్రో రైలు అధికారులతో సమీక్ష నిర్వహించారు. మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి దానకిశోర్, మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, హెచ్ఎండీఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్, హైడ్రా కమిషనర్ రంగనాథ్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న చెరువులు, కుంటలు, నాలాలు ఆక్రమణలకు గురికాకుండా పర్యవేక్షణను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ఇందుకోసం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి, వాటిని కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేయాలని చెప్పారు. ఓఆర్ఆర్ లోపల ఉన్న అన్ని చెరువులు, కుంటలు, నాలాలను గుర్తించి వాటి ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లను గుర్తించాలని ఆదేశించారు. వీలైనంత త్వరగా వీటికి సంబంధించిన నివేదికను తయారుచేయాలన్నారు. ప్రతి ఆక్రమణలో అర్హులైన పేదలకు విధిగా పరిహారం అందేలా ప్రణాళిక రూపొందించాలని చెప్పారు.

మెట్రో విస్తరణపై డీపీఆర్ రెడీ చేయండి

శంషాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి ఫ్యూచర్ సిటీకి వేయాల్సిన మెట్రో మార్గానికి సంబంధించిన నివేదికను రూపొందించాలని అధికారులను సీఎం రేవంత్ ఆదేశించారు. ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పనులను వేగంగా చేపట్టాలన్నారు. మెట్రో మార్గాలకు సంబంధించిన భూసేకరణపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎల్బీ నగర్ నుంచి హయత్ నగర్, ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్టతో పాటు ఇతర ప్రాంతాలకు మెట్రో విస్తరణపై అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. దసరాలోపు మెట్రో విస్తరణ రూట్‌కు సంబంధించి పూర్తిస్థాయి డీపీఆర్‌ను సిద్ధం చేసి కేంద్రానికి సమర్పించాలని సీఎం ఆదేశించారు.

మొగిలయ్యకు ఇంటిస్థలం పత్రాలు

ప్రముఖ కిన్నెర వాయిద్యకారుడు పద్మశ్రీ దర్శనం మొగిలయ్యకు ఇంటిస్థలం పత్రాల్ని సీఎం రేవంత్‌రెడ్డి అందజేశారు. మొగిలయ్యకు హయత్‌నగర్‌లో 600 చ.గజాల స్థలాన్ని ప్రభుత్వం కేటాయించింది. అందుకు సంబంధించిన పత్రాల్ని ఎమ్మెల్యే వంశీకృష్ణతో కలిసి సీఎం మంగళవారం అందజేశారు. స్థల పత్రాలు అందజేయడం పట్ల సీఎంకు మొగిలయ్య కృతజ్ఞతలు తెలిపారు.



అక్టోబరు 9న సింగరేణి కార్మికులకు బోనస్

వచ్చేనెల పండుగ అడ్వాన్స్ 25 వేలు చెల్లింపు

కాంట్రాక్ట్ కార్మికుల బోనస్‌పై విధివిధానాలు

అధికారులకు సీఎండీ బలరామ్ ఆదేశాలు

హైదరాబాద్, కొత్తగూడెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు ఇటీవలే ప్రకటించిన లాభాల బోనస్‌లో 33% వాటాను వచ్చే అక్టోబరు 9న చెల్లించడానికి యాజమాన్యం ఏర్పాట్లు చేస్తోంది. దీనిపై మంగళవారం అమెరికా నుంచి ఆ సంస్థ సీఎండీ ఎన్.బలరామ్ వర్చువల్ విధానంలో సమీక్ష చేశారు. సంస్థలో పనిచేస్తున్న సుమారు 42 వేల మంది అధికారులు, కార్మికులకు ఈ లాభాల వాటాను పంపిణీ చేయనున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో వారు పనిచేసిన పని దినాల సంఖ్యను పరిగణనలోకి తీసుకొని బోనస్ చెల్లిస్తారు. సగటున ఒక్కొక్కరికీ రూ.1.90 లక్షల దాకా చేతికి అందనుంది. తొలిసారిగా దాదాపు 25 వేల మంది కాంట్రాక్టు ఉద్యోగులకూ లాభాల వాటా బోనస్ చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన నేపథ్యంలో అందుకు అనుగుణంగా విధి విధానాలను రూపొందించాలని సీఎండీ ఆదేశించారు. ఈ ఏడాది కూడా దసరా పండుగ అడ్వాన్స్‌ను సింగరేణి ఉద్యోగులకు చెల్లించాలని సీఎండీ ఆదేశించారు. దీంతో ఒక్కొక్కరికి రూ. 25 వేల పండుగ అడ్వాన్స్ చెల్లించనున్నారు. కాగా, సింగరేణికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వంలో అద్భుతమైన ఫలితాలు వచ్చాయని కనీస వేతన చట్టం బోర్డు చైర్మన్ జనక్‌ప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలు కేటీఆర్, హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బోనస్ కాదు బోగస్ ప్రభుత్వం అనడంపై మండిపడ్డారు.

మినీ డిగ్రీ ప్రోగ్రాం నేడు ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్, డిగ్రీ విద్యార్థులకు బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా(బీఎఫ్ఎస్ఐ) రంగాల్లో ఉద్యోగావకాశాలు కల్పించేలా 'మినీ డిగ్రీ ప్రోగ్రాం' బుధవారం ప్రారంభం కానుంది. సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ-పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు బుధవారం మాసాబ్‌ట్యాంక్‌లోని జేఎన్ఏఎఫ్‌యూ ఆడిటోరియంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఉన్నత విద్యామండలి గుర్తించిన 18 ఇంజనీరింగ్ కాలేజీలు, 20 డిగ్రీ కాలేజీల్లో చదువుతున్న 10వేల మంది విద్యార్థులకు ఈ శిక్షణను అందిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు మేలు జరిగేలా కాలేజీల ఎంపిక జరిగిందని ఉన్నత విద్యామండలి అధికారులు వివరించారు. శిక్షణ పొందే విద్యార్థుల కోసం ప్రత్యేక పోర్టల్‌ను రూపొందిస్తామన్నారు. అందులో విద్యార్థుల వివరాలు ఉంటాయి. వారి బయోడేటా, చదువుతున్న కాలేజీ, విద్యార్హతలు, సాంకేతిక కోర్సుల్లో శిక్షణ వంటి వివరాలతో ప్రొఫైల్స్‌ను ఏర్పాటు చేస్తారు. బీఎఫ్ఎస్ఐ రంగాల్లో పేరొందిన కంపెనీలు.. తమకు కావాల్సిన ఉద్యోగులను ఎంపిక చేసుకోవడానికి ఈ పోర్టల్‌ను వారధిగా చేసుకుంటాయి. అంటే.. క్యాంపస్ సెలెక్షన్ల మాదిరిగానే.. ఈ పోర్టల్ ద్వారా కంపెనీలు నియామకాలను చేపడతాయి. తమకు కావాల్సిన ప్రమాణాల మేరకు విద్యార్థులను ఎంపిక చేసుకుని, వర్చువల్‌గా ఇంటర్వ్యూ చేసే వీలుంటుంది. ఈ కార్యక్రమం వల్ల డిగ్రీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు ఉద్యోగ భరోసా కల్పించవచ్చని ప్రభుత్వం భావిస్తోంది. 'మినీ డిగ్రీ ప్రోగ్రాం'ను అందించే కాలేజీల వివరాలను మంగళవారం ప్రకటించారు.

రెండు రాష్ట్రాల 'గట్టు'

» గట్టు ప్రాజెక్టు నుంచి రాయచూరుకూ నీళ్లు
» ప్రాజెక్టు సామర్థ్యం 15 టీఎంసీలకు పెంపు
» కర్ణాటకలో 95వేలు.. తెలంగాణలో 33వేల ఎకరాలకు నీళ్లు
» బదులుగా ఏప్రిల్, మే నెలల్లో ఆల్మట్టి నుంచి జూరాలకు 15 టీఎంసీలు
» రెండు రాష్ట్రాల మంత్రుల నిర్ణయం

మహబూబ్‌నగర్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): తెలంగాణ, కర్ణాటక మధ్య అంతర్రాష్ట్ర ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి అడుగులు పడుతున్నాయి. రెండు రాష్ట్రాల్లో ఒకే పార్టీ ప్రభుత్వంలో ఉండటంతో ఈ మధ్య కాలంలోనే ఆ ప్రాజెక్టును పూర్తి చేయడం ద్వారా తెలంగాణ, కర్ణాటకలో సాగు నీటి వసతి లేని గట్టు, రాయచూరు ప్రాంతాలకు నీళ్లు ఇవ్వొచ్చనే సంకల్పంతో ఇప్పటికే ఇరు రాష్ట్రాల మంత్రులు సమావేశమై సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకున్నారు. ఇందులో భాగంగా జూరాల రిజర్వాయర్ నుంచి 3.2 కిలోమీటర్ల మేర అప్రోచ్ కెనాల్ నిర్మించి మాల్‌దొడ్డి వద్ద లిఫ్ట్ ఏర్పాటు చేస్తారు. ఇక్కడ నాలుగు పంపులతో, 14.5 కిలోమీటర్ల ప్రెషర్ మెయిన్స్(పైపు లైన్లు) ద్వారా 90 రోజుల పాటు జూరాల బ్యాక్ వాటర్‌ను గట్టు ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తారు. ఇందుకోసం గట్టు ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యాన్ని ప్రస్తుతమున్న 1.3 టీఎంసీల నుంచి 15 టీఎంసీలకు పెంచుతారు. అక్కడి నుంచి గ్రావిటీ ద్వారా తెలంగాణలోని 33 వేల ఎకరాలు, కర్ణాటకలో 95 వేల ఎకరాల ఆయకట్టు మొత్తం కలిపి 1.28 లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరందిస్తారు. ఇందుకోసం 45.97 కిలో మీటర్ల మేర గ్రావిటీ కెనాళ్లను నిర్మిస్తారు. ప్రాజెక్టు అంచనా వ్యయం సుమారు రూ.2 వేల కోట్లు అవుతుందని అంచనా వేస్తుండగా ఈ వ్యయాన్ని ఉమ్మడిగా భరించాలా.. లేక నిర్వహణ ఉమ్మడిగా చేయాలా.. అనే విషయాలపై ఇంకా స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో బుధవారం ఉత్తమ్ నేతృత్వంలో ముగ్గురు మంత్రుల బృందం గట్టు ప్రాజెక్టును సందర్శించనుండటం ప్రాధాన్యం సంతరించుకొంది.

ప్రస్తుతం గట్టు సామర్థ్యం 1.3 టీఎంసీలే

నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలోని ర్యాలంపాడు రిజర్వాయర్ నుంచి నీటిని లిఫ్ట్ చేయడానికి గత ప్రభుత్వ హయాంలో రూ.553 కోట్లతో 1.3 టీఎంసీల సామర్థ్యంతో గట్టు ప్రాజెక్టును ప్రారంభించారు. ప్రస్తుతం లిఫ్టు పనులు జరుగుతున్నాయి. అయితే కర్ణాటకలోని ఆల్మట్టి ప్రాజెక్టు ఎత్తు పెంచితే జూరాలకు వచ్చే నీటిపై ప్రభావం పడనుంది. దీంతో, అటు జూరాలకు ఇబ్బంది కాకుండా, గట్టు ప్రాజెక్టు కింద ఆయకట్టు దెబ్బతినకుండా ఈ అంతర్రాష్ట్ర ప్రాజెక్టును ప్రతిపాదించారు. ఇది పట్టాలెక్కితే.. కర్ణాటకకు ఎక్కువ ఆయకట్టు వస్తున్నందున ఎండాకాలమైన ఏప్రిల్, మే నెలల్లో కర్ణాటకలోని ఆల్మట్టి రిజర్వాయర్ నుంచి 15 టీఎంసీల నీటిని జూరాలకు విడుదల చేయాల్సి ఉంటుంది. ఇది ఉమ్మడి పాలమూరు జిల్లాకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది.

ఎడమ కాల్వ గండ్ల పాపం గత ప్రభుత్వానిదే

» పదేళ్ల నిర్లక్ష్యం ఫలితంగానే రైతులకు భారీ నష్టం: ఉత్తమ్
» ఖమ్మం జిల్లాలో కాల్వ పనులు పరిశీలించిన మంత్రి పొంగులేటి



సాగర్ ఎడమకాల్వలో నీటిప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి



సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమకాల్వ గండి మరమ్మతు పనులను పరిశీలిస్తున్న మంత్రి ఉత్తమ్

సూర్యాపేట, కూసుమంచి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ఎడమ కాల్వ గండ్లకు గత ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం వద్ద సాగర్ ఎడమ కాల్వ గండ్ల మరమ్మతు పనులను కోదాడ ఎమ్మెల్యే పద్మావతితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాల్వలకు, చెరువులకు గండ్లు గత పదేళ్ల ప్రభుత్వ పాలన నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆరోపించారు. నీటిపారుదల శాఖను బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేయడమే కాకుండా నిందలు మోపడం సరైంది కాదన్నారు. వరదలపై రాజకీయ బురద చల్లొద్దని హితవుపలికారు. లష్కర్లు సహా ఇంజనీర్ల నియామకాలు చేపట్టి ఉంటే ఇలాంటి ఘటనలు జరిగేవి కావన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే 700 మంది ఏఈఈలను నియమించిన విషయాన్ని గుర్తు చేశారు. త్వరలో 1800 మంది లష్కర్ల నియామకాలు చేస్తామన్నారు. 50 ఏళ్ల అనంతరం జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్‌లో అతిపెద్ద విపత్తు సంభవించిందన్నారు. వెంటనే నష్ట నివారణ చర్యలు చేపట్టామని తెలిపారు. జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో పంట పొలాల్లో చేరిన నీటిని తొలగించేందుకు ఆదేశాలు ఇచ్చామన్నారు. కాగా ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో పాలేరు నుంచి వెళ్లే సాగర్ ఎడమకాల్వ గండ్ల మరమ్మతులు పూర్తయ్యాయి. 23 రోజుల తర్వాత ఇరిగేషన్ అధికారులు గండి పూడ్చివేత పనులు పూర్తిచేశారు. దీంతో మంగళవారం తెల్లవారుజామున జిల్లాలోని సాగర్ రెండోజోన్ ఆయకట్టుకు నీరు విడుదల చేశారు. మొదట 500 క్యూసెక్కులు వదిలిన అధికారులు క్రమేపీ నీటివిడుదల 2000 కూసెక్కులకు పెంచారు. ఎడమకాల్వకు నీరు విడుదల చేయడంతో పాలేరు జలాశయం వద్ద నీటి ప్రవాహాన్ని మంత్రి పొంగులేటి పరిశీలించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులను వివరాలను అడిగి తెలుసుకున్నారు. నీటి విడుదలను పెంచాలని ఆదేశించారు. మరమ్మతులు చేసినచోట కాల్వకట్ట ఎత్తు తక్కువగా ఉండటంతో నీటి విడుదల పెంచిన పక్షంలో మళ్లీ ఇబ్బందులు తలెత్తుతాయని, వెంటనే కట్ట ఎత్తు పెంచాలని మంత్రి ఆదేశించారు.

నేడు సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదల

సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురం సమీపంలో నాగార్జునసాగర్ ఎడమకాల్వకు ఈ నెల 1వ తేదీన గండి పడటంతో మరమ్మతుల కోసం ప్రభుత్వం రూ.2.10కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో సాగర్ ఎడమకాల్వకు నీటి విడుదలను నిలిపివేసి గండి పూడ్చివేత పనులు నిర్వహిస్తుండగా, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పనులను పర్యవేక్షిస్తున్నారు. మంగళవారం సాయంత్రానికి మరమ్మతు పనులు పూర్తయ్యాయి. బుధవారం సాగర్ ఎడమకాల్వకు నీటిని విడుదల చేయనున్నట్లు మంత్రి ఉత్తమ్ తెలిపారు.

ఆ 3 రాష్ట్ర రోడ్లను హైవేలు చెయ్యండి

వికారాబాద్‌లో రహదారుల అభివృద్ధికి నిధులివ్వండి.. కేంద్ర మంత్రి గడ్కరీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ విజ్ఞప్తి

» ఎన్‌హెచ్ 63 విస్తరణకు 100 కోట్లు మంజూరు: ఎమ్మెల్యే వివేక్

వికారాబాద్, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): వికారాబాద్ నియోజకవర్గం మీదుగా వెళ్లే మూడు 'రాష్ట్ర రహదారులను' జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కేంద్ర రోడ్డు రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీని కోరారు. అలాగే, వికారాబాద్ నియోజకవర్గంలోని మరో ఏడు రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు కేంద్ర మంత్రిని ఢిల్లీలో మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. కోకాపేట్ ఓఆర్ఆర్ జంక్షన్-శంకర్‌పల్లి-మోమిన్‌పేట్-మర్పల్లి-బుదేరా రోడ్డు, తాండూరు-పెద్దేముల్-కోట్‌పల్లి-మోమిన్‌పేట్-సదాశివపేట రోడ్డు, వికారాబాద్-మోమిన్‌పేట్ రోడ్లను హైవేలుగా అభివృద్ధి చేయాలని విన్నవించారు. అలాగే, సెంట్రల్ రోడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్స్ పథకం(సీఆర్ఐఎఫ్) కింద తాండూరు-ధారూరు రోడ్డుకు రూ.45 కోట్లు, కొత్తగడి-బంట్వారం రోడ్డుకు రూ.50 కోట్లు, కేసారం-తొరమామిడి రోడ్డుకు రూ.60కోట్లు, వికారాబాద్- ధారూరు రైల్వేస్టేషన్ రోడ్డుకు రూ.55 కోట్లు, బషీరాబాద్-మైల్వార్ రోడ్డుకు రూ.35 కోట్లు, మారేపల్లి-మదనాంతపూర్ రోడ్డుకు రూ.40 కోట్లు, పీడబ్ల్యూడీ రోడ్డు-రాంపల్లి-బంట్వారం రోడ్డుకు రూ.30 కోట్లు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. కాగా, ఎన్‌హెచ్- 63 విస్తరణ, కొత్త రహదారి నిర్మాణానికి కేంద్ర ఉపరితల రవాణా శాఖ రూ. 100 కోట్లు మంజూరు చేసిందని పెద్దపల్లి ఎంపీ వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి తెలిపారు. కేంద్ర మంత్రి గడ్కరీని కలిసిన అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. మరోపక్క, ఢిల్లీ పర్యటనలో ఉన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.



కేంద్రమంత్రి గడ్కరీకి వినతిపత్రం ఇస్తున్న స్పీకర్ ప్రసాద్

సుస్థిరాభివృద్ధిలో తెలంగాణ దేశానికే ఆదర్శం

న్యూఢిల్లీ, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సుస్థిరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా ఉంటున్నాయని అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అన్నారు. లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా అధ్యక్షతన న్యూఢిల్లీలో మంగళవారం జరిగిన పదో కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ఇండియా రీజియన్ సదస్సులో 'సుస్థిరాభివృద్ధిలో శాసన వ్యవస్థల పాత్ర' అంశంపై గడ్డం ప్రసాద్ ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుస్థిరమైన అభివృద్ధి కోసం తెలంగాణ శాసనసభ రూపొందించిన చట్టాలే వివిధ రంగాల్లో రాష్ట్రాన్ని జాతీయ స్థాయిలో అగ్రస్థానంలో నిలబెట్టాయని తెలిపారు. ప్రజలకిచ్చిన ఆరు గ్యారంటీలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేయడం రాష్ట్రంలో అన్ని వర్గాల సాధికారతకు ఉపయోగపడిందని పేర్కొన్నారు.

కారుకు గీతలు గీశారని.. 8 మంది చిన్నారులపై కేసు

- పసిపిల్లలపై కానిస్టేబుల్ పతార
- అంతా 2 నుంచి 9 ఏళ్లలోపు వారే
- రిపేరుకు డబ్బులిస్తామన్నా ససేమిరా
- సుబేదారి పోలీసుల తీరుపై విమర్శలు

వరంగల్ క్రైం, సెప్టెంబరు 24: కారుకు గీతలు గీశారని.. పసి పిల్లల పట్ల ఓ కానిస్టేబుల్ కర్కశంగా ప్రవర్తించాడు. 2 నుంచి 9 ఏళ్ల ఉన్న చిన్నారులపై పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టాడు. వెనకాముందూ ఆలోచించకుండా పోలీసులూ ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దీనిపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీఐడీ విభాగంలో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్.. హనుమకొండ రాంనగర్‌లోని ఒక అపార్ట్‌మెంట్‌లో నివాసం ఉంటున్నాడు. జూలై 7న అపార్ట్‌మెంట్ పార్కింగ్ స్థలంలో చిన్నారులు ఆడుకుంటుండగా కానిస్టేబుల్ కారుపై గీతలు పడ్డాయి. ఈ విషయాన్ని కానిస్టేబుల్ పిల్లలు అయన దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తన కారుకు గీతలు పెట్టారని ఆ కానిస్టేబుల్.. చిన్నారులపై పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కారు మరమ్మతుకు డబ్బులు చెల్లిస్తామని ఆ పిల్లల తల్లిదండ్రులు చెప్పినా.. వినలేదు. ఆగస్టు 5న 8 మంది చిన్నారులపై సుబేదారి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. వారు కేసు నమోదు చేశారు. చిన్నారులంతా రెండు నుంచి తొమ్మిదేళ్లలోపు వయసు వారే. నెలన్నర క్రితమే ఈ కేసు పెట్టినా.. ఆ విషయం ఎవరికీ తెలియదు. ఇటీవల పిల్లల తల్లిదండ్రులను పోలీసు స్టేషన్‌కు పిలవడంతో.. కేసు నమోదైన విషయం తెలిసింది. కానిస్టేబుల్ తన పరపతిని ఉపయోగించి నమోదు చేయించిన కేసు.. తమ పిల్లల భవిష్యత్‌పై ప్రభావం చూపే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. తెలిసీ తెలియని వయసులో పిల్లలు చేసిన దానికి పోలీసులు ఇంత రాద్ధాంతం చేయడం ఏంటని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కేసు నమోదైన విషయాన్ని సుబేదారి పోలీస్‌స్టేషన్ సీఐ సత్యనారాయణరెడ్డి ధ్రువీకరించారు.

యూట్యూబర్ హర్షసాయిపై కేసు

- పెళ్లి పేరుతో అత్యాచారం చేశాడని.. రూ.2కోట్లు తీసుకున్నాడంటూ యువతి ఫిర్యాదు



నార్సింగ్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ యూట్యూబర్ హర్షసాయిపై కేసు నమోదైంది. పెళ్లి పేరుతో అత్యాచారం చేశాడంటూ హర్షసాయిపై ఓ యువతి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు నార్సింగ్ పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. పెళ్లి చేసుకుంటానని నమ్మించి.. హర్ష, అతడి తండ్రి రాధాకృష్ణ తన వద్ద నుంచి రూ. 2 కోట్లు తీసుకున్నారని ఫిర్యాదులో యువతి పేర్కొంది. హర్షసాయితో పాటు ఆయన తండ్రి రాధాకృష్ణపై కూడా కేసు నమోదు చేశారు. బాధిత యువతి హర్షసాయితో కలిసి ఓ సినిమా కూడా నిర్మించినట్లు సమాచారం. ఆమెకు సొంత ప్రొడక్షన్ కూడా ఉంది. శ్రీ పిక్చర్స్ బ్యానర్‌లో హర్షసాయి హీరోగా మెగా అనే మూవీని ఆమె నిర్మించారట. బాధిత యువతి.. బిగ్ బాస్ ఓటీటీ కంటెస్టెంట్‌గా చేశారు.

శంషాబాద్ నుంచి 6 ప్రాంతాలకు కొత్త సర్వీసులు

- అగర్తలా, జమ్మూ, ఆగ్రా, కాన్పూర్, అయోధ్య, ప్రయాగ్ రాజ్‌లకు డైరెక్ట్ సర్వీసులను ప్రారంభించిన ఇండిగో

శంషాబాద్ రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఇండిగో ఎయిర్‌లైన్స్ మరో 6 ప్రాంతాలకు డొమెస్టిక్ విమాన సర్వీసులను ప్రారంభించింది. అగర్తలా, జమ్మూ, ఆగ్రా, కాన్పూర్, అయోధ్య, ప్రయాగ్‌రాజ్‌లకు డైరెక్ట్ సర్వీసులను ప్రారంభించినట్లు జీఎంఆర్ ఎయిర్‌పోర్టు సీఈవో ప్రదీప్ ఫణీకర్ తెలిపారు. దేశంలో ప్రముఖ ప్రాంతాలకు విమాన కనెక్టివిటీని పెంచుకోవడమే జీఎంఆర్ ఎయిర్‌పోర్టు లక్ష్యమని సీఈవో ప్రదీప్ ఫణీకర్ పేర్కొన్నారు. మరోవైపు మంగళవారం ఉదయం 6.12 గంటలకు 66 మంది ప్రయాణికులతో హైదరాబాద్ నుంచి తిరుపతి బయలుదేరిన అలయన్స్ ఎయిర్‌లైన్స్ (91877) విమానంలో సాంకేతిక లోపం తలెత్తింది. విమానం ఏపీలోని కడప సమీపంలో గల ఒంటిమిట్ట వద్దకు చేరుకోగానే ఇంజన్‌లో సాంకేతిక లోపం తలెత్తినట్లు పైలెట్లు గుర్తించి వెంటనే ఏటీసీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు అత్యవసర ల్యాండింగ్‌కు అనుమతి ఇవ్వడంతో విమానం తిరిగి ఉదయం 8.17 గంటలకు సురక్షితంగా శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండయింది. దాంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు.

కొనసాగుతున్న 'రెడ్‌కార్నర్' ప్రక్రియ: డీజీపీ

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో విదేశాల్లో తలదాచుకున్న నిందితులను పట్టుకునేందుకు రెడ్ కార్నర్ నోటీస్ జారీ ప్రక్రియ కొనసాగుతోందని డీజీపీ డాక్టర్ జితేందర్ తెలిపారు. తెలంగాణలో మావోయిస్టు కదలికలు లేవని, ఉగ్రవాదులపై నిరంతర నిఘా కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇటీవలి గణేశ్ ఉత్సవాలు, మిలాద్-ఉన్-నబీ ప్రశాంతంగా ముగియడంతో మంగళవారం ఆయన తన కార్యాలయంలో అదనపు డీజీపీ(శాంతిభద్రతలు) మహేశ్ భగవత్, ఇతర ముఖ్య అధికారులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. వినాయక నవరాత్రులు, మిలాద్-ఉన్-నబీ సందర్భంగా హైదరాబాద్ సహా.. రాష్ట్రంలో ఎక్కడా చిన్న సంఘటనకు కూడా ఆస్కారం లేకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారని వివరించారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో విదేశాల్లో ఉన్న నిందితులను రప్పించేందుకు రెడ్‌కార్నర్ నోటీసు ప్రక్రియ కొనసాగుతోందన్నారు. జైనూర్ ఘటనలో 38 మందిని అరెస్టు చేసినట్లు తెలిపారు.



డీజీపీకి ఆహ్వానపత్రికను అందజేస్తున్న జోగులాంబ ఆలయ సిబ్బంది

జోగులాంబ శరన్నవరాత్రి ఉత్సవాలకు డీజీపీకి ఆహ్వానం

శక్తిపీఠమైన అలంపూర్ జోగులాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయంలో జరిగే దసరా శరన్నవరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరు కావాల్సిందిగా డీజీపీ జితేందర్‌కు ఆహ్వానం అందింది. ఆలయ ఈవో పురేందర్ కుమార్, ప్రధాన అర్చకుడు ఆనంద్ శర్మ మంగళవారం డీజీపీని ఆయన కార్యాలయంలో కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. అక్టోబరు 3 నుంచి 12 వరకు జరిగే బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. అదనపు డీజీపీ(శాంతి,భద్రతలు) మహేష్ భగవత్, ఐజీ రమేష్‌లను సైతం వారు ఆహ్వానించారు

15 లక్షల రేషన్‌కార్డుల రద్దు?

కార్డుదారులు ఈ-కేవైసీకి హాజరుకానందునే.. వారందరినీ అనర్హులుగా గుర్తించిన ప్రభుత్వం!

హైదరాబాద్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న తెల్ల రేషన్‌కార్డుల్లో సుమారు 15 లక్షల కార్డులు రద్దయ్యే అవకాశాలున్నాయి. కార్డుదారులను గుర్తించేందుకు చేపట్టిన ఈ-కేవైసీ ప్రక్రియకు హాజరు కాకపోవడంతో వారందరినీ అనర్హులుగా ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు వారి కార్డులను రద్దు చేయనుంది. అర్హులైన వారికి కొత్త కార్డులను జారీ చేయనుంది. ఇందుకోసం అక్టోబరు నుంచి దరఖాస్తుల స్వీకరణకు చర్యలు తీసుకుంటోంది. ప్రస్తుతం రాష్ట్ర మొత్తం జనాభా 3.83 కోట్లు కాగా, 89.96 లక్షల తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. ప్రభుత్వం దరఖాస్తుదారుడి అర్హతలను పూర్తిగా విచారించకుండానే గతంలో కార్డులు జారీ చేయడంతో.. వీటి సంఖ్య ప్రతి ఏటా పెరుగుతూ వచ్చింది. దీంతో వీరిలో అనర్హులను గుర్తించేందుకు గత ఏడాది అక్టోబరు నుంచి ఈ-కేవైసీ ప్రక్రియ చేపట్టింది. ఇందులో భాగంగా ప్రతి తెల్ల కార్డుదారుడు కుటుంబసభ్యులందరితో కలిసి బయోమెట్రిక్ ఇవ్వాలని ఆదేశించింది. ఈ ప్రక్రియ ఆరు నెలలపాటు కొనసాగి.. ఈ ఏడాది మార్చిలో ముగిసింది. అయితే దాదాపు 15 లక్షల కార్డుదారులు ఈ-కేవైసీకి హాజరు కాలేదని తెలిసింది. ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడమో, మరే ఇతర కారణాలతోనే వీరు ఈ-కేవైసీకి హాజరు కాలేదు. దీంతో దాదాపు 15 లక్షల కార్డులు అనర్హుల పేరిట ఉన్నట్లు నిర్ధారించారు. ప్రస్తుతం ఆ కార్డులన్నింటినీ రద్దు చేయనున్నారు. వీటిని రద్దు



చేయడం ద్వారా.. కొత్తగా జారీ చేసే కార్డులతో ప్రభుత్వంపై అదనపు భారం పడకుండా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

ఏటా పెరిగిపోయిన కార్డులు..

తెల్ల రేషన్‌కార్డుల జారీ అంశం రాజకీయాలనూ ప్రభావితం చేస్తుంది. అందుకే ప్రతి ఎన్నికల్లో రేషన్ కార్డుల అంశాన్ని ప్రధాన పార్టీలు ప్రస్తావిస్తుంటాయి. ఎన్నికల్లో లబ్ధి పొందడమే లక్ష్యంగా గత ప్రభుత్వం హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో తెల్ల కార్డులు జారీ చేసింది. చివరిగా 2021లో రాష్ట్రవ్యాప్తంగా 3.60 లక్షల కొత్త కార్డులు జారీ చేశారు. వీటితో కలిపి రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 89.96 లక్షల మందికి తెల్ల రేషన్‌కార్డులు ఉన్నాయి. కాగా, ఈ కార్డులు కలిగిన కుటుంబాల్లో కొత్త సభ్యుల పేర్లను నమోదు చేసుకునేందుకు చాలా మంది దరఖాస్తు చేసుకున్నారు. మరికొందరు కొత్త కొర్డుల కోసం కూడా దరఖాస్తు చేశారు. గత కొన్నేళ్ల నుంచి ఇలా వచ్చిన దరఖాస్తులు దాదాపు 12 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. అక్టోబరు నుంచి కొత్త దరఖాస్తులు స్వీకరించనున్న నేపథ్యంలో.. ఇకపై రేషన్‌కార్డుల జారీలో పకడ్బందీగా వ్యవహరించాలని ప్రభుత్వం భావిస్తోంది. కార్డు జారీ చేశాక అనర్హులని తేలితే దానిని రద్దు చేయడం కంటే.. ప్రారంభంలోనే అర్హులను గుర్తించాలని యోచిస్తోంది. ఇందుకోసం కొత్త విధానాన్ని అమలు చేయనుంది. ప్రస్తుతం రాష్ట్రంలోని ప్రతి పౌరుడి డేటా ప్రభుత్వం వద్ద ఉంది. సిటిజన్ 360 పేరుతో పౌరుల వివరాలను గత ప్రభుత్వం సేకరించింది. ఇందులో ప్రతి పౌరుడి ఆధార్‌తో అనుసంధానమైన వివరాలన్నీ ఉన్నాయి. ఇప్పుడు ప్రభుత్వం ఇదే సాఫ్ట్‌వేర్‌ను తెల్ల రేషన్ కార్డుల జారీలో అర్హులను గుర్తించేందుకు ఉపయోగించాలని భావిస్తోంది. ఇప్పటికే రాష్ట్రంలోని అందరు తహసీల్దార్‌ల వద్ద ఈ సమాచారం అందుబాటులో ఉంది. వారికి సిటిజన్ 360 సాఫ్ట్‌వేర్ లాగిన్ వివరాలను మూడు నెలల క్రితమే అందించింది. దీని ద్వారా రేషన్‌కార్డులకు అర్హులైన వారిని తహసీల్దార్లు గుర్తించనున్నారు. ఆధార్‌తో ఆస్తులు, వాహనాల రిజిస్ట్రేషన్‌తోపాటు ఆదాయపు పన్ను చెల్లింపు వివరాలన్నీ అనుసంధానమై ఉన్నందున.. వాటి ఆధారంగా దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఇందులో అనర్హులుగా తేలినవారిని పక్కనబెట్టి అర్హులకు మాత్రమే కార్డును జారీ చేయనున్నారు.

అక్టోబరులో 4.25 లక్షల మందికి రుణమాఫీ!

(మొదటి పేజీ తరువాయి)

వివరాలు సరిచేశారు. మొత్తం 5.54 లక్షల మంది రైతుల్లో ఇప్పటివరకు 4.10 లక్షల మంది రైతుల వివరాలు సరిచేసి అప్‌లోడ్ చేశారు. ఇప్పటి వరకు సగటున 74 శాతం అప్‌లోడ్ ప్రక్రియ పూర్తయింది. ఈ నెలాఖరు వరకు మరో 15 వేల మంది వివరాలు అప్‌లోడ్ చేస్తామనే అంచనాతో వ్యవసాయశాఖ అధికారులున్నారు. అంతా కలిపి 4.25 లక్షల మంది రైతులు నాలుగో విడత రుణమాఫీలో లబ్ధిదారులుగా ఉండనున్నారు. వీరికి సగటున రూ. లక్ష చొప్పున బకాయిలున్నా.. సుమారు రూ.4,250 కోట్లు సర్దుబాటు చేయాల్సి ఉంటుంది. దాదాపుగా స్థానికంగా ఉన్న రైతుల కుటుంబ నిర్ధారణ, డేటా అప్‌లోడ్ పూర్తయింది. ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న రైతులకు సంబంధించి డేటా అప్‌లోడ్ పెండింగ్ పడింది. లోన్ తీసుకున్న రైతు కుటుంబంలో ఎవరో ఒకరు (భార్య/భర్త) అందుబాటులో ఉన్నా ఫొటో, డిక్లరేషన్, సెల్ఫీ తీసుకొని అప్‌లోడ్ చేస్తున్నారు. ఏ ఒక్కరూ అందుబాటులో లేకపోతే పెండింగ్ జాబితాలో పెట్టారు. ఏవోలు కూడా బ్యాంకర్ల నుంచి రైతుల వివరాలు తీసుకొని.. స్థానికంగా లేనివారికి ఫోన్లు చేసి సమాచారం ఇచ్చారు. అయితే కొందరు రైతులు ఇప్పటికీ రావడం లేదు. అలాంటి వారి డేటా అప్‌లోడ్ చేయలేదు. రేషన్ కార్డులు లేని వారిలో 1.18 లక్షల మంది రైతులు ఏవోలకు అందుబాటులోకి రాలేదు. ఆధార్‌లో తప్పులున్న రైతులు 26 వేల మందికి సంబంధించి సమాచారాన్ని సరిచేసే అంశం పెండింగ్‌లో ఉంది. వీరిలో నెలాఖరు వరకు 15 వేల మంది అందుబాటులోకి రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు ఫ్యామిలీ గ్రూపింగ్, డేటా అప్‌లోడ్ పూర్తిచేయనున్నారు.

మిస్సింగ్ కేసు విచారణ.. ఇద్దరిపై థర్డ్ డిగ్రీ?

- హింస తట్టుకోలేక ఒకరి పరారీ
- వారిద్దరూ బీఆర్ఎస్ కార్యకర్తలు
- ఠాణా ఎదుట బీఆర్ఎస్ నేతల ఆందోళన

మర్పల్లి, సెప్టెంబరు 24: వికారాబాద్ జిల్లా మర్పల్లి పోలీస్‌స్టేషన్ వద్ద బీఆర్ఎస్-కాంగ్రెస్ పోటాపోటీ ఆందోళనలతో గంటన్నరపాటు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఓ మిస్సింగ్ కేసులో ఇద్దరు అన్నదమ్ములను ఠాణాకు తీసుకువచ్చిన పోలీసులు.. థర్డ్ డిగ్రీ ప్రయోగించారనే ఆరోపణలు రావడంతో బీఆర్ఎస్ నేతలు.. కార్యకర్తలు పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేపట్టారు. ఈ నెల 21న మర్పల్లి మండల పరిధిలోని పట్లూర్ గ్రామ శివారులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో లభ్యమైంది. 20 రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన మర్పల్లి రాములు అదృశ్యమయ్యారు. ఈ కేసుల్లో పోలీసులు దర్యాప్తు నిమిత్తం రాములుకు కొడుకు వరుసైన అన్నదమ్ములు ప్రవీణ్, నవీన్‌లను మంగళవారం తెల్లవారుజామున అదుపులోకి తీసుకున్నారు. వీరిద్దరూ బీఆర్ఎస్ కార్యకర్తలు. పోలీసులు చిత్రహింసలకు గురిచేస్తున్నారంటూ ప్రవీణ్ ఠాణా నుంచి పారిపోయి.. జడ్పీటీసీ మాజీ సభ్యుడిని ఆశ్రయించారు. దాంతో బీఆర్ఎస్ శ్రేణులు పెద్దఎత్తున ఠాణా వద్దకు చేరుకుని, ఆందోళన చేపట్టాయి. కాంగ్రెస్ పార్టీ, అసెంబ్లీ స్పీకర్‌కు వ్యతిరేకంగా నినాదాలివ్వడంతో.. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు కూడా ఆందోళన చేపట్టారు. విషయం తెలుసుకున్న బీజేపీ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ ఠాణాకు చేరుకుని, సీఐని అడిగి వివరాలు తెలుసుకున్నారు. గుర్తుతెలియని మృతదేహం ఎవరిదో తెలియకుండానే.. అనుమానితుల పేరుతో తమ కార్యకర్తలను అరెస్టు చేయడాన్ని ఖండించారు. ఈ క్రమంలో "మాజీ ఎమ్మెల్యేకు ఠాణాలో ఏం పని?" అంటూ కాంగ్రెస్ వర్గాలు నిలదీయడంతో.. ఇరు వర్గాల మధ్య ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ కేసుతో కాంగ్రెస్ పార్టీకి.. అసెంబ్లీ స్పీకర్‌కు ఏం సంబంధం అని ప్రశ్నించారు. దాదాపు గంటన్నరపాటు ఠాణా వద్ద ఉద్రిక్త పరిస్థితులు కొనసాగాయి. మెతుకు ఆనంద్, ఇతర నాయకులను పోలీసులు అక్కడి నుంచి తరలించారు. దాంతో పరిస్థితులు అదుపులోకి వచ్చాయి. కాగా.. తాము ఎవరిపై థర్డ్ డిగ్రీ ప్రయోగించలేదని మర్పల్లి ఎస్సై సురేశ్ వివరించారు. అదృశ్యమైన వ్యక్తి కేసు విచారణలో భాగంగా ఇద్దరిని ఠాణాకు తీసుకొస్తుండగా.. ఒకరు పీఎస్ నుంచి పారిపోయినట్లు తెలిపారు.



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, కామారెడ్డి మునిసిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ

ఆరేళ్ల బాలికతో పీఈటీ అసభ్య ప్రవర్తన

- కామారెడ్డిలో ప్రైవేట్ పాఠశాలలో ఘటన
- నిందితుడిని శిక్షించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థిసంఘాల ఆందోళన
- పోలీసులు, ఆందోళనకారుల మధ్య తోపులాట
- సీఐ తలకు తీవ్ర గాయం.. లాఠీచార్జి చేసిన పోలీసులు

కామారెడ్డిటౌన్, సెప్టెంబరు 24: అభం శుభం తెలియని ఆరేళ్ల చిన్నారి పట్ల ఓ పీఈటీ అసభ్యంగా ప్రవర్తించాడు. బాలికను ఎక్కడపడితే అక్కడ తాకుతూ వికృత చేష్టలకు పాల్పడ్డాడు. ఈ ఘటన కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో జరిగింది. సదరు పీఈటీని కఠినంగా శిక్షించాలని చిన్నారి తల్లిదండ్రులతో కలిసి విద్యార్థి సంఘాలు మంగళవారం సదరు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగాయి. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాగరాజు అనే వ్యక్తి పీఈటీగా పనిచేస్తున్నాడు. అదే పాఠశాలలో ఒకటో తరగతి చదువుతున్న ఆరేళ్ల బాలికతో నాగరాజు శనివారం అసభ్యంగా ప్రవర్తించాడు. సోమవారం పాఠశాలకు వెళ్లేందుకు చిన్నారి భయపడడంతో తల్లిదండ్రులు ఆరా తీయగా చిన్నారి జరిగిన విషయం వివరించింది. దాంతో వారు సోమవారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. విషయం తెలుసుకున్న విద్యార్థి సంఘాల నాయకులు మంగళవారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. నాగరాజును, సదరు పాఠశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మునిసిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ కూడా ఆందోళనకారులకు మద్దతుగా పాఠశాల వద్ద బైఠాయించారు. ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్‌రావు ఘటనాస్థలానికి వచ్చి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. అయినా ఆందోళనకారులు వెనక్కి తగ్గలేదు. దాంతో పోలీసులకు వారికి మధ్య తోపులాట జరిగింది. నిరసనకారుల్లోంచి కొంతమంది రాళ్లు విసిరారు. ఓ రాయి సీఐ చంద్రశేఖర్ తలకు తగిలి గాయమైంది. తోపులాటలో ఎస్సై రాజారాం అస్వస్థతకు గురయ్యారు. ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ అజారోద్దిన్ కాలు విరిగింది. పోలీసులు లాఠీచార్జ్ చేసి ఆందోళనకారులను చెదరగొట్టి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. ఆ తర్వాత ఎస్పీ సింధూ శర్మ, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి నిరసనకారులతో మాట్లాడి వారి డిమాండ్‌లు తెలుసుకొని, నిందితుడిపై చర్యలు తీసుకుంటామని వివరించారు.

పీఈటీపై పోక్సో కేసు.. అరెస్టు

పీఈటీ నాగరాజుపై పోక్సో కేసు నమోదు చేసి, అరెస్టు చేసినట్లు ఎస్పీ సింధూశర్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21న నాగరాజు పాఠశాలలో చిన్నారిపట్ల అసభ్యంగా ప్రవర్తించాడని సోమవారం చిన్నారి తల్లిదండ్రులు కామారెడ్డి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని చెప్పారు. చిన్నారి ఆరోగ్యంగానే ఉందని, ఎలాంటి అపోహలను నమ్మవద్దని అన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Madikonda Village, Hanamkonda (Mdl), Warangal (Dist.), Editor: K. Srinivas. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.

ఐఐటీ మద్రాస్‌లో ఈఎంబీఏ

మద్రాస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీఎం) నిర్వహిస్తున్న డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్(డీఓఎంఎస్)- ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(ఈఎంబీఏ) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆప్టిట్యూడ్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. దీనిని వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ప్రత్యేకించారు. వారాంతాల్లో క్లాస్ రూమ్ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి. మూడు ప్రాజెక్ట్ వర్క్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది. ప్రోగ్రామ్‌లో భాగంగా కేస్ డిస్కషన్స్, సమ్మర్



ఇంటర్న్‌షిప్, ఎలక్టివ్ కోర్సులు ఉంటాయి. తొమ్మిది రోజుల ఇంటర్నేషనల్ ఇమ్మర్షన్ లెర్నింగ్ కోర్సు జతగా ఉంటుంది. ఇది 'గ్లోబల్ లీడర్‌షిప్ అండ్ కల్చరల్ ఇంటెలిజెన్స్'కు సంబంధించి ఉంటుంది. దీనిని బ్రస్సెల్స్-బెల్జియం; లిల్లీ& పారిస్-ఫ్రాన్స్‌లోని ఎస్‌ఈజీ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ క్యాంపస్‌లలో నిర్వహిస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమశ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిసెంబరు 31 నాటికి కనీసం మూడేళ్ల అనుభవం ఉండాలి.


ఆప్టిట్యూడ్ టెస్ట్: ఇందులో బిజినెస్ ఆప్టిట్యూడ్, లాజికల్ రీజనింగ్, క్వాంటిటేటివ్ ఎబిలిటీ, వెర్బల్ ఎబిలిటీ అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 20
- **వెబ్‌సైట్:** doms.iitm.ac.in

జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయంలో డిస్టెన్స్ కోర్సులు

తిరుపతిలోని జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం(ఎన్ఎస్‌కేటీయూ-సెంట్రల్ యూనివర్సిటీ)కి చెందిన సెంటర్ ఫర్ డిస్టెన్స్ అండ్ ఆన్‌లైన్ ఎడ్యుకేషన్(సీడీఓఈ)- ఓపెన్ అండ్ డిస్టెన్స్ లెర్నింగ్(ఓడీఎల్) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.



సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సు

కోర్సు వ్యవధి ఆర్నెల్లు. గరిష్ఠంగా ఏడాదిలో పూర్తిచేయాలి. సంస్కృత మాధ్యమంలో బోధన ఉంటుంది.

అర్హత: దేవనాగరి లిపి రాయడం, చదవడం తెలిసి ఉండాలి. ఆగస్టు 15 నాటికి అభ్యర్థుల వయసు పదమూడేళ్లు నిండి ఉండాలి.

సంస్కృతంలో డిప్లొమా కోర్సు

కోర్సు వ్యవధి ఏడాది. గరిష్ఠంగా మూడేళ్లలో పూర్తిచేసే వీలుంది. ట్రెడిషనల్ సబ్జెక్టులను సంస్కృత మాధ్యమంలో, మోడరన్ సబ్జెక్టులను ఇంగ్లీష్ మాధ్యమంలో బోధిస్తారు. ఈ కోర్సు పూర్తిచేసినవారు సమ్మానిత శాస్త్రీ/బీఏ ప్రోగ్రామ్‌లో నేరుగా ప్రవేశం పొందవచ్చు.

అర్హత: ఆర్ఎస్ విద్యాపీఠం/ఎన్ఎస్ యూనివర్సిటీ నుంచి సంస్కృతంలో సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేసినవారు, న్యూఢిల్లీలోని ఆర్ఎస్ సంస్థానం నుంచి సంస్కృత ప్రథమ దీక్ష కోర్సు ఉత్తీర్ణులు, ప్రాక్ శాస్త్రీ/ ఇంటర్ మొదటి సంవత్సరం పూర్తిచేసినవారు అప్లయ్ చేసుకోవచ్చు. వయసు పదహారేళ్లు నిండి ఉండాలి.

ప్రాక్ శాస్త్రీ

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయవచ్చు. ఇది ఇంటర్ లెవెల్ ప్రోగ్రామ్

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణులు, పూర్వ మాధ్యమ కోర్సు పూర్తిచేసినవారు; శాన్‌స్క్రిట్ ఎంట్రెన్స్ ఎగ్జామ్‌లో అర్హత సాధించినవారు; వేద భూషణ్ సర్టిఫికెట్ కోర్సు ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. పదోతరగతి స్థాయిలో సంస్కృతం ఒక సబ్జెక్టుగా చదివినవారికి, ఎస్ఎస్‌యూ నుంచి సర్టిఫికెట్ ప్రోగ్రామ్ ఆఫ్ శాన్‌స్క్రిట్ పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి పదిహేనేళ్లు నిండి ఉండాలి.

బీఏ ఆనర్స్ శాంస్క్రిట్

ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తిచేయాలి.

అర్హత: ఇంటర్/ప్రాక్ శాస్త్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ స్థాయిలో సంస్కృతం ఒక సబ్జెక్టుగా చదివినవారికి; ఎస్ఎస్‌యూ నుంచి సంస్కృతంలో సర్టిఫికెట్/డిప్లొమా కోర్సులు పూర్తిచేసినవారికి; ఇతర సంస్కృత సంబంధిత ప్రోగ్రామ్‌లు ఉత్తీర్ణులైనవారికి ప్రాధాన్యం ఉంటుంది. ఆగస్టు 15 నాటికి వయసు పదిహేడేళ్లు నిండి ఉండాలి.

శాస్త్రీ ఆనర్స్ సాహిత్య, శాస్త్రీ ఆనర్స్ వ్యాకరణ

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి నాలుగేళ్లు. గరిష్ఠంగా ఎనిమిదేళ్లలో పూర్తిచేయాలి. ఇవి డిగ్రీ లెవెల్ ప్రోగ్రామ్‌లు.

అర్హత: ఇంటర్/ప్రాక్ శాస్త్రీ/ఉత్తర మాధ్యమ/ మాధ్యమ/వరిష్ఠోపాధ్యాయ/ఉప శాస్త్రీ/సాహిత్య/వేద విభూషణ కోర్సులు పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. డిప్లొమా ఇన్ సంస్కృతం/విచక్షణ కోర్సు పూర్తిచేసినవారికి ప్రాధాన్యం ఉంటుంది. వయసు పదిహేడేళ్లు నిండి ఉండాలి.

ఆచార్య సాహిత్య, ఆచార్య పురాణేతిహాస, ఆచార్య ఫలిత జ్యోతిష, ఆచార్య ధర్మ శాస్త్ర

ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాలి. సంస్కృత మాధ్యమంలో బోధన ఉంటుంది. ఇవి పీజీ లెవెల్ ప్రోగ్రామ్‌లు.

అర్హత: మూడేళ్ల డిగ్రీ/శాస్త్రీ/బీఏ సంస్కృతం/శిరోమణి/మాధ్యమ/శాస్త్ర భూషణ/విద్యా ప్రవీణ/విద్యాలంకార /వేదాలంకార /విద్వత్ మాధ్యమ/బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్/ బ్యాచిలర్ ఆఫ్ ఆయుర్వేదిక్ మెడిసిన్ అండ్ సర్జరీ పూర్తిచేసినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 20 ఏళ్లు నిండి ఉండాలి. ఎన్ఈపీ 2020 నిబంధనల ప్రకారం ప్రోగ్రామ్‌ల నుంచి వైదొలగే వీలుంది.

పీజీ డిప్లొమా ఇన్ యోగ విజ్ఞాన

ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. గరిష్ఠంగా నాలుగేళ్లలో పూర్తిచేయాలి. ఇంగ్లీష్ లేదా సంస్కృత మాధ్యమంలో బోధన ఉంటుంది.

అర్హత: ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు ఆగస్టు 15 నాటికి 20 నుంచి 45 ఏళ్ల మధ్య ఉండాలి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.700
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 10
- **వెబ్‌సైట్:** https://nsktu.ac.in

ఐఐఎఫ్‌టీలో పీజీ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్

న్యూఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారిన్ ట్రేడ్(ఐఐఎఫ్‌టీ)- పోస్ట్ గ్రాడ్యుయేట్ సర్టిఫికెట్ ఇన్ మేనేజ్‌మెంట్(ఇంటర్నేషనల్ బిజినెస్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీని వ్యవధి ఏడాది. ఇది వీకెండ్ ఆన్ క్యాంపస్ ప్రోగ్రామ్. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది.

ప్రోగ్రామ్ వివరాలు

- ఇందులో మూడు ట్రైమెస్టర్లు ఉంటాయి. ప్రతి ట్రైమెస్టర్ ప్రారంభంలో మూడు రోజులు కాంటాక్ట్ వీక్ నిర్వహిస్తారు. రెండో ట్రైమెస్టర్‌లో పోర్ట్ విజిట్ ఉంటుంది.

అర్హత

- గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. రిజర్వ్‌డ్ వర్గాలవారికి 45 శాతం మార్కులు చాలు. వర్కింగ్ ప్రొఫెషనల్స్‌కు ఈ ప్రోగ్రామ్ అనుకూలంగా ఉంటుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.750
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 5
- **వెబ్‌సైట్:** www.iift.ac.in



ఆంధ్ర యూనివర్సిటీలో పీజీ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్(ఏయూడీఓఏ)- స్పాన్సర్డ్ కేటగిరీ ఎంటెక్ రెగ్యులర్ ప్రోగ్రామ్ సహా ఎంటెక్, ఎం ప్లానింగ్ ఈవెనింగ్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. వీటిని ఏయూ ఇంజనీరింగ్ కాలేజీ నిర్వహిస్తుంది. ఒక్కో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. వర్సిటీ ఈ ఏడాది నుంచి నూతనంగా ఎంటెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్ (ఆన్‌లైన్) ప్రోగ్రామ్‌ను కూడా ఆరంభించింది. ఈ ప్రోగ్రామ్‌లను స్థానిక ఉద్యోగులకు ప్రత్యేకించారు.

స్పాన్సర్డ్ ఎంటెక్ (రెగ్యులర్) ప్రోగ్రామ్

గేట్ వ్యాలిడ్ స్కోర్/ఏపీ పీజీఈసెట్ 2024 స్కోర్ ఆధారంగా కౌన్సెలింగ్ నిర్వహించి అడ్మిషన్స్ ఇస్తారు. అభ్యర్థులు పనిచేస్తున్న సంస్థ నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్, స్పాన్సర్‌షిప్ సర్టిఫికెట్ సబ్మిట్ చేయాలి.

స్పెషలైజేషన్‌లు-సీట్లు: కెమికల్ ఇంజనీరింగ్ 2, సివిల్ ఇంజనీరింగ్ 12, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 2, మెకానికల్ ఇంజనీరింగ్ 11, జియో ఇంజనీరింగ్ 2, మెరైన్ ఇంజనీరింగ్ 1, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ 11, ఇన్‌స్ట్రుమెంటేషన్ టెక్నాలజీ 1, మెటలర్జికల్ ఇంజనీరింగ్ 1, కంప్యూటర్ సైన్స్ అండ్ సిస్టమ్స్ ఇంజనీరింగ్ 4, నానో టెక్నాలజీ 1



ఎంటెక్, ఎం ప్లానింగ్ ఈవెనింగ్ ప్రోగ్రామ్‌లు

గేట్/పీజీఈసెట్/ ఐసెట్ అర్హత పొందిన అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుంది. కౌన్సెలింగ్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఎంటెక్ స్పెషలైజేషన్‌లు-సీట్లు: కెమికల్ ఇంజనీరింగ్ 18, స్ట్రక్చరల్ ఇంజనీరింగ్ 18, పవర్ ఎలక్ట్రానిక్ డ్రైవ్స్ అండ్ కంట్రోల్ 18, రాడార్ అండ్ మైక్రోవేవ్ ఇంజనీరింగ్ 30, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ 30, జియో ఇంజనీరింగ్ 18, రిమోట్ ఇంజనీరింగ్ 18, నేవల్ ఆర్కిటెక్చర్ 18, ఇండస్ట్రియల్ ఇంజనీరింగ్ 18, క్యాడ్/క్యామ్ 18, థర్మల్ ఇంజనీరింగ్ 18, ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్ 18, మెడికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ 18, ఇండస్ట్రియల్ మెటలర్జీ 18, కంప్యూటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఆన్‌లైన్) 30, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషిన్ లెర్నింగ్(ఆన్‌లైన్) 18

ఎం ప్లానింగ్: ఈ ప్రోగ్రామ్‌లో ఎన్విరాన్‌మెంటల్ స్పెషలైజేషన్ ఉంది. మొత్తం 18 సీట్లు ఉన్నాయి.

అర్హత వివరాలు

ఎంటెక్ ప్రోగ్రామ్‌లకు స్పెషలైజేషన్‌ను అనుసరించి కెమికల్/ సివిల్/ ఈఈఈ/ ఈసీఈ/ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/నేవల్ ఆర్కిటెక్చర్/ మెకానికల్/మెరైన్/ఏరోనాటికల్/ ఇండస్ట్రియల్/ ప్రొడక్షన్/ఇన్‌స్ట్రుమెంటేషన్/కంట్రోల్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/మెటలర్జీ/కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగాల్లో బీఈ/బీటెక్/ఏఎంఐఈ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. నిర్దేశించిన స్పెషలైజేషన్‌లకు ఎమ్మెస్సీ(ఎలక్ట్రానిక్స్/ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్/ ఫిజిక్స్/ అప్లయిడ్ ఫిజిక్స్/వీఎల్ఎస్ఐ డిజైన్/డీఎస్‌పీ& ఈఎస్‌డీ)/ ఎంసీఏ/బీఆర్క్ ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ఎం ప్లానింగ్ ప్రోగ్రామ్‌నకు అయిదేళ్ల బ్యాచిలర్ డిగ్రీ(ఆర్కిటెక్చర్)/ బీఆర్క్/బీ ప్లానింగ్/ బీఈ(సివిల్/ఎన్విరాన్‌మెంటల్)/ఎంఏ(సోషియాలజీ/ ఎకనామిక్స్/జాగ్రఫీ) ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిగ్రీ స్థాయిలో కనీసం 50 శాతం మార్కులు ఉండాలి. రిజర్వ్‌డ్ వర్గాల అభ్యర్థులకు 45 శాతం చాలు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** స్పాన్సర్డ్ ఎంటెక్(రెగ్యులర్) ప్రోగ్రామ్‌నకు రూ.2000; ఈవెనింగ్ ప్రోగ్రామ్‌లకు రూ.1000
- **కౌన్సెలింగ్ ఫీజు:** స్పాన్సర్డ్ ఎంటెక్‌నకు రూ.500; ఈవెనింగ్ ప్రోగ్రామ్‌లకు రూ.600
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** సెప్టెంబరు 26 ● **కౌన్సెలింగ్ తేదీ:** సెప్టెంబరు 27
- **వెబ్‌సైట్:** www.audoa.andhrauniversity.edu.in

SCHOLARSHIP ALERT

Adani Gyan Jyoti Scholarship 2024-25

Description: Adani Group is offering this scholarship to first-year students who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh and are pursuing courses related to JEE, NEET, CLAT, CA Foundation, and Economics, supporting their educational journey.

Eligibility: * Open for candidates who are domiciles of Andhra Pradesh, Rajasthan, Gujarat, Odisha, and Chhattisgarh only.

* Only first-year students pursuing BA Economics, BSc Economics, BEc, B.E./B.Tech., Integrated 5-Year Dual-Degree M.Tech., MBBS, and LLB courses are eligible.
* Applicants must have passed their higher secondary/pre-university/intermediate/CBSE/ISC or equivalent board exams after 2023.
* Admission must be based on the merit rank from state or national-level entrance exams.
* Family income must not exceed INR 4,50,000 per annum from all sources.

Prizes & Rewards: Up to INR 3,50,000 (tuition fee) annually.

Last Date to Apply: 07-10-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/AGSP5

SBIF Asha Scholarship Program 2024

Description: The SBIF Asha Scholarship Program 2024, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation. This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to school students from Class 6 to 12 and undergraduate & postgraduate students from the top 100 NIRF universities/colleges, undergraduate students from IITs, and students pursuing MBA/PGDM courses from IIMs. Applicants must have scored a minimum of 75% marks in the previous academic year. Their gross annual family income must be up to INR 6 lakh (Up to INR 3 lakh for Class 6-12 students).

Prizes & Rewards: * Classes 6 to 12: INR 15,000 each

* UG Students: Up to INR 50,000
* PG Students: Up to INR 70,000
* UG Students from IITs: Up to INR 2,00,000
* MBA Students from IIMs: Up to INR 7,50,000

Last Date to Apply: 01-10-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/SBIFS7

Reliance Foundation Post graduate Scholarships 2024-25

Description: The Reliance Foundation Postgraduate Scholarships aim to enable and propel India's future leaders who can think big, think green, and think digital for the benefit of society.

Eligibility: * Students who are enrolled in the first-year full-time regular postgraduation programmes pursuing select future-ready courses from Engineering, Technology, Energy and Life-Sciences

* Must have secured 550 to 1,000 in the GATE examination

OR

* Must have scored 7.5 or above in their undergraduate CGPA (or % normalized to CGPA) [If students have not attempted GATE]
* Open for resident Indian citizens.

Prizes & Rewards: Up to INR 6,00,000 over the duration of the degree

Last Date to Apply: 06-10-2024

Application mode: Online applications only

Short Url: www.b4s.in/aj/RFS10

buddy4study.com

చిట్టీ




పచ్చటి గుర్రం




చతురతకు, చమత్కారానికి మారుపేరైన బీర్బల్, అక్బరు కొలువులో కొత్తగా చేరిన కొన్నిరోజులకు ఇద్దరూ వేటకు వెళ్లారు. అక్కడి ప్రకృతిని చూసి, మైమరచిపోయిన బీర్బల్ 'ఇంత పచ్చని చెట్ల నడుమ, పచ్చటి కొండలలో ఒక ఆకుపచ్చని గుర్రం మీద వెళితే ఎంత మజాగా ఉంటుందో కదా' అన్నాడు ఏదో ఆలోచిస్తూ. ఆ మాటలు విన్న అక్బరు 'ఏదీ పచ్చటి గుర్రం అన్నావే వారం రోజుల్లోగా నువ్వు నాకు, ఆ పచ్చటి గుర్రాన్ని తెచ్చి ఇవ్వాలి' అని ఆజ్ఞాపించి ఇదెలా సాధిస్తాడో చూద్దాం అని లోలోపల నవ్వుకుంటాడు. వారం రోజులు గడిచాక బీర్బల్ హడావుడిగా కొలువుకు వచ్చి 'జహాపనా.. ఒక చోట మీరడిగిన పచ్చటి గుర్రం దొరికింది. కానీ ఆ గుర్రం యజమాని మీరు స్వయంగా వస్తేనే, గుర్రం అమ్ముతా అంటున్నాడు' అని చెప్పాడు. అంత అరుదైన గుర్రం కోసం నేను రావడమే సముచితం, తప్పక వస్తాను అన్నాడు అక్బరు. కానీ అతను మీకు ఆ గుర్రాన్ని వారంలో ఎనిమిదవ రోజు మాత్రమే అమ్ముతాడట' అన్నాడు బీర్బల్, అక్బరు ఇవాళ శుక్రవారం రేపు శనివారం ఎనిమిదవ రోజు ఏదంటే అని లెక్క వేస్తూ ఒక్కసారిగా నాలిక కరుచుకుని, "వారంలో ఎనిమిది రోజులు ఎలా ఉంటాయి నీ చమత్కారం కాకపోతే?' అన్నాడు. దానికి బీర్బల్ మరి ఆకు పచ్చటి గుర్రం మాత్రం ఎలా ఉంటుంది జహాపనా? నేనేదో సరదాగా అంటే మీరు దాన్ని నిజంగా తీసుకురమ్మంటే నేనేంచేయగలను? అన్నాడు బీర్బల్.

10 తేడాలను కనిపెట్టండి



ఎవి ఎన్ని?



సరైన నీడ ఏది?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 418

	9		2		8			
4		3		5			8	
				4				3
		8				9		4
	7						1	
1		5				7		
7				1				
	1			9		2		8
			3		2		4	

సుడోకు - 417 సమాధానం

2	7	3	9	4	1	6	5	8
8	4	6	5	9	2	1	3	7
1	5	9	7	2	8	4	6	3
5	8	4	3	1	6	2	7	9
9	6	7	4	8	3	5	1	2
6	3	8	2	5	4	7	9	1
3	1	2	8	6	7	9	4	5
4	2	5	1	7	9	3	8	6
7	9	1	6	3	5	8	2	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.